


# న్యూస్-9

సామాజిక అవసరం...సామాన్యుడి ఆయుధం

తెలుగు దినపత్రిక


news9telengana@gmail.com www.news9-india.com

సంపుటి : 19 | సంచిక : 149 | వెల : 4 | బుధవారం 14 మే 2025 | www.news9-india.com | హైదరాబాద్ | విశాఖపట్నం | పేజీలు : 12





- అది మన సంప్రదాయం..విధానం కూడా
- వీర సైనికులు అందరికీ సెల్యూట్ చేస్తున్నా
- ప్రపంచమంతా మార్మోగిన ఆపరేషన్ సిందూర్ నినాదం
- యుద్ధక్షేత్రంలో జై భారత్ మాతా నినాదాలు
- ఆదంపూర్ ఎయిర్‌బేస్‌ను సందర్శించిన మోడీ
- సైనికులకు సెల్యూట్ చేసి ముచ్చటించిన ప్రధాని

## ధర్మ సంస్థాపన కోసం



# ఆయుధం పట్టాల్సిందే...



**చండీఘడ్, మే 13:** ధర్మ సంస్థాపన కోసం ఆయుధం పట్టడం.. మన సంప్రదాయం.. మన విధానమని ప్రధాని మోదీ స్పష్టం చేశారు. మన సైన్యం చూపిన శక్తి సామర్థ్యాలు భావితరాలకు గొప్ప ప్రేరణ అని ఆయన అభివర్ణించారు. ఈ భూమి నుంచి వీర సైనికులు అందరికీ తాను సెల్యూట్ చేస్తున్నారన్నారు. వీర సైనికుల పరాక్రమంతో ఆపరేషన్ సిందూర్ నినాదం.. ప్రపంచమంతా మార్మోగు తోందని తెలిపారు. మంగళవారం పంజాబ్‌లోని అదంపూర్ ఎయిర్‌బేస్‌ను ప్రధాని మోదీ సందర్శించారు. సైనికులతో ఆయన మాట్లాడారు. అనంతరం సైనికులను ఉద్దేశించి ప్రసంగించారు. మన సైన్యం చేపట్టిన ఈ పరాక్రమం.. భారత్ సామర్థ్యానికి ప్రతి రూపమని పేర్కొన్నారు. భారత్ చూపిన ఈ పరా క్రమం.. త్రివిధ దళాల త్రివేణీ సంగ మమన్నారు. పాకిస్థాన్‌కు భారత వాయు సేన తన సత్తా చాటిందంటూ ప్రశంసల జల్లు కురిపించారు. యుద్ధ క్షేత్రంలోనూ భారత్ మాతాకీ జై నినాదాలు చేశామని..

వివరాలు 2లో

## మా సైనికులు 11మంది మృతి చెందారు: పాక్



**ఇస్లామాబాద్,మే 13:** పహల్గాం ఉగ్రదాడి అనంతరం భారత్ జరిపిన దాడుల్లో 11 మంది సైనికులు మరణించారని పాకిస్థాన్ సైన్యం వెల్లడించింది. మరో 78 మంది తీవ్రంగా గాయపడ్డారని తెలిపింది. వీరిలో సైనికులతో పాటు ఐదుగురు ఎయిర్ ఫోర్స్ సిబ్బంది ఉన్నట్లు పాకిస్థాన్ ఆర్మీ వివరించింది. గాయపడిన వారు వివిధ ఆసుపత్రుల్లో చికిత్స పొందుతున్నారని చెప్పింది. ఈ మేరకు పాకిస్థాన్ ఆర్మీ మంగళవారం ఓ ప్రకటన విడుదల చేసింది. 40 మంది పౌరులు కూడా పలు చోట్ల జరిగిన

వివరాలు 2లో

## రిటైర్మెంట్ తర్వాత ఎలాంటి పదవులూ స్వీకరించను

- చివరి రోజు విధి నిర్వహణల అనంతరం సిజెఐ ఖన్నా వెల్లడి
- నేడు కొత్త సిజెఐగా గవాయ్ బాధ్యతలు





## కుటుంబ సమేతంగా సిఎంను కలిసిన సమాచార కమిషనర్లు

**/హైదరాబాద్,మే13:** జూబ్లీహిల్స్ నివాసంలో ముఖ్యమంత్రిని సమాచార కమిషనర్లుగా నియమితులైన నలుగురు కలిశారు. వీరంతా కుటుంబ సమేతంగా కలిసి సిఎంకు కృతజ్ఞతలు తెలిపారు. నూతన సమాచార కమిషనర్లు పీవీ శ్రీనివాసరావు, బోరెడ్డి అయోధ్యరెడ్డి, దేశాల భూపాల్, మొహిసినా పర్వీన్‌లు తమ కుటుంబాలతో సిఎంను కలవడం విశేషం. వారికి సిఎం అభినందనలు తెలిపారు.

## సిబిల్ స్కోర్‌తో సంబంధం లేదు

- రాజీవ్ యువ వికాసం స్కీమ్‌పై భట్టి స్పష్టం



**/భద్రాద్రి కొతగూడెం,మే13:** రాష్ట్రం లోని నిరుద్యోగ యువతకు స్వయం ఉపాధి కల్పించేందుకు తెలంగాణ ప్రభుత్వం రాజీవ్ యువ వికాసం స్కీమ్‌ను తీసుకొచ్చిన విషయం తెలిసిందే. అయితే.. సిబిల్ స్కోర్ ఆధారంగా లబ్ధిదారులను ఎంపిక చేస్తారని ప్రచారం జరగడంతో యువతలో ఆందోళన నెలకొంది. గ్రామ యువతకు సిబిల్ స్కోర్‌పై పెద్దగా అవగాహన ఉండదని.. స్కీమ్ గైడ్ లైన్స్‌లో ఈ అంశాన్ని చేర్చొద్దని పలువురు డిమాండ్ చేస్తున్నారు. ఈ క్రమంలో రాజీవ్ యువ వికాసం స్కీముపై డిప్యూటీ- సీఎం భట్టి విక్రమార్క క్లారిటీ- ఇచ్చారు. సిబిల్ స్కోర్‌తో రాజీవ్ వికాసం స్కీమ్‌కు ఎలాంటి సంబంధం లేదని ఆయన స్పష్టం చేశారు. అవగాహన లేని కొన్ని సోషల్ మీడియా, ఇతర సంస్థలు సిబిల్ స్కోర్ విషయంలో తప్పుడు ప్రచారం చేస్తున్నాయని అన్నారు. ఈ స్కీమ్‌కు సంబంధించి

వివరాలు 2లో

## నేను క్రమశిక్షణ కలిగిన కార్యకర్తను

- కెసిఆర్ ఆదేశాలు తు.చ తప్పకుండా పాటిస్తా
- కెటిఆర్‌ను పార్టీ అధ్యక్షుడిని చేసినా అనుసరిస్తా
- పార్టీ మారడం అన్న ప్రచారంలో నిజం లేదు: హరీష్



## చార్మినార్ వద్ద సుందరీమణుల సందడి

- గ్రూప్ ఫోటోలు దిగిన అందాల అతివలు
- లాడ్ బజార్‌లో షాపింగ్ చేసిన ముద్దుగుమ్మలు



**/హైదరాబాద్,మే13:** ప్రపంచ సుందరీమణులు మంగళవారం సాయంతరి హైదరాబాద్ పాతబస్తీలో సందడి చేశారు. చార్మినార్ దగ్గర 109 దేశాల అందగత్తెలకు రెడ్ కార్పెట్ తో.. సంప్రదాయ అరబ్బీ మర్ఫా సంగీతంతో స్వాగతం పలికారు. చార్మినార్ అందాలను, చుట్టుపక్కల ప్రాంతా లను తమ సెల్ ఫోన్లలో బంధించు కున్నారు. ఆ తర్వాత చార్మినార్ దగ్గర ప్రత్యేక ఫోటో షూట్ నిర్వహించారు. లాడ్ బజార్ లోని తొమ్మిది ప్రముఖ దుకాణాల్లో ఈ సుందరీమణులు షాపిం గ్ చేసారు. గాజులు, ముత్యాల హారాలు, ఇంకా అలంకరణ వస్తువులు కొనుగోలు చేయడమే కాక.. అక్కడే గాజులు తయారీ విధానాన్ని కూడా స్వయంగా వీరు పరిశీలించారు. నాలుగు గ్రూపులుగా విడిపోయి ఒక్కో గ్రూప్ రెండు షాప్ లలో షాపింగ్ చేసేలా ఏర్పాట్లు- చేశారు. అనంతరం చార్మినార్ నుంచి చౌమహల్లా ప్యాలెస్

వివరాలు 2లో



అండమాన్‌ను తాకిన

## రుతు పవనాలు

- భారత వాతావరణశాఖ వెల్లడి

**న్యూఢిల్లీ, మే 13:** నైరుతి రుతు పవనాలు ప్రవేశించినట్లు వతావరణశాఖ శుభవార్త తెలిపింది. మంగళవారం మధ్యాహ్నం నాటికి అవి దక్షిణ అండమాన్ సముద్రం, నికోబార్ దీవులు, దక్షిణ బంగాళాఖాతాన్ని తాకినట్లు భారత వాతావరణ శాఖ తెలిపింది. రుతు పవనాల ఆగమనంతో గత రెండు రోజులుగా నికోబార్ దీవుల్లో భారీ వర్షాలు పడుతున్నాయని పేర్కొంది. కాగా, రానున్న మూడు, నాలుగు రోజుల్లో అండమాన్ నికోబార్ దీవులతో పాటు- దక్షిణ అరేబియా సముద్రం, బంగాళాఖాతం మధ్య వరకు విస్తరించడానికి వాతావరణ పరిస్థితులు

వివరాలు 2లో

## ఆసుపత్రుల నిర్మాణంలో ఆలస్యం

- అధికారుల తీరుపై మండిపడ్డ కోమటిరెడ్డి



**/హైదరాబాద్,మే13:** సూపర్ స్పెషాలిటీ ఆసుపత్రుల నిర్మాణం ఆలస్యం అవుతుండడంపై మంత్రి కోమటిరెడ్డి వెంకట్ రెడ్డి అసహనం వ్యక్తం చేశారు. కుంటిసాకులతో నిర్మాణాలను ఆలస్యం చేయడంపై తీవ్ర స్థాయిలో మండిపడ్డారు. కాంట్రాక్టర్లతో పని చేయించడం కూడా రాదా అంటూ ఆగ్రహం వ్యక్తం చేశారు. సూపర్ స్పెషా లిటీ ఆసుపత్రుల నిర్మాణాలపై మంత్రిసమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సమావే శానికి ఆర్ అండ్ బీ శాఖ ఉన్నతాధికారులు వికాస్ రాజ్, హరి చందన, వైద్య ఆరోగ్య శాఖ కార్యదర్శి క్రిస్టీనా హాజర య్యారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ సనత్ నగర్ లో ఆస్పత్రిని జూన్ 2వ తేదీన ప్రారంభించాలని తెలంగాణ ప్రభుత్వం టార్గెట్‌గా పెట్టుకున్నా.. పనులు ఎందుకు వేగంగా కొనసాగడం లేదని అధికారులను మంత్రి కోమటిరెడ్డి వెంకట్ రెడ్డి ప్రశ్నించారు. ఎప్పటి వరకు 5 సూపర్ స్పెషాలిటీ- ఆసుపత్రులు నిర్మాణం

వివరాలు 2లో

న్యూస్-9 సామాజిక అవసరం...సామాన్యుడి ఆయుధం తెలుగు దినపత్రిక
www.news9-india.com
news9.india News9India_ news9telugudaily

# మా సైనికులు 11మంది మృతి చెందారు: పాక్

(మొదటి పేజీ తరువాయి)

దాడుల్లో మృతి చెంది నట్లు పాక్ ప్రకటించింది. పాకిస్థాన్‌తోపాటు పాక్ ఆక్రమిత కాశ్మీర్‌లోని తొమ్మిది ఉగ్రవాద స్థావరాలపై ఆపరేషన్ సింధూర్‌లో భాగంగా సైనిక దాడులు నిర్వహించింది. ఈ దాడుల్లో దాదపు 100 మందికిపైగా ఉగ్రవాదులు హతమయ్యారు. అలాగే ఆ ప్రాంతంలో ఉగ్రవాదులకు సంబంధించిన మౌలిక సదుపాయాలను సైతం ధ్వంసం చేసింది. భారత్‌లోని పాకిస్థాన్ సరిహద్దునున్న రాష్ట్రాలకు చెందిన జిల్లాలపై పాకిస్థాన్ డ్రోనులు, క్షిపణులతో దాడులకు దిగింది. ఈ దాడులను భారత్ తిప్పికొట్టింది. దాదాపు నాలుగు రోజుల పాటు ఇరు దేశాల మధ్య ఉద్రిక్తల నడుమ శనివారం సాయంత్రం మే 10వ తేదీ ఇరు దేశాలు కాల్పుల విరమణ ఒప్పందాన్ని అంగీకరించిన సంగతి తెలిసిందే.

## చార్మినార్ వద్ద సుందరీమణుల సందడి

(మొదటి పేజీ తరువాయి)

నిర్వహించారు. హెరిటేజ్ వాక్ కు అంతరాయం కలుగ కుండా ట్రాఫిక్ డైవర్షన్ విధించారు. పహెల్గాం ఉగ్రదాడి, ఆపరేషన్ సిందూర్ నేపథ్యంలో పాతబస్తీ వీధులన్నీ పోలీసులు అదుపులోకి తీసుకున్నారు.

# ఉగ్రవాది అరెస్ట్ వార్త అబద్ధం: సైబర్ సెక్యూరిటీ

**హైదరాబాద్,మే13:** శంషాబాద్ విమానాశ్రయంలో ఓ ఉగ్రవాది పట్టుబడినట్లు సోషల్ మీడియాలో జరుగుతున్న ప్రచారాన్ని సైబర్‌సెక్యూరిటీ ఖండించింది. ఇది ఫే÷- వార్త అని పేర్కొంది. ఉగ్రవాదిని భద్రతా బలగాలు అదుపులోకి తీసుకుంటున్న వీడియో చక్కర్లు కొడుతోంది. అయితే, దీనిపై తెలంగాణ సైబర్ సెక్యూరిటీ బ్యూరో అధికారులు స్పష్టత ఇచ్చారు. సోషల్ మీడియాలో వైరల్ అవుతున్నది ఫేక్ వీడియో అని ఫ్యాక్ట్ చెక్ ద్వారా నిర్ధరించారు. ఇటీవల శంషాబాద్ ఎయిర్ పోర్టులో మాక్ డ్రిల్ సందర్భంగా తీసిన వీడియోను సోషల్ మీడియాలో వైరల్ చేస్తున్నారని తెలిపారు. అధికారులు ధ్రువీకరించని నకిలీ వీడియోలను నమ్మొద్దని విజ్ఞప్తి చేశారు. తప్పుడు వీడియోలు ప్రచారం చేసిన వారిపై కఠిన చర్యలు ఉంటాయని స్పష్టం చేశారు.

## ఆసుపత్రుల నిర్మాణంలో ఆలస్యం

(మొదటి పేజీ తరువాయి)

పూర్తి చేస్తారో టెక్నికల్ గా అంచనా వేసి రిపోర్ట్ ఇవ్వాలని ఆదేశాలు జారీ చేశారు. ఇక, ఆసుపత్రులకు సంబంధించిన నిర్మాణ పనులను ఆర్ అండ్ బీ, వైద్య పరికారాలను వైద్యారోగ్య శాఖ ఎస్టిమేట్ వేసుకోవాలని సూచించారు. ప్రతీవారం ఆసుపత్రుల నిర్మాణ పురోగతిపై సమీక్ష చేయాలని మంత్రి కోమటిరెడ్డి నిర్ణయం తీసుకున్నారు.

# అండమాన్‌ను తాకిన రుతు పవనాలు

(మొదటి పేజీ తరువాయి)

అనుకూలంగా ఉన్నాయని ఐఎండీ చెప్పు కొచ్చింది. మే 27వ తేదీ నాటికి ఈ రుతుపవనాలు కేరళను తాకే ఛాన్స్ ఉందని ఇప్పటికే వాతావరణ శాఖ అధికారులు అంచనా వేశారు. కాగా, సాధారణంగా జూన్ 1వ తేదీ నాటికి రుతుపవనాలు అండమాన్ ను తాకుతాయి. కానీ, ఈ సారి మాత్రం అంతకంటే ముందుగానే వచ్చేందుకు అవకాశాలు కనబడుతున్నాయి. అలా, జరిగితే 2009 తర్వాత అంచనాల కంటే ముందే రుతుపవనాలు రావడం మళ్లీ ఇప్పుడే. అప్పుడు, మే 23వ తేదీనే నైరుతి రుతుపవనాలు కేరళను తాకగా.. ఈ సారి సాధారణం కంటే ఎక్కువ వర్షపాతం నమోదయ్యే ఛాన్స్ ఉందని ఐఎండీ పేర్కొనింది. ఇక, జూన్ 12వ తేదీ వరకు తెలంగాణను నైరుతి రుతుపవనాలు తాకనున్నాయి. తెలంగాణలో ఈ సారి సాధారణం కంటే అధిక వర్షాలు కురిసే అవకాశం ఉంది. రాష్ట్రంలో మరో వారం రోజుల్లో అధిక ఉష్ణోగ్రతల ప్రభావం ముగియనుంది అని భారత వాతావరణ కేంద్రం వెల్లడించింది.

# గొంతులో మటన్ ముక్క ఇరుక్కుని మృతి

**మహబూబాబాద్,మే13:** గొంతులో మటన్ ముక్క ఇరుక్కొని అస్వస్థతకు గురై వృద్ధుడు మృతిచెందిన ఘటన మంగళవారం మహబూబాబాద్ జిల్లా మరిపెడ మున్సిపాలిటీ పరిధిలోని కొత్తతండాలో చోటుచేసుకుంది. స్థానికులు, కుటుంబ సభ్యులు తెలిపిన వివరాలు ఇలా ఉన్నాయి. వరంగల్ జిల్లా వర్ధన్నపేట శివారు డీసీ తండాకు చెందిన జాటోత్ లక్ష్మణ్(68) కొత్త తండాలో దుర్గా మాత పండుగ కోసం బంధువుల ఇంటికి వచ్చాడు. భోజనం చేసే

# ధర్మ సంస్థాపన కోసం ఆయుధం పట్టాల్సిందే...

(మొదటి పేజీ తరువాయి)

ఈ జయ జయ ద్వానాలు ప్రపంచమంతా విన్నదని ఆయన గుర్తు చేశారు. భారత్ మాతాకీ జై అనేది ప్రతీ పౌరుడి నినాదమని ప్రధాని మోదీ ఈ సందర్భంగా పేర్కొన్నారు. అణు బాంబు హెచ్చరికలను సైతం చిత్తు చేశామని చెప్పారు. దేశంలోని ప్రతీ పౌరుడూ గర్వపడేలా మీరు చేశారంటూ సైనికులను ఈ సందర్భంగా ప్రధాని మోదీ అభినందించారు. మీరందరూ చరిత్ర సృష్టించారంటూ సైనికులను వెన్నుతట్టి ప్రోత్సహించారు. మీ కోసమే నేను ఇక్కడికి వచ్చానని చెప్పారు. వీరులను చూసినప్పుడు జీవితం ధన్యమవుతోందని ప్రధాని మోదీ పేర్కొన్నారు.'భారత్ మాతాకీ జై' నినాదం శత్రువుల చెవుల్లో గింగిరాలు తిరుగుతోందని ప్రధాని మోదీ అన్నారు. అది శత్రువుల వెన్నులో వణుకు పుట్టించిందని వ్యాఖ్యానించారు. ఉగ్రవాదాన్ని అంతం చేయాలని మన సైన్యం శపథం చేసింది. మన సైన్యం చూపిన శక్తిసామర్థ్యాలకు ఎన్ని ప్రశంసలు చేసినా తక్కువే. అణు బ్లాక్‌మెయిల్‌ను అపహాస్యం చేసింది. భారత శక్తిసామర్థ్యాలు చూసి నా జీవితం ధన్యమైంది. యుద్ధక్షేత్రంలోనూ భారత్ మాతాకీ జై నినాదాలు చేశాం. ఆకాశం నుంచి పాతాళం వరకు ఆ నినాదం మార్మోగింది. ఈ భూమి నుంచి వీర సైనికులు అందరికీ సెల్యూట్ చేస్తున్నా. ప్రతి భారతీయుడు సైన్యానికి మద్దతుగా నిలబడ్డాడు. భారత సేనలకు కృతజ్ఞతలు చెప్తున్నాడు. ధర్మసంస్థాపన కోసం ఆయుధం పట్టడం మన సంప్రదాయం.. మన విధానం. మన అక్కాచెల్లెళ్ల నుదుటి సిందూరం తుడిచినవాని నట్టింట్లోకి వెళ్లి నాశనం చేశాం అని ప్రధాని ఉద్వేగపూరిత ప్రసంగం చేశారు. ఆపరేషన్ సిందూర్, భారత్-పాక్ కాల్పుల విరమణకు అంగీకరించిన నేపథ్యంలో ఆయన పర్యటన ప్రాధాన్యం సంతరించుకుంది. పహల్గాం ఉగ్రదాడికి ప్రతిగా మన భద్రతా బలగాలు ఉగ్రస్థావరాలపై ఆపరేషన్ సిందూర్‌ను నిర్వహించాయి. అది జీర్ణించుకోలేని పాకిస్థాన్ మే 9, 10వ తేదీల్లో దాడులకు యత్నించింది. అయితే వాటిని మన సైన్యం సమర్థవంతంగా తిప్పికొట్టింది. దాయాది టార్గెట్ చేయాలని యత్నించిన వాటిలో ఆదంపుర్ వైమానిక స్థావరం కూడా ఒకటి. ఈ ఉదయం నేను ఆదంపుర్ ఎయిర్‌బేస్‌కు వెళ్లాను. అక్కడ మన పోరాటయోధులను కలిశాను. ధైర్యం, దృఢ సంకల్పానికి ప్రతిరూపంగా నిలిచేవారితో మాట్లాడటం ఒక ప్రత్యేక అనుభవం. మన దేశ రక్షణ కోసం బలగాలు చేసే ప్రతిచర్యకు ప్రజలందరూ ఎప్పటికీ కృతజ్ఞతతో ఉంటారని ఎక్స్ వేదికగా మోదీ రాసుకొచ్చారు. అలాగే వారితో దిగిన చిత్రాలను షేర్ చేశారు. అక్కడికి వెళ్లి పాక్ చేసిన తప్పుడు సమాచారాన్ని తిప్పికొట్టారు. వాయుసేన సిబ్బందితో ముచ్చటించి భుజం తట్టారు. ఆపరేషన్ వివరాలను మోదీకి బలగాలు వివరించాయి. గంటన్నరకు పైగా ఆయన అక్కడే గడిపారు. ఆ సమయంలో ఆయన ధరించిన టోపీపై త్రిశూల్ చిత్రం కనిపించింది.ఆపరేషన్ సిందూర్ గురించి దేశ ప్రజలను ఉద్దేశించి ప్రసంగించిన మరుసటిరోజు మోదీ ఈ పర్యటన చేపట్టారు. నిన్న ప్రధాని మాట్లాడుతూ.. భారత్ ప్రళయభీకర దాడులను తట్టుకోలేకే పాకిస్థాన్ చివరకు కాల్పుల విరమణ పేరుతో కాళ్లబేరానికి వచ్చిందని వెల్లడించిన సంగతి తెలిసిందే. నవయుగ యుద్ధంలో పాకిస్థాన్‌ను భారత్ మట్టి కరిపించిందని, వారు సరిహద్దుల్లో యుద్ధానికి దిగితే మనం వాళ్ల గుండె పైనే కొట్టగలిగామన్నారు. ఆ దేశ ప్రవర్తనను పరిశీలిస్తామని, ముస్ముందు ఏమాత్రం తేడా వచ్చినా ఊరుకోబోమని హెచ్చరించారు. పహల్గాంలో ఉగ్రవాదులు వికృత క్రూరత్వాన్ని ప్రదర్శించి.. కుటుంబ సభ్యుల ముందే అమాయక ప్రజలను చంపినందుకు ప్రతీకారంగా పాకిస్థాన్‌లోని ఉగ్ర సౌధాలను కుప్పకూల్చి 100 మందికి పైగా పేరుమోసిన ఉగ్రవాదులను అంతమొందించినట్లు- ప్రకటించారు. ఆ దేశంతో చర్చలంటూ జరిగితే ఉగ్రవాద నిర్మూలన, పాక్ ఆక్రమిత కశ్మీర్‌పై మాత్రమేనని స్పష్టంచేశారు. భారతదేశాన్ని, ప్రజలను రక్షించుకోవడానికి ఎంతపెద్ద నిర్ణయం తీసుకోడాని-కై-నా వెనుకాడబోమని పాక్‌కు తేల్చిచెప్పారు. ప్రధాని మోదీ షేర్ చేసిన చిత్రాల్లో చెక్కు చెదరకుండా ఉన్న ఎస్-400 రక్షణ వ్యవస్థ కనిపించింది. ఆదంపుర్‌లోని ఎస్-400 స్థావరాన్ని ధ్వంసం చేశామని పాక్ ప్రచారం చేసింది. భారత్‌లోని కీలకమైన మౌలిక సదుపాయాలు, విద్యుత్తు.. సైబర్ వ్యవస్థలపై దాడి చేసి ధ్వంసం చేశామని చెప్పింది. ఇదంతా హేయమైన దుష్ప్రచారం అని భారత విదేశీ వ్యవహారాల శాఖ కార్యదర్శి విక్రమ్ మిస్రీ తప్పుబట్టిన సంగతి తెలిసిందే. ఇప్పుడు ఆ ఎయిర్‌బేస్‌కు వెళ్లి మోదీ దాయాది తప్పుడు ప్రచారానికి చెక్ పెట్టారు. అలాగే భద్రతాబలగాలకు తమ పూర్తి మద్దతు ఉంటుందని ఈ పర్యటన ద్వారా గట్టి సందేశం ఇచ్చారు.

# రిటైర్మెంట్ తర్వాత ఎలాంటి పదవులూ స్వీకరించను

- చివరి రోజు విధి నిర్వహణల అనంతరం సిజెఐ ఖన్నా వెల్లడి
- నేడు కొత్త సిజెఐగా గవాయ్ బాధ్యతలు

**/న్యూఢిల్లీ మే13:** పదవీ విరమణ తర్వాత ఎటువంటి అధికారిక పదవులను చేపట్టబోనని సుప్రీంకోర్టు ప్రధాన న్యాయమూర్తి సంజీవ్ ఖన్నా స్పష్టం చేశారు. సిజెఐగా సంజీవ్ ఖన్నా పదవీ కాలం మంగళవారంతో ముగిసింది. సుప్రీంకోర్టులో చివరి రోజు బెంచ్ కార్యకలాపాలు ముగిసిన అనంతరం ఏర్పాటు చేసిన కార్యక్రమంలో ఖన్నా మాట్లాడుతూ పదవీ విరమణ తర్వాత ఎటువంటి అధికారిక పదవులను చేపట్టబోనని స్పష్టం చేశారు.న్యాయవ్యవస్థలో ఏదైనా చేయాలని అనుకొంటున్నట్లు చెప్పారు. జస్టిస్ సంజీవ్ ఖన్నా పదవీ విరమణ నేపథ్యంలో సుప్రీంకోర్టు బార్ అసోసియేషన్ వీడ్కోలు కార్యక్రమం ఏర్పాటు చేసింది. కాగా హైకోర్టు న్యాయమూర్తి యశ్వంత్ వర్మ నివాసంలో నోట్ల కట్టలు కనుగొనడంపై మీడియా ప్రతినిధులు అడిగిన ఒక ప్రశ్నకు సిన్హా సమాధానమిస్తూ. న్యాయవ్యవస్థ ఆలోచన నిర్ణయాత్మకం, న్యాయనిర్ణేతగా ఉండాలని అన్నారు. 'మేము ప్లస్, మైనస్‌లు అన్నీ పరిశీలిస్తాం.ఆ తర్వాత హేతుబద్ధంగా అన్ని అంశాలను ఆలోచిస్తాం. అవన్నీ సరయిన నిర్ణయం తీసుకోవడానికి తోడ్పడతాయి' అని అన్నారు.భారత 51వ ప్రధాన న్యాయమూర్తిగా సంజీవ్ ఖన్నా 2024 ఏప్రిల్ 11న బాధ్యతలు చేపట్టారు. జస్టిస్ సంజీవ్ ఖన్నాకు దివంగత మాజీ న్యాయమూర్తి హెచ్ఆర్ ఖన్నా సమీప బంధువు. 2005లో ఢిల్లీ హైకోర్టు అదనపు న్యాయమూర్తిగా నియమితులయినఖన్నా తదుపరి ఏడాది శాశ్వత న్యాయమూర్తిగా పదోన్నతి పొందారు. 2019 జనవరి 19న సుప్రీంకోర్టు జడ్జిగా, నవంబర్ 11న సిజెఐగా బాధ్యతలు చేపట్టారు.**నేడు కొత్త సిజెఐగా గవాయ్ ప్రమాణం...** కాగా భారత 52వ ప్రధాన న్యాయమూర్తిగా జస్టిస్ బిఆర్ గవాయ్ బుధవారం (14న) బాధ్యతలు చేపట్టనున్నారు. రాష్ట్రపతి ద్రౌపది ముర్ము నూతన సిజెఐతో ప్రమాణ స్వీకారం చేయించనున్నారు. సీనియా



రిటీ పరంగా తన తర్వాతి స్థానంలో ఉన్న గవాయ్ పేరును ప్రస్తుత ప్రధాన న్యాయమూర్తి ఖన్నా గతంలో సిఫార్సు చేయగా కేంద్రం ఆమోదం తెలిపింది. 6 నెలలుకు పైగా సిజెఐ పదవిలో కొనసాగనున్న గవాయ్ నవంబర్ 23న పదవీ విరమణ చేయనున్నారు.

# సిబిల్ స్కోర్‌తో సంబంధం లేదు

(మొదటి పేజీ తరువాయి)

మండల స్థాయిలో ప్రాసెస్‌ను ప్రారంభమైందని.. జూన్ రెండవ తేదీ కల్లా లబ్ధిదారులకు మంజూరు లెటర్లు అందజేస్తామన్నారు. నిరుద్యోగ యువత తలెత్తుకొని బతికెందుకు రాజీవ్ యువ వికాస పథకాన్ని తీసుకొచ్చామని చెప్పారు. మంగళ వారం భద్రాద్రి కొత్తగూడెం జిల్లా ఇల్లందు నియోజకవర్గంలోని బయ్యారం, టేకులపల్లి మండలాల్లో పర్యటించి పలు అభివృద్ధి కార్యక్రమాలకు భట్టి శంఖుస్థాపనలు చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. రాజీవ్ యువ వికాసం లాంటి స్కీమ్ భారత దేశంలోనే ఎక్కడ లేదని అన్నారు. రాష్ట్రంలో ఉన్న నిరుద్యోగ యువకులు వాళ్ల కాళ్ళ మీద వాళ్ళు నిలబడేందుకు స్వయం ఉపాధి అవకాశాన్ని ఎంచుకొని ఎదగడానికి రాజీవ్ యువ వికాసం స్కీమ్ ఒక వరం లాంటిదన్నారు. పది సంవత్సరాలు పాలించిన బీఆర్ఎస్ ప్రభుత్వం నిరుద్యోగ యువతకు ఎలాంటి భృతిని, ఉద్యోగ అవకాశాలు కల్పించలేదని మండిపడ్డారు. గత పది సంవత్సరాలు తెలంగాణ యువత నిరాశ నిస్పృహల్లో బతికిందన్నారు. కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత 52,000 మందికి ఉద్యోగ అవకాశాలు కల్పించామని పేర్కొన్నారు. మిగిలిన ఉద్యోగాల భర్తీకి కోసం జాబ్ క్యాలెండర్ ప్రకటించామని గుర్తు చేశారు. ఇల్లందు నియోజకవర్గంలోని తులారం ప్రాజెక్ట్, బయ్యారం పెద్ద చెరువు మరమ్మత్తులతో పాటు- ఇల్లందు ప్రాంతంలో సర్వే చేసి నివేదికను తయారుచేసి సీతారామ ప్రాజెక్టు ద్వారా నీళ్లందించేందుకు ప్రభుత్వం చిత్తశుద్ధితో కృషి చేస్తుందని తెలిపారు.

# ప్రభుత్వంపై వరుస పోరాటాలకు సిద్ధం కండి

- వరంగల్నేతలకు కెటిఆర్ పిలుపు

**/హైదరాబాద్,మే13:** తెలంగాణ రాష్ట్రాన్ని పీడిస్తున్న కాంగ్రెస్ ప్రభుత్వంపై వరుస పోరాటాలకు సిద్ధం కావాలని కెటిఆర్ పిలుపునిచ్చారు. హామీలు అమలు చేయకుండా మోసం చేస్తున్న కాంగ్రెస్ ద్రోహాన్ని



ప్రజలకు వివరించండి అన్నారు. ఉమ్మడి వరంగల్ జిల్లా నేతలతో నిర్వహించిన కీలక సమావేశంలో బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ మాట్లాడుతూ.. వాగు దాటే దాక ఓడ మల్లన్న.. వాగు దాటినంక బోడి మల్లన్న అన్నట్టు- రేవంత్ రెడ్డి ప్రభుత్వ పాలన ఉందన్నారు. వరంగల్ సభతో కాంగ్రెస్ అంతానికి ఆరంభం మొదలైంది.. కాంగ్రెస్ అరాచకాలను ఒక్క బీఆర్ఎస్ పార్టీ మాత్రమే

# నేను క్రమశిక్షణ కలిగిన కార్యకర్తను

- కెసిఆర్ ఆదేశాలు తు.చ తప్పకుండా పాటిస్తా
- కెటిఆర్‌ను పార్టీ అధ్యక్షుడిని చేసినా అనుసరిస్తా
- పార్టీ మారడం అన్న ప్రచారంలో నిజం లేదు: హరీష్



**/హైదరాబాద్,మే13:** భారాసలో ఎలాంటి విభేదాలు లేవని మాజీ మంత్రి, సిద్దిపేట ఎమ్మెల్యే హరీశ్‌రావు అన్నారు. మంగళవారం హైదరాబాద్‌లో ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో ఆయన మాట్లాడారు. కేసీఆర్‌కు క్రమశిక్షణ కలిగిన కార్యకర్తను. కేసీఆర్ తర్వాత కేటీఆర్‌కు నాయకత్వ బాధ్యతలు అప్పగిస్తే స్వాగతిస్తా. గతంలో కూడా ఈ అంశంపై చాలాసార్లు స్పష్టత ఇచ్చా. కార్యకర్తగా కేసీఆర్, పార్టీ ఆదేశాలను పూర్తిగా పాటిస్తా. కేసీఆర్ నిర్ణయాలకు పూర్తిగా కట్టుబడి ఉంటానని హరీశ్‌రావు స్పష్టం చేశారు.కార్యకర్తగా మాజీ సిఎం, బిఆర్ఎస్ అధినేత కెసిఆర్ నిర్ణయాలకు కట్టుబడి ఉంటానని ఎమ్మెల్యే హరీష్ రావు అన్నారు. తాను పార్టీ మారుతున్నట్టు- సోషల్ మీడియాలో వస్తున్న వార్తలపై ఆయన స్పందించారు. ఈ మేరకు హరీష్ రావు మాట్లాడుతూ.. కెసిఆర్ మా అధ్యక్షుడు.. ఆయన చెప్పింది నేను తూ.చా. తప్పకుండా పాటిస్తానని అన్నారు. ఈ మాట తాను ఇప్పటికే చాలా సార్లు చెప్పానని.. ఎన్ని సార్లు అడిగిన ఇదే చెప్తానన్నారు. బిఆర్ఎస్ పార్టీలో ఎలాంటి విభేదాలు లేవన్నారు. కెటిఆర్ కు నాయకత్వ బాధ్యతలు అప్పగిస్తే.. తప్పకుండా స్వాగతిస్తానని చెప్పారు. ఒక కార్యకర్తగా పార్టీ నిర్ణయాన్ని, కెసిఆర్ నిర్ణయాన్ని ఎప్పుడు శిరసావహిస్తానని హరీష్ రావు క్లారిటీ- ఇచ్చారు.

# ఎపి సైనిక్ స్కూల్లో తెలంగాణ పిల్లలకు అవకాశం ఇవ్వాలి: పొన్నం



**/హైదరాబాద్,మే13:** రాష్ట్రంలో సైనిక్ స్కూల్ ఏర్పాటు- చేసే వరకు ఏపీలో తెలంగాణ పిల్లలకు స్థానికత్వం కల్పించాలని మంత్రి పొన్నం ప్రభాకర్ డిమాండ్ చేశారు. కేంద్రం, ఏపీ సర్కార్ నిర్ణయంతో సైనిక్ స్కూల్ ప్రవేశ పరీక్ష రాసిన 20వేల మంది విద్యార్థులు నైరాశ్యంలో ఉన్నట్లు- తెలిపారు. దేశంలో దాదాపు అన్ని రాష్ట్రాల్లో సైనిక్ స్కూళ్లు ఉన్నాయని, తెలంగాణలో తొందరగా ఏర్పాటు- చేయాలని కోరారు. ఈ విషయంలో కేంద్ర మంత్రులు బండి సంజయ్, కిషన్‌రెడ్డి జోక్యం చేసుకోవాలని విజ్ఞప్తి చేశారు.

# ఘనంగా శ్రీశ్రీశ్రీ పెద్దమ్మ తల్లి దేవాలయ విగ్రహ ప్రతిష్టాపన



**కుత్బుల్లాపూర్, మే 13, :** జగద్గిరిగుట్ట డివిజన్ భూదేవి హిల్స్ నందు నూతనంగా నిర్మించిన శ్రీశ్రీశ్రీ పెద్దమ్మ తల్లి దేవాలయ విగ్రహ ప్రతిష్టాపన , నాభీశిలా (బొడ్రాయి) ప్రతిష్ట మహోత్సవం ఘనంగా నిర్వహించారు. ఈ వేడుకలకు బిఆర్ఎస్ పార్టీ విప్, కుత్బుల్లాపూర్ ఎమ్మెల్యే కెపి.వివేకానంద్, స్థానిక కార్పొరేటర్ కొలుకుల జగన్ లు ముఖ్య అతిథులుగా హాజరై అమ్మవారికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ పెద్దమ్మ తల్లి దయ ఉంటే అన్ని సమకూరుతాయని, అమ్మవారి దయతో ప్రజలంతా సుఖ సంతోషాలు, అష్టైశ్వర్యాలతో జీవించాలన్నారు. అనంతరం భూదేవి హిల్స్ లో నిర్వహించిన నాభీశిలా (బొడ్రాయి) ప్రతిష్టాపనలో బొడ్రాయికి కొబ్బరికాయ కొట్టి పూజలు నిర్వహించారు.ఈ కార్యక్రమంలో, డివిజన్ అధ్యక్షులు రుద్ర అశోక్, శ్రీ వెంకటేశ్వర దేవస్థానం మాజీ చైర్మన్ వేణు యాదవ్, సీనియర్ నాయకులు బాబు గౌడ్, విఠల్, శశిధర్, జైహింద్, తిరుమల్ రెడ్డి, మల్లా చారి, తిరుపతి, దినేష్, సత్యనారాయణ, మెట్ల శ్రీను, ఎర్ర లక్ష్మయ్య మహంకాళి, వెంకటేష్, అజం, ప్రభాకర్, ఆంజనేయులు, నాగరాజు, ముంతాజ్, , బ్రహ్మానంద చారి,నవీన్, రాజు, సురేష్, మధు, సోమయ్య, తారా సింగ్, మహిళా నాయకురాలు త్రివేణి, మంజుల, పార్వతీ, పెద్దమ్మ తల్లి ఆలయ కమిటీ సభ్యులు బాలకృష్ణ, భూదేవి హిల్స్ కాలనీ వాసులు తదితరులు పాల్గొన్నారు.

# మిగిలి ఉన్న అభివృద్ధి పనులను త్వరలోనే పూర్తి చేస్తాం

### బిఆర్ఎస్ పార్టీ విప్, కుత్బుల్లాపూర్ ఎమ్మెల్యే కెపి.వివేకానంద్



**కుత్బుల్లాపూర్, మే 13,** మిగిలి ఉన్న అభివృద్ధి పనులను త్వరలోనే పూర్తి చేస్తామని బిఆర్ఎస్ పార్టీ విప్, కుత్బుల్లాపూర్ ఎమ్మెల్యే కెపి.వివేకానంద్ అన్నారు. సుభాష్ నగర్ డివిజన్ సూరారం కాలనీ వాసులు మంగళవారం బిఆర్ఎస్ పార్టీ విప్, ఎమ్మెల్యే కెపి.వివేకానంద్ ని కలిసి కాలనీలో మిగిలిపోయి ఉన్న సీసీ రోడ్డు పనులను పూర్తిచేయాలని కోరారు. ఈ సందర్భంగా బిఆర్ఎస్ పార్టీ విప్, ఎమ్మెల్యే కెపి.వివేకానంద్ మాట్లాడుతూ సుభాష్ నగర్ డివిజన్ లోని అన్నీ కాలనీలలో అభివృద్ధి పనులను దాదాపు పూర్తి చేశామని, ఇంకా ఏమైనా మిగిలిపోయి ఉంటే ప్రణాళికలు రూపొందింపచేసి త్వరలోనే చేపడుతామని తెలియజేశారు. ఈ కార్యక్రమంలో కాలనీ వాసులు కుమ్మరి చందు, భీమ్ రాజ్, మస్తాన్, గిరి, మున్నా, మహేష్, రవి, రమేష్ పాల్గొన్నారు.

# కోట్లాది రూపాయలతో కుత్బుల్లాపూర్ నియోజకవర్గాన్ని ఎంతో అభివృద్ధి పరిచాం

### బిఆర్ఎస్ పార్టీ విప్, కుత్బుల్లాపూర్ ఎమ్మెల్యే కెపి.వివేకానంద్



**కుత్బుల్లాపూర్, మే 13,** గత పదేళ్ల కాలంలో కోట్లాది రూపాయల నిధులతో కుత్బుల్లాపూర్ నియోజకవర్గాన్ని ఎంతో అభివృద్ధి పరిచామని బిఆర్ఎస్ పార్టీ విప్, కుత్బుల్లాపూర్ ఎమ్మెల్యే కెపి.వివేకానంద్ అన్నారు. జగద్గిరిగుట్ట డివిజన్ భూదేవి హిల్స్ లో నూతనంగా చేపట్టనున్న భూగర్భ డ్రైనేజీ పనులకు మంగళవారం బిఆర్ఎస్ పార్టీ విప్, కుత్బుల్లాపూర్ ఎమ్మెల్యే కెపి.వివేకానంద్, స్థానిక కార్పొరేటర్ కొలుకుల జగన్ లు పాల్గొని శంకుస్థాపన చేశారు.ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ కుత్బుల్లాపూర్ నియోజకవర్గాన్ని అన్ని విధాలుగా అభివృద్ధి చేసి ఆదర్శవంతమైన నియోజకవర్గంగా తీర్చిదిద్దుతామన్నారు. చేసిన అభివృద్ధిని చూసే తనను మూడవ సారి భారీ మెజారిటీ తో గెలిపించిన మీకు ఎల్లవేళలా కృతజ్ఞుడనై ఉంటానని, రానున్న రోజుల్లో కూడా భూదేవి హిల్స్ తో పాటు.కుత్బుల్లాపూర్ నియోజకవర్గాన్ని అభివృద్ధి పరుస్తామన్నారు. ఈ కార్యక్రమంలో డివిజన్ అధ్యక్షులు రుద్ర అశోక్, శ్రీ వెంకటేశ్వర దేవస్థానం మాజీ చైర్మన్ వేణు యాదవ్, సీనియర్ నాయకులు బాబు గౌడ్, విఠల్, శశిధర్, జైహింద్, తిరుమల్ రెడ్డి, మల్లా చారి, తిరుపతి, దినేష్, సత్యనారాయణ, మెట్ల శ్రీను, ఎర్ర లక్ష్మయ్య, బ్రహ్మానంద చారి, మహంకాళి, వెంకటేష్, అజం, ప్రభాకర్, ఆంజనేయులు, నాగరాజు, ముంతాజ్, నవీన్, రాజు, సురేష్, మధు, సోమయ్య, తారా సింగ్, మహిళా నాయకురాలు త్రివేణి, మంజుల, పార్వతీ, పెద్దమ్మ తల్లి ఆలయ కమిటీ సభ్యులు బాలకృష్ణ, భూదేవి హిల్స్ కాలనీ వాసులు తదితరులు పాల్గొన్నారు.

# తప్పిపోయిన చిన్నారిని తల్లిదండ్రులకు అప్పగింత



**కుత్బుల్లాపూర్, మే 13 :** తప్పిపోయిన సుమారు 17 నెలల వయస్సు గల చిన్నారిని మంగళవారం జీడిమెట్ల పోలీసులు తల్లిదండ్రులకు అప్పగించారు. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం..... షాపూర్ నగర్ లోని , వివేకానందనగర్లో 17 నెలల ఓ చిన్నారి తప్పిపోవడంతో జీడిమెట్ల పోలీసులకు అప్పగించారు. అనంతరం పోలీసులు చిన్నారిని తల్లిదండ్రులకు అప్పగించారు.

# సంక్షేమ సంఘ సభ్యులు ప్రజా ప్రతినిధులు, ప్రజలకు మధ్య వారధిగా ఉండాలి

### బిఆర్ఎస్ పార్టీ విప్, కుత్బుల్లాపూర్ ఎమ్మెల్యే కెపి.వివేకానంద్



**కుత్బుల్లాపూర్, మే 13:** సంక్షేమ సంఘ సభ్యులు ప్రజా ప్రతినిధులు, ప్రజలకు మధ్య వారధిగా ఉండాలని బిఆర్ఎస్ పార్టీ విప్, కుత్బుల్లాపూర్ ఎమ్మెల్యే కెపి.వివేకానంద్ అన్నారు. మంగళవారం జీడిమెట్ల డివిజన్ "వైష్ణోయ్ ఎంక్లేవ్ ఓనర్స్ వెల్ఫేర్ అసోసియేషన్" నూతన సంక్షేమ సంఘం సభ్యులు బిఆర్ఎస్ పార్టీ విప్, ఎమ్మెల్యే కెపి.వివేకానంద్ ని మర్యాదపూర్వకంగా కలిసి శాలువాతో సత్కరించారు.ఈ సందర్భంగా బిఆర్ఎస్ పార్టీ విప్, ఎమ్మెల్యే కెపి.వివేకానంద్ మాట్లాడుతూ ముందుగా వైష్ణోయ్ ఎంక్లేవ్ నూతన సంక్షేమ సంఘం సభ్యులకు శుభాకాంక్షలు తెలియజేశారు. ఇప్పటికే కాలనీలో నెలకొని ఉన్న సమస్యలను అసెంబ్లీ వేదికగా ప్రస్తావించడం జరిగిందని, కాలనీలో నెలకొని ఉన్న సమస్యలపై ఫోన్ లో మాట్లాడిన ఎమ్మెల్యే పూర్తి స్థాయిలో మౌలిక వసతులను కల్పించేలా ప్రణాళికలు రూపొందించాలని అధికారులను ఆదేశించారు.ఈ కార్యక్రమంలో వైష్ణోయ్ ఎంక్లేవ్ ఓనర్స్ వెల్ఫేర్ అసోసియేషన్ నూతన అధ్యక్షులు రంగు వెంకటేష్ గౌడ్, ప్రధాన కార్యదర్శి ఎంపీఆర్ చంద్రశేఖర్, కోశాధికారి కె.రాకేష్, ఉపాధ్యక్షులు సయ్యద్ హుస్సేన్, బి.కె.గౌడ్, సంయుక్త కార్యదర్శి ఏ.నాగరాజు, ఎం.శ్రీనివాస్, ఆర్గనైజింగ్ సెక్రెటరీ ఎస్.కె.పాండే సభ్యులు తదితరులు పాల్గొన్నారు.

# బాలానగర్ ఎసిపిని కలిసిన తెలంగాణ దళిత సంక్షేమ సంఘం సభ్యులు



**కూకట్ పల్లి, మే 13,** బాలానగర్ అసిస్టెంట్ కమిషనర్ ఆఫ్ పోలీసుగా బాధ్యతలు చేపట్టిన పింగళి నరేష్ రెడ్డిని మంగళవారం ఆయన కార్యాలయంలో తెలంగాణ దళిత సంక్షేమ సంఘం సభ్యులు కలిసి శాలువా కప్పి డా.బి.ఆర్.అంబేద్కర్ కండువా వేసి బ్యాడ్జిని పెట్టి అభినందనలు తెలియజేశారు. తెలంగాణ దళిత సంక్షేమ సంఘం అధ్యక్షుడు ఆదిముళ్ల రాము నేతృత్వంలో సభ్యులు ఎసిపిని కలిసి సుమారు పదిహేను నిమిషాల పాటు దళిత సంఘాలు, దళిత జాతి అభివృద్ధి, ఎస్సి, ఎస్టీ అట్రాసిటీస్ యాక్ట్, తదితర దళిత అంశాలు గురించి చర్చించారు. ఈ సందర్భంగా తెలంగాణ దళిత సంక్షేమ సంఘం సభ్యులు పలువురు మాట్లాడుతూ దళిత జాతి పట్ల కొత్తగా వచ్చిన ఎసిపి ఎంతో మంచి శ్రద్ధ చూపుతున్నారన్నారు. ఎస్సీ, ఎస్టీ అట్రాసిటీస్ కేసుల పరిష్కారం విషయంలో అధికారికి పూర్తిగా సహకరిస్తామని అన్నారు. ఈ కార్యక్రమంలో తెలంగాణ దళిత సంక్షేమ సంఘం సలహాదారులు మదాసు నర్సింహులు, ప్రధాన కార్యదర్శి రమేష్, వర్కింగ్ ప్రెసిడెంట్ దీప్తి, మీడియా కో ఆర్డినేటర్లు చింతా నర్సింగ్ రావు, రవి స్టీవెన్సన్, సత్యనారాయణ, యాదగిరి, సింగారయ్య తదితరులు పాల్గొన్నారు.

# ప్రతి విత్తన కంపెనీ వారు నాణ్యమైన విత్తనము తయారు చేయాలి

### మేడ్చల్ జిల్లా వ్యవసాయ అధికారి చంద్రకళ





**మేడ్చల్ ప్రతినిధి, మే 13 :** ప్రతి విత్తన కంపెనీ వారు నాణ్యమైన విత్తనము తయారు చేయాలని మేడ్చల్ జిల్లా వ్యవసాయ అధికారి చంద్రకళ అన్నారు. జిల్లా టాస్క్ ఫోర్స్ టీం ఆధ్వర్యంలో మంగళవారం గండి మైసమ్మ దుండిగల్, కుత్బుల్లాపూర్ , బాలానగర్ మండలం లో గల వివిధ విత్తన కంపెనీ లను తనిఖీ చేశారు. ఈ సందర్భంగా జిల్లా వ్యవసాయ అధికారి చంద్రకళ ఆధ్వర్యంలో హైదరాబాద్ విత్తన ధృవీకరణ అధికారి ఎం శివకుమార్ , మండల వ్యవసాయ అధికారి యాదగిరి, బాలనగర్ మండల వ్యవసాయ అధికారి సాయి రమేష్ , కొంపల్లి లోని నూజివీడు సీడ్స్ ప్రైవేట్ లిమిటెడ్ కుత్బుల్లాపూర్ మండలంలోని తెలంగాణ స్టేట్ సీట్ డెవలప్మెంట్ కార్పొరేషన్ విత్తన కంపెనీలో తనిఖీలు నిర్వహించారు. ఈ సందర్భంగా జిల్లా వ్యవసాయ అధికారి మాట్లాడుతూ స్టాక్ రిజిస్టర్, స్టాక్ బోర్డులు విత్తన నిల్వలను పరిశీలించారు. ఎవరైనా కంపెనీవారు అనుమతి లేని విత్తనాలు గాని నాణ్యతలేని విత్తనాలు గాని సరఫరా చేస్తే విత్తన చట్ట ప్రకారం కఠిన చర్యలు తీసుకుంటాము అని తెలియజేశారు.

# మోరంపూడి రవిబాబు కి జాతీయ సేవారత్నా అవార్డ్



**విన్నన్నపేట:న్యూస్ -9(ప్రతినిధి కమలాకర్)** తిరువూరు నియోజకవర్గం విస్సన్నపేట మండలం తెల్లదేవరపల్లి గ్రామానికి చెందిన తెలుగుదేశం పార్టీ సీనియర్ నాయకులు మోరంపూడి రవిబాబు జాతీయ సేవారత్నా అవార్డు అందుకున్నారు విజయవాడలో ప్రతి 5 సంవత్సరాలకీ ఒక సారి జాతీయ స్థాయిలో అందించే అరుదైన పురస్కారాల్లో ఈ ఐదు సంవత్సరాల కాలంలో వివిధ రంగాలలో రాణించిన ప్రతిభలను ప్రాతిపదికగా తీసుకొని ప్రథమ స్థాయిలో గుర్తించి రెండు తెలుగు రాష్ట్రాలలో ప్రతిభా వంతులను సేవా తత్పురుషులకు తెలుగు కళా రత్నాలు సాంస్కృతిక సేవా సంస్థ అవార్డులు ప్రధానం చేయటం జరుగుతుంది.అందులో భాగంగా విజయవాడలోని కౌతా పూర్ణానంద కళావేదిక గాంధీ నగర్ నందు మాజీ అడిషనల్ డిజిపి డాక్టర్ ప్రభాకర్ చేతుల మీదుగ జాతీయ ప్రోగ్రామ్ డైరెక్టర్ మరియు ప్రోగ్రామ్ కన్వీనర్ డాక్టర్ ధనాసి ఉషారాణి,తెలుగు కళా రత్నాలు సాంస్కృతిక సేవా సంస్థ సిఈఓ యూవి రత్నం ఆధ్వర్యంలో తెల్లదేవరపల్లి గ్రామానికి చెందిన మోరంపూడి రవిబాబును దుశ్శాలువాలువ కప్పి పుష్పగుచ్ఛలతో సుగంధ మాలలు వేసి విశిష్ట అతిథులు మామ్ ట్రస్ట్ అధినేత మహంతి వాసు,ఓఎస్డి నుండి ఆంధ్రప్రదేశ్ అసంబ్లీ ప్రభుత్వ విప్ డాక్టర్ యం.ప్రభాకర్,రాజా వర్మ అవార్డ్ గ్రహీత డాక్టర్ బోండా జగన్ మోహనరావు సమక్షంలో సేవారత్నా అవార్డుతో పాటు ప్రశంసా పత్రాన్ని జ్ఞాపికను అందించి ప్రశంసిస్తూ అత్యంత ప్రతిష్ఠాత్మిక కలిగిన సేవారత్నా అవార్డును ప్రధానం చేయటం జరిగింది,ఈ సందర్భంగా అవార్డు గ్రహీత మోరంపూడి రవిబాబు మాట్లాడుతూ తెలుగు రాష్ట్రాల్లోని వివిధ రంగాల్లో పని చేసే వారిని వారి ప్రతిభలను అలాగే ప్రజా క్షేత్రంలో సమాజహితం కోసం పని చేస్తున్న వారిని గుర్తించటం అనేది గొప్ప విషయం అని మాలాంటి వారు చేస్తున్న అనేక సేవా కార్యక్రమాలైనా %ఎఎ% రిలీఫ్ ఫండ్ గాని, మాతాత తండ్రులు చేసిన సేవా కార్యక్రమాలు దాన ధర్మాలను కూడా జ్ఞాపకం పెట్టుకొని మా కుటుంబం విద్యార్థుల భవిష్యత్తు కోసం పాఠశాలకు భూమిని వితరణ ఇచ్చిన సందర్భాలను సైతం ఈ సంస్థ వారి రికార్డుల్లో లిఖించి భద్రపరచి ఆ మధుర స్మృతులను ప్రస్తావించటం ఆశ్చర్యానికి గురిచేసింది,కరోనా సమయంలో గాని ఇతర సందర్భాలలో నేను చేసిన సేవా కార్యక్రమాలు కూడా పొందుపరచి తిరిగి నాకే చూపించటం సంతోషాన్ని కలిగించింది అని తమ సంతోషాన్ని వ్యక్తం చేశారు ఈ కార్యక్రమంలో విశిష్ట అతిథులు,సినీ రంగానికి చెందిన ప్రముఖ కళాకారులు తదితరులు పాల్గొన్నారు.

# రాజీవ్ యువ వికాసం రుణాలకు సిబిల్ నిబంధన తొలగించాలి: పత్తి కుమార్



**ఉప్పల్, మే 13(న్యూస్ 9):** రాజీవ్ యువ వికాసం పథకం కింద ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనార్టీలకు రుణాల మంజూరులో సిబిల్ నిబంధనను ప్రామాణికంగా చూడవద్దని మేడ్చల్ మల్కాజ్‌గిరి జిల్లా ఎస్సీ సెల్ అధ్యక్షుడు పత్తి కుమార్ రాష్ట్ర ఎస్సీ కార్పొరేషన్ చైర్మన్ నగరిగారి ప్రీతమ్‌కు విజ్ఞప్తి చేశారు. ఈ మేరకు మంగళవారం మాసబ్‌ట్యాంక్‌లోని ఎస్సీ కార్పొరేషన్ కార్యాలయంలో ఆయన వినతి పత్రం సమర్పించారు. రాష్ట్రంలోని అన్ని జిల్లాల్లోనూ సిబిల్ ఉంటేనే రుణాలు మంజూరు చేస్తున్నారని అధికారులు చెబుతున్నారని పత్తి కుమార్ ఆవేదన వ్యక్తం చేశారు. ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనార్టీలకు సిబిల్ తక్కువగా ఉంటుందని, దీనివల్ల పేదలు తీవ్రంగా నష్టపోతున్నారని ఆయన అన్నారు. కాంగ్రెస్ ప్రభుత్వం పేదలకు న్యాయం చేస్తుందని, ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి అందరికీ మేలు చేస్తారని ప్రజలు నమ్ముతున్నారని ఆయన పేర్కొన్నారు. ఈ విషయాన్ని ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి, ఉప ముఖ్యమంత్రి మల్లు భట్టి విక్రమార్క దృష్టికి తీసుకెళ్లి పేద దళితులకు న్యాయం చేయాలని ఆయన కోరారు.

# హైదరాబాదులో 27 తారీకు రోజున జరిగే ఆకలికేకల మహా ధర్నాను విజయవంతం చేయండి ఆటో జేఏసీ అధ్యక్షులు మంద రవికుమార్ పిలుపు



**13 మే న్యూస్ నైన్ పెద్దపల్లి జిల్లా :** భువనగిరి జిల్లా ఆలేరు నియోజకవర్గం లో 19వ రోజు ఆటో రథయాత్రకు (2484 కిలోమీటర్లు) గూడూరు ప్రభాకర్ ఆటో జేఏసీ నాయకుల ఆధ్వర్యంలో ఘన స్వాగతం పలికారు అనంతరం ఆటో జేఏసీ రాష్ట్ర అధ్యక్షులు మంద రవికుమార్ మాట్లాడుతూ కాంగ్రెస్ ప్రభుత్వం మహాలక్ష్మి పథకం తీసుకొచ్చి మహిళలకు ఆర్టీసీ ఫ్రీ పథకం పెట్టడం వల్ల మహిళలు ఆటోలు ఎక్కడమే మానేశారని తద్వారా ఆటోలకు రెండు మూడు వందలు కూడా మిగలడం లేదని ఇల్లు కిరాయిలు కట్టలేక, ఫైనాన్స్ ఏళ్లక, అప్పులు తీర్చలేక ఆటో డ్రైవర్లు ఇప్పటివరకు రాష్ట్రంలో 83 మంది ఆటో డ్రైవర్లు ఆత్మహత్యలు చేసుకున్నారని వారిని ప్రభుత్వమే ఆదుకోవాలని, కాంగ్రెస్ పార్టీ 2023 ఎన్నికల్లో ఇచ్చిన హామీలను నిలబెట్టుకోవాలని రాష్ట్ర ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. ఈ లినెల 27న హైదరాబాద్ లో జరుగు ఆటో ఆకలి కేకలు మహాసభలిను వేలాది మంది ఆటో డ్రైవర్లు ఓనర్లు హాజరై విజయవంతం చేయాలని కోరారు ఇంకా ఈ కార్యక్రమంలో అధిక సంఖ్యలో ఆటో డ్రైవర్లు ఓనర్లు పాల్గొన్నారు

# బండారి రాజిరెడ్డి సేవలు మరువలేనివి: ఎమ్మెల్యే బిఎల్ఆర్

**ఉప్పల్, మే 13(న్యూస్ 9):** ఉప్పల్ నియోజకవర్గానికి తన సోదరుడు, దివంగత బండారి రాజిరెడ్డి చేసిన సేవలు మరువలేనివని, ఆయన చూపిన మార్గంలోనే ముందుకు సాగాలని ఉప్పల్ ఎమ్మెల్యే బండారి లక్ష్మారెడ్డి అన్నారు. డాక్టర్ ఏ.ఎస్. రావు నగర్ డివిజన్‌లోని సౌత్ కమలానగర్ వెల్ఫేర్ అసోసియేషన్ ఆధ్వర్యంలో నిర్వహించిన సంతాప సభలో ఆయన ముఖ్య అతిథిగా పాల్గొని ప్రసంగించారు. ప్రజల గురించే తుది శ్వాస వరకు ఆలోచించిన రాజిరెడ్డి మరణం అందరికీ తీరని లోటని ఎమ్మెల్యే పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో బీఆర్ఎస్ పార్టీ రాష్ట్ర నాయకులు సోమ శేఖర్ రెడ్డి, మాజీ కార్పొరేటర్ పావని రెడ్డి, కమలానగర్ వెల్ఫేర్ అసోసియేషన్ అధ్యక్షుడు రాఘవ రెడ్డి, మహిపాల్ రెడ్డి, కుమార స్వామి, రహీం, మురళి పంతులు, కాంగ్రెస్ పార్టీ నాయకులు, కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు



న్యూస్-9
సామాజిక అవసరం... సామాన్యుడి ఆయుధం
తెలుగు దినపత్రిక
www.news9-india.com
news9.india News9India_ news9telugudaily

# సీజ్ ఫైర్ వల్ల ఎవరికి లాభం ఇది తెలుసుకోవాల్సిన విషయం



**న్యూఢిల్లీ :**పహల్గాం ఉగ్రదాడి అనంతరం... భారతీయులంతా ప్రతీకార జ్వాలతో రగిలిపోయారనే చెప్పాలి! అనంతరం చేపట్టిన.. ఆపరేషన్ సిందూర్ తో చాలా మంది సంతృప్తి చెందారని.. ప్రతీకారం తీర్చుకున్నామని భావించారు. ఈ క్రమంలో... భారత్ పాక్ మధ్య తీవ్ర ఉద్రిక్తతలు నెలకొన్నాయి.. పాక్ యుద్ధం ప్రకటించేసింది. సరిహద్దులు వేడెక్కిపోయాయి.సరిహద్దు ప్రాంత ప్రజలు ఉక్కిరిబిక్కిరి అయిపోయారు. పిల్లలను తీసుకుని సురక్షిత ప్రాంతాలకు వెళ్లిపోయారు. ముసలివారిని తీసుకుని వెళ్లక తప్పని పరిస్థితి. పగలు, రాత్రి అని తేడా లేకుండా పాక్ డ్రోన్లు, క్షిపణులు ప్రయోగిస్తుంటే.. ఆ శబ్ధాలకే వణికిపోయే పరిస్థితి. ఇది సరిహద్దు ప్రాంతాల్లో నివాసం ఉండి అనుభవించేవారికి మాత్రమే తెలిసే అను భవం.ఈ సమయంలో ట్రంప్ ముందుగా ప్రకటించారనే సమ స్య ఒక్కటి కాసేపు పక్కనపెడితే... శనివారం సాయంత్రం 5 గంటల నుంచి కాల్పుల విరమణకు ఇరు దేశాలు అంగీ కారానికి వచ్చాయి. ఈ నిర్ణయాన్ని ప్రపంచదేశాలు స్వాగ తించాయి. అందుకు ప్రధాన కారణం... ఇరు దేశాలు పెద్ద ఎత్తున అణ్వాయుధాలను కలిగి ఉన్నవి కావడమే!అవును... భారత్, పాక్ లు అణ్వాయుధాలు కలిగిన దేశాలు. ఇలాంటి రెండు దేశాల మధ్య యుద్ధం వస్తే, తప్పని పరిస్థితుల్లో, వీటిలో ఏ ఒక్క దేశ మనుగడ ప్రశ్నార్థకం అవుతుందనే ఆలోచన వచ్చినా.. వెంటనే వాటిని బయటకు తీస్తుంది. అప్పుడు సుమారు 80 ఏళ్ల తర్వాత ఈ ప్రపంచం తొలిసారిగా అణ్వా యుధాల దాడి, తదనంతర పరిణామాలను చవిచూడాల్సి వస్తుంది.వాస్తవానికి.. 1945లో తొలిసారి అణుబాంబు దెబ్బ ఈ భూమి చూసింది! హిరోషిమా, నాగసాకి మీద పడిన అణు బాంబులు ఆ ప్రాంతాన్ని సర్వనాశనం చేసేశాయి. ఒక్క మాటలో చెప్పాలంటే... ఆ ప్రాంతం కొన్నాళ్ల పాటు శాపగ్రస్థమైన నేలగా మిగిలిపోయింది. నీరు ఉండదు, పంట పండదు, అక్కడ నేలే కాదు.. గాలి కూడా విషతుల్యం అయి పోయింది!ఆ ఫలితం చూసిన ప్రపంచం... ఆ తర్వాత జరిగిన ఏ యుద్ధంలోనూ అణ్వాయుధాలను బయటకు తీయాలనే ఆలోచన కూడా చేయలేదు! అంత ప్రభావం కలిగించాయి ఆ బాంబులు. అవి ఆ రెండు నగరాలపై దాడి చేసి 80 ఏళ్లు కావొస్తున్నా.. ఇప్పటికీ ఆ దాడి కలిగించిన జ్ఞాపకాలు చరిత్ర చదివితేనే వణికిపోయేలా ఉన్నాయని అంటారు.అయితే... ఆ విషయం తెలియక కొంతమంది, తెలిసినా మనవరకూ రాదులే అనే ధైర్యంతో ఇంకొంతమంది, అణు యుద్ధం ప్రభావం గురించి అవగాహన లేని అజ్ఞానంతో మరికొంతమంది... భారత్ - పాక్ తీసుకున్న చీజ్ ఫైర్ అంగికారంపై ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. ఈ సమయంలో అలాంటివారికోసం అణు బాంబు ఎఫెక్ట్ ని అర్థమయ్యేలా చెబుతున్నారు నిపుణుల ు!ఇందులో భాగంగా... 1945లో హిరోషిమా, నాగసాకీలపై పడిన అణుబాంబులతో పోలిస్తే... ఇప్పుడు భారత్, పాకిస్థాన్ ల వద్ద ఉన్న అణుబాంబులు సుమారు 20 రెట్లు ఎక్కువ శక్తివంతమైనవని చెబుతున్నారు. అలాంటి బాంబు ఒక్కటి భూమిపై పడితే.. ముందుగా అది పడిన నలుగైదు కి.మీ. విస్తీర్ణంలో ఉన్న సమస్తం బూడిదకూడా కనిపించకుండా ఆవి రైపోతుంది.ఆ తర్వాత కొన్ని పదుల కి.మీ. వరకూ జనానికి ఘోరంగా చర్మ కాలిపోయి చనిపోతారు. అనంతరం మరో 5 కి.మీ. వరకూ మొత్తం శిథిలాలు కనిపిస్తాయి.. ఆ తర్వాత గాలి వాటాన్ని బట్టి సుమారు 100 కి.మీ. వరకూ రేడియేషన్ ప్ర భావం వల్ల ప్రజలకు చర్మ క్యాన్సర్లు, లంగ్ క్యాన్సర్లు రావ డంతో పాటు.. నీరు, నేల, గాలి పూర్తిగా కలుషి తమైపోతుంది.సరే... అదేదో మనమే ముందుగా పాకిస్థాన్ పై వేస్తే అనే ఆలోచన కూడా చాలా మందికి రావొచ్చు. పాకిస్థాన్ చిన్నది కాబట్టి.. దానిపై ఎక్కడ అణుబాంబు వేసినా దాని ప్రభావం భారత్ పై ఉంటుంది! ఇక భారత్ పై సరిహద్దు రాష్ట్రాల్లో ఎక్కడ వేసినా.. దాని ప్రభావం పాకిస్థాన్ పైనా ఉం టుంది. ఫైనల్ గా ఇరు దేశాలు మరో హిరోషిమా, నాగ సాకీలకు ప్రతిరూపాలయ్యే అవకాశం ఉంది!ఇక్కడ గమని ంచాల్సిన మరో విషయం ఏమిటంటే... అణ్వాయుధాలు ఉన్నవి మరో దేశం మనపై దాడి చేయకుండా చూసు కుకోవడ —నికే తప్ప.. మనం దాడి చేయడానికి కాదనేది.. ప్రస్తుతం అణ్వాయుధాలు కలిగి ఉన్న ప్రతీ దేశం మదిలో పెట్టుకున్న ప్రాథమిక సూత్రం అని అంటారు! ఈ విషయం తెలియని చాలా మంది సీజ్ ఫైర్ విషయంలో ప్రభుత్వం పై ఫైర్ అయిపోతున్నారని చెబుతున్నారు.ఇక్కడ గమనించాల్సిన మరో విషయం ఏమిటంటే... భారత్ లక్ష్యం ఉగ్రవాదుల వినా శనం. దానికోసం దేశంలో నక్సలైట్స్ కోసం కూంబింగ్ చేసు న్నట్లు.. పాకిస్థాన్ లో దాక్కొన్న ఉగ్రవాదుల గురించి సర్జికల్ స్ట్రైక్స్, ఆపరేషన్ సిందూర్ లు.. మనపై దాడి జరిగినప్పుడు మాత్రమే కాకుండా, వారి గురించిన చేసేయ్యాలి.. చెప్పినట్లవుతుంది.

# నాలుగేళ్లలో ఇలాంటి రోజు ఒక్కటే ఎంతగా దూసుకెళ్లాయంటే



**న్యూఢిల్లీ :**ఇప్పటివరకు బ్లాక్ మండేలు చాలానే చూశాం. కానీ.. మెరుపుల మండే (సోమవారం)ను ఇటీవల కాలంలో చూడలేదు. సానుకూల వాతావరణం ఉన్నప్పుడు స్టాక్ మార్కెట్ దూసుకెళ్లటం మామూలే. కానీ.. ఈ స్థాయిలో మాత్రం ఇటీవల కాలంలో చూసింది లేదు. ఎందుకంటే.. ఒక్కరోజంటే ఒక్క రోజులో బూల్ దూకుడు చూసినోళ్లకు కడుపు నిండిపోయిన పరిస్థితి. బుల్ దూకుడుతో స్టాక్ మార్కెట్ లో ఎంతటి జోష్ వచ్చిందన్న విషయాన్ని సింపుల్ గా రెండు అంకెల్లో ఇట్టే చెప్పేయొచ్చు.సోమవారం ఒక్క రోజే సెన్సెక్స్ 2975 పాయింట్లు దూసుకెళితే.. నిఫ్టీ 917పాయింట్లు దూసుకెళ్లింది. నాలుగేళ్ల కాలంలో ఒక్కరోజులో ఇంతటి భారీ పెరుగుదల ఇదే తొలిసారి కావటం మరో విశేషం. సుచీల 4 శాతం ర్యాలీతో స్టాక్ మార్కెట్ లో ఒక్క రోజే రూ.16.15 లక్షల కోట్ల సంపదను క్రియేట్ చేసింది. దీంతో ఇన్వెస్టర్లు సంపదగా భావించే బీఎస్ఈలో లిస్టెడ్ కంపెనీల మొత్తం మార్కెట్ విలువ రూ.422.56 లక్షల కోట్లకు చేరింది.
దీనికి కారణం ఓవైపు భారత్ పాక్ మధ్యన సీజ్ ఫైర్. మరోవైపు అమెరికా చైనాల మధ్య ట్రేడ్ ఒప్పందాలతో సెంటిమెంట్ బలపడటంతో పాటు.. సానుకూల సంకేతాలతో మార్కెట్ల సూచీలు భారీ లాభాలతో మొదలయ్యాయి. ఈ ఊపు ఎక్కడా తగ్గలేదు. ఇంట్రాడేలో అన్ని రంగాల్లో కొనుగోళ్ల పర్వం కొనసాగింది. దీంతో సూచీలు మరిన్ని లాభాల్ని సొంతం చేసుకున్నాయి.ఒకానొక దశలో సెన్సెక్స్ 3041 పాయింట్లకు దూసుకెళ్లగా.. నిఫ్టీ 937 పాయింట్లవరకు ఎగిసింది. కానీ చివరకు కాస్త తగ్గాయి. ఇప్పుడున్న పరిస్థితుల్లో ఇవాళ.. రేపు కూడా మార్కెట్లు సానుకూలంగా ఉంటాయని చెబుతున్నారు. అయితే.. పాకిస్తాన్ అప్పుడప్పుడు చేస్తున్న కాల్పుల వైనం మార్కెట్ కు కాస్త మైనస్ గా మారినా.. మొత్తంగా సానుకూల వాతావరణమే ఎక్కువగా ఉంటుందని చెబుతున్నారు. ఈ అంచనాలన్నీ కూడా రాజకీయ పరిస్థితుల అంచనాతో చెప్పటమే తప్పించి.. స్టాక్ మార్కెట్ లో పెట్టుబడులు పెట్టేందుకు ప్రోత్సహించే ఉద్దేశంతో మాత్రం చెప్పటం లేదన్న విషయాన్ని మర్చిపోకూడదు. ఎవరికి వారు వారి విచక్షణతో మాత్రమే స్టాక్ మార్కెట్ లో పెట్టుబడులు పెట్టాలన్న ప్రాథమిక సత్యాన్ని మర్చిపోకూడదు.

# అమెరికా డాలర్ కు చెక్.. బలపడుతున్న 'రూపాయి'



**అమెరికా:**భారత రూపాయి అమెరికా డాలర్‌తో పోలిస్తే మంగళవారం 75 పైసలు బలపడి 84.65 వద్ద ప్రారం భమైంది. అంతకుముందు ముగింపులో ఇది 85.38 వద్ద ఉంది. మార్కెట్ విశ్లేషకుల ప్రకారం, ఆ రోజు ట్రేడింగ్ పరిధి 84.50 నుండి 85.25 మధ్య ఉంటుందని అంచనా వేయబడింది. అమెరికా - చైనా మధ్య కుదిరిన ఒక ముఖ్యమైన వాణిజ్య ఒప్పందం తరువాత డాలర్ తన లాభాలను నిలబెట్టుకుంది.ఈ ఒప్పందం ప్రకారం, అమెరికా చైనా వస్తువులపై సుంకాలను 90 రోజుల పాటు 145 శాతం నుండి 30 శాతానికి తగ్గిస్తుంది. అయితే చైనా అమెరికా వస్తువులపై సుంకాలను 90 రోజుల పాటు 125 శాతం నుండి 10 శాతానికి తగ్గిస్తుందని పేర్కొంది. ఆర్థిక - వాణిజ్య సంబంధాలపై చర్చలను కొనసాగించడానికి ఇరు దేశాలు ఒక యంత్రాంగాన్ని ఏర్పాటు చేస్తాయి.విశ్లేషకుల అభిప్రాయం ప్రకారం, భౌగోళిక రాజకీయ రంగంలో ఏవైనా తాజా పరిణామాలు రూపాయి దిశపై గణనీయమైన ప్రభావాన్ని చూపే అవకాశం ఉంది. ఈ ఆర్థిక సంవత్సరం 2025లో రూపాయి గ్రీన్‌బ్యాక్‌తో పోలిస్తే 83.10 - 87.6 పరిధిలో వర్తకం చేయబడింది. ప్రారంభంలో అమెరికా ఎన్నికల ఫలితాల తర్వాత బలహీనపడింది. నిరంతర ఫారిన్ పోర్ట్‌ఫోలియో ఇన్వెస్టర్స్ నిధుల ఉపసంహరణ , బలమైన అమెరికా డాలర్ కారణంగా సంవత్సరంలో 2.4 శాతం క్షీణించింది.ఈ సవాళ్లు ఉన్నప్పటికీ, ఆరోగ్యకరమైన ప్రభుత్వ ఆర్థిక పరిస్థితులు, తగ్గుతున్న కరెంట్ ఖాతా లోటు, మెరుగైన ద్రవ్యలభ్యత , తగ్గుతున్న చమురు ధరలు వంటి అంశాల మద్దతుతో, ఇతర ప్రపంచ కరెన్సీలతో పోలిస్తే రూపాయి సాపేక్షంగా స్థిరంగా ఉందని నేషనల్ స్టాక్ ఎక్స్ఛేంజ్ ఏప్రిల్ 'మార్కెట్ పల్స్ రిపోర్ట్' పేర్కొంది.సంవత్సరం చివరి నాటికి, డాలర్ బలం తిరోగమించడం.. రుణ మార్కెట్లలోకి ఎఫ్.పీఐ ల ప్రవాహం పునరుద్ధరించడం రూపాయి కోలుకోవడానికి సహాయపడింది, మార్చి 2025లో 2.4 శాతం పెరిగింది.ఈ ఆర్థిక సంవత్సరం 2025లో రూపాయి సగటు వార్షిక అస్థిరత 2.7 శాతానికి తగ్గింది. ఇది భారతదేశం యొక్క బలమైన బాహ్య నిల్వలు.. చురుకైన విదేశీ మారకద్రవ్య నిర్వహణను హైలైట్ చేస్తూ, తక్కువ అస్థిరత కలిగిన ప్రధాన అభివృద్ధి చెందుతున్న మార్కెట్ కరెన్సీలలో ఒకటిగా నిలిచింది.
"అయితే రూపాయి అధిక విలువను కలిగి ఉంది. 40-కరెన్సీ ట్రేడ్ వెయిటెడ్ రియల్ ఎఫెక్టివ్ ఎక్స్ఛేంజ్ రేట్ 105.3కి పెరిగింది, అయినప్పటికీ ఈ ఆర్థిక సంవత్సరం నామినల్ ఎఫెక్టివ్ ఎక్స్ఛేంజ్ రేట్ రెండూ క్రమంగా తగ్గుముఖం పట్టాయి, ఇది అధిక విలువ తగ్గడాన్ని సూచిస్తుంది. రూపాయికి ఒక సంవత్సరం ఫార్వర్డ్ ప్రీమియం తగ్గడం కొనసాగింది, ఇది మారుతున్న ప్రీమియం డైనమిక్స్ నివేదిక పేర్కొంది.

# హైదరాబాద్ లో ట్రంప్ టవర్స్ కు ఎసరు




**అమెరికా:**అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్‌నకు చెందిన ట్రంప్ రియాల్టీ కంపెనీ హైదరాబాద్‌లో ప్రతిష్టాత్మకంగా నిర్మించాలనుకున్న ట్రంప్ టవర్స్ ప్రాజెక్ట్‌కు భూ వివాదం చుట్టుకుంది. కోకాపేటలోని అత్యంత విలువైన భూమిలో ఈ నిర్మాణాలు చేపట్టాలని ప్లాన్ చేయగా, ఆ స్థలంలో సహ యజమాని ఒకరు అభ్యంతరం వ్యక్తం చేస్తూ లీగల్ నోటీసు జారీ చేయడంతో ప్రాజెక్ట్ భవితవ్యంపై అనుమానాలు నెలకొన్నాయి.వివరాల్లోకి వెళితే, హైదరాబాద్‌లోని ప్రముఖ రియల్ ఎస్టేట్ హాట్‌స్పాట్ కోకాపేటలో అత్యంత విలాసవంతమైన రెసిడెన్షియల్ టవర్స్‌ను నిర్మించాలని ట్రంప్ రియాల్టీ, వారి భారతీయ భాగస్వామి ఐరా రియాల్టీతో కలిసి ప్రణాళికలు సిద్ధం చేశాయి. ఈ ప్రాజెక్ట్ అనుమతులు దాదాపు చివరి దశకు చేరుకున్నాయని, త్వరలోనే పనులు ప్రారంభం కావచ్చని గతంలో ప్రచారం జరిగింది. గోల్డెన్ మైల్ ప్రాంతంలోని ఐరా రియాల్టీకి చెందిన స్థలంలో ఈ నిర్మాణాలు చేపట్టనున్నట్లు వెల్లడించారు.అయితే, ఇప్పుడు ఈ ప్రాజెక్ట్‌కు కేటాయించిన భూమి వివాదంలో చిక్కుకుంది. నాందెల రామ్ రెడ్డి అనే వ్యక్తి తాను ఆ స్థలంలో సహ యజమానినని పేర్కొంటూ, తనకు ఎటువంటి సమాచారం ఇవ్వకుండానే ట్రంప్ టవర్స్ ప్రకటనలు వెలువడుతున్నాయని, దీనిపై అభ్యంతరం వ్యక్తం చేస్తూ బహిరంగ లీగల్ నోటీసు జారీ చేశారు.రామ్ రెడ్డి తరపు న్యాయవాది పత్రికలకు విడుదల చేసిన ప్రకటనలో మాట్లాడుతూ, ట్రంప్ టవర్స్ నిర్మించ తలపెట్టిన 12,602 గజాల మొత్తం స్థలంలో తన క్లయింట్ నాందెల రామ్ రెడ్డికి 425 గజాల మేర ల్యాండ్ షేర్ ఉందని తెలిపారు. ఈ స్థలాన్ని ఐరా కంపెనీతో పాటు మరో పది మందికి పైగా వ్యక్తులు కలిసి కొనుగోలు చేశారని, వారిలో తన క్లయింట్ కూడా ఒకరని పేర్కొన్నారు.అయితే, ఇతర సహ యజమానులతో కలిసి లేదా జరిపారని లాయర్ ఆరోపించారు.

# ఓరుగల్లులో మిస్ వరల్డ్ అందాల భామల సందడి




**హైదరాబాద్ :**హైదరాబాద్లో నిర్వహిస్తున్న మిస్ వరల్డ్ పోటీలలో పాల్గొంటున్న వివిధ దేశాలకు చెందిన సుందరీ మణులు ఈనెల 14వ తేదీన చారిత్రక ఓరుగల్లు కోటను, హన్మకొండలోని వేయి స్తంభాల గుడిని, ములుగు జిల్లాలోని చారిత్రక రామప్ప దేవాలయాన్ని సందర్శి ంచనున్నారు. ఈ మేరకు అన్ని ఏర్పాట్లను అధికారులు పూర్తి చేశారు.హనుమకొండ, వరంగల్, ములుగు జిల్లాలలో ప్రపంచ సుందరీమణుల పర్యటనమిస్ వరల్డ్ పోటీలలో పాల్గొంటున్న వివిధ దేశాలకు చెందిన పోటీదారులు రాష్ట్రం లోని వివిధ పర్యాటక ప్రాంతాలను, చారిత్రక ప్రదేశాలను సందర్శిస్తున్న క్రమంలో రేపు హనుమకొండ, వరంగల్, ము లుగు జిల్లాలలో పర్యటించనున్నారు. ఈ నేపథ్యంలో హన్మ కొండ, వరంగల్, ములుగు జిల్లాల కలెక్టర్లు పి ప్రావీణ్య, డాక్టర్ సత్య శారద, దివాకర టీఎస్, వరంగల్ పోలీస్ కమిషనర్ సన్ ప్రీత్ సింగ్ ఎటువంటి ఇబ్బంది కలగకుండా వీరి పర్యటన ఏర్పాట్లను చేయించారు.సర్వాంగ సుందరంగా ఓరుగల్లు కోట, వెయ్యి స్తంభాల ఆలయం,, రామప్ప ఆలయాల ముస్తాబు వరంగల్ త్రి నగరాలను విద్యుత్ దీపాలతో అలంకరించారు. ములుగు జిల్లాలోని యునెస్కో గుర్తింపు పొందిన రామప్ప ఆలయాన్ని కూడా సర్వాంగ సుందరంగా తీర్చిదిద్దారు. హన్మకొండ, వరంగల్ లలో వివిధ శాఖల సమన్వయంతో ఎంట్రీ, ఎగ్జిట్ పాయింట్లను, బందోబస్తును, సౌండ్ అండ్ లైట్ షో ఏర్పాట్లను ఫ్లిక్ మార్కెట్, సాంస్కృతిక ప్రదర్శనలను చేస్తున్నారు .హన్మకొండ, వరంగల్ పర్యటన షెడ్యూల్ ఇలారేపు సాయంత్రం 4.35నిమిషాలకు మిస్ వరల్డ్ పోటీదారులు 35 మంది హన్మకొండలోని హరిత కాకతీయ హొటల్ కు చేరుకుని 5.45నిమిషాలకు వేయి స్తంభాల దేవాలయానికి వెళ్తారు. అక్కడినుండి 6.25 నిమిషాలకు వరంగల్ కోటను సందర్శిస్తారు అనంతరం7 గంటల 35 నిమి షాలకు హొటల్ కు తిరిగి చేరుకుని 9 ప్రయాణమవుతారు.

## హైదరాబాద్ లో 11 గంటల వరకు ఆ రోడ్లు క్లోజ్



**హైదరాబాద్ :**తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం అత్యంత ప్రతిష్టాత్మకంగా మిస్ వరల్డ్ - 2025 పోటీలను హైదరాబాద్ వేదికగా నిర్వహి స్తోంది. ఇప్పటికే అట్టహాసంగా ప్రారం భమైన 72వ ఈ అంతర్జాతీయ అందాల పోటీల్లో 110కి పైగా దేశాల నుంచి సుందరీమణులు విశ్వసుందరి కిరీటం కోసం పోటీపడుతున్నారు. భారత్ తరపున మిస్ ఇండియా నందిని గుప్తా పోటీలో ఉన్నారు. ఇక అందాల భామలు బృందాలుగా ఏర్పడి తెలంగాణలోని చారిత్రక ప్రదేశాలు, ప్రసిద్ధ ఆలయాలను సందర్శించనున్నారు.ఈ పోటీల్లో భాగంగా అందాల భామలు నేడు చార్మినార్ వద్ద హెరిటేజ్ వాక్, చౌమొహల్లా ప్యాలెస్‌లో విందులో పాల్గొననున్నారు. ఈ నేపథ్యంలో హైదరాబాద్ ట్రాఫిక్ పోలీసులు మధ్యాహ్నం 2 గంటల నుంచి రాత్రి 11 గంటల వరకు ట్రాఫిక్ ఆంక్షలు విధించారు. పలు మార్గాల్లో దారి మళ్లించారు. మదీనా నుంచి చార్మినార్ వైపు, చార్మినార్ నుంచి శాలిబండ వైపు.. శాలిబండ నుంచి వొల్గా జంక్షన్ వరకు, వొల్గా జంక్షన్ నుంచి మూసబౌలీ మీదుగా ఖిల్వత్ రోడ్డు వరకు అన్ని రకాల వాహనాల రాకపోకల ఎంట్రీ క్లోజ్ చేశారు.
ఈ ప్రాంతాల్లో ప్రయాణించే వాహనదారులు ప్రత్యామ్నాయ మార్గాలను ఎంచుకోవాలని ట్రాఫిక్ పోలీసులు సూచించారు. ఏదైనా అత్యవసర పరిస్థితుల్లో సహాయం లేదా సమాచారం కోసం 9010203626 హెల్ప్ లైన్ నంబర్‌ను సంప్రదించవచ్చున్నారు.దారి మళ్లించిన మార్గాలు ఏవంటే..నయాపూల్ నుండి చార్మినార్ వైపు వచ్చే వాహనాలను మదీనా జంక్షన్ నుండి సిటీ కాలేజీ వైపు మళ్లించారు. హిమ్మ్రత్ పురా వైపు నుండి వచ్చే వాహనాలను చౌమొహల్లా ప్యాలెస్ వైపు కాకుండా.. వొల్గా జంక్షన్ నుంచి ఫతే దర్వాజ వైపు పంపిస్తారు. అలాగే ఫతే దర్వాజ నుండి వచ్చే వాహనాలను వొల్గా జంక్షన్ నుంచి మళ్లిస్తారు. పూరానాపూల్, గుడ్ విల్ కేఫ్ నుంచి వచ్చే వాహనాలను చార్మినార్, చౌమొహల్లా ప్యాలెస్ వైపు అనుమతించరు. అలానే పలు మార్గాలను మళ్లించినట్టు ప్రకటించారు.

# తెలంగాణలో పాలీసెట్ ఎగ్జామ్



**హైదరాబాద్ :**తెలంగాణలో నేడే పాలీసెట్ ఎగ్జామ్ నిర్వహించనున్నారు. ఈ పరీక్ష ద్వారా రాష్ట్ర వ్యాప్తంగా ఉన్న ప్రభుత్వ, ప్రైవేట్ పాలిటెక్నిక్ కాలేజీలలో ప్రవేశాలు చేపట్టను న్నారు. ఇం దులో భాగంగా 3సంవత్సరాల ఇంజనీరింగ్, నాన్ ఇంజనీరింగ్ డిప్లొమా కోర్సులు, వ్యవసాయ, ఉద్యానవన, వెటర్నరీ డిప్లొమాలల్లో అడ్మిషన్స్ భర్తీ చేయనున్నారు.పరీక్ష ఈరోజు ఉదయం 11:00 గంటల నుంచి మధ్యాహ్నం 1:30 వరకు జరగనుంది. అందుకోసం రాష్ట్రవ్యాప్తంగా ఉన్న 276 పరీక్ష కేంద్రాలను సిద్ధం చేయగా.. 1,06,716 మంది విద్యార్థులు పరీక్షకు హాజరవుతున్నారని అధికారులు తెలిపారు.బ్లాక్ పెన్సిల్, ఎరేసర్, బ్లూ లేదా బ్లాక్ బాల్ పెన్ పరీక్షకు తీసుకురావాల్సి ఉంటుంది. హాల్ టికెట్‌పై ఫోటో లేకపోతే, విద్యార్థులు తప్పనిసరిగా ఒక పాస్‌పోర్ట్ సైజు ఫోటో, ఐడీ ప్రూఫ్ తీసుకురావాలని అధికారులు స్పష్టం చేశారు. అలానే సెల్‌ఫోన్‌లు, ఇతర ఎలక్ట్రానిక్ పరికరాలు పరీక్ష కేంద్రం లోకి అనుమతించబడవు.
పరీక్షకు ఒక గంట ముందు, అంటే ఉదయం 10:00 గంటలకే పరీక్ష కేంద్రం వద్ద ఉండాలి. ఉదయం 11:00 తరువాత ఒక్క నిమిషం ఆలస్యమైనా లోపలికి అనుమతి లేదు.
విద్యార్థులు తమ పరీక్ష కేంద్రాన్ని సులభంగా గుర్తించేందుకు యాప్ను గూగుల్ ప్లే స్టోర్ నుంచి డౌన్‌లోడ్ చేసుకోవచ్చు. అందులోని టాబ్ ఓపెన్ చేసి, మీ వివరాలు ఎంటర్ చేస్తే మీ సెంటర్‌కు వెళ్లే దారి మాపింగ్‌తో సహా చూపిస్తుంది.

## వైసీపీకి గుడ్ న్యూస్..వల్లభనేని వంశీకి బెయిల్



**విజయవాడ:**వైఎస్సార్‌సీపీ నాయకుడు, మాజీ ఎమ్మెల్యే వల్లభనేని వంశీకి బెయిల్ మంజూరు అయింది. విజయవాడలోని ఎస్సీ/ఎస్టీ కోర్టు మంగళవారం వంశీకి బె యిల్ మంజూరు చేసింది. సత్యవర్ధన్ కిడ్నాప్ కేసులో వంశీకి బెయిల్ దక్కింది. వంశీతో పాటు మరో నలుగురికి ఈ కేసులో కోర్టు బెయిల్ మంజూరు చేయడం జరిగింది. వల్లభనేని వంశీని 2023లో గన్నవరం టీడీపీ కార్యాలయంపై జరిగిన దాడి కేసులో ఫిబ్రవరి 13, 2025న హైదరాబాద్‌లో ఆంధ్రప్రదేశ్ పోలీసులు అరెస్టు చేశారు. గన్నవరం టీడీపీ కార్యాలయంపై దాడి కేసులో సాక్షిగా ఉన్న ముదునూరి సత్యవర్ధన్ అనే వ్యక్తిని వల్లభనేని వంశీ బెదిరించి, కిడ్నాప్ చేసి తప్పుడు అఫిడవిట్ దాఖలు చేయించాడని ఆరోపణలు వచ్చాయి. సత్యవర్ధన్ మొదట కోర్టులో తనకు ఈ కేసుతో సంబంధం లేదని చెప్పాడు.
అయితే, తర్వాత పోలీసులను ఆశ్రయించి వల్లభనేని వంశీ తనను కిడ్నాప్ చేసి బెదిరించాడని ఫిర్యాదు చేశాడు. ఈ ఫిర్యాదు ఆధారంగా వల్లభనేని వంశీపై కిడ్నాప్, బెదిరింపు, ఎస్సీ/ఎస్టీ చట్టం కింద కేసులు నమోదు చేశారు. ఇప్పటికే టీడీపీ ఆఫీస్‌పై దాడి చేసిన కేసులో వంశీకి బెయిల్ వచ్చింది.గన్నవరం కోర్టు ఆయనకు బెయిల్ మంజూరు చేసింది. తాజాగా కిడ్నాప్ కేసులో కూడా ఆయనకు బెయిల్ మంజూరు చేసింది కోర్టు. ఈ సంవత్సరం ఫిబ్రవరి 13న వంశీని పోలీసులు అదుపులోకి తీసుకున్నారు. దాదాపు మూడు నెలల తర్వాత ఆయన బెయిల్‌పై బయటకు రానున్నారు.

## ప్రతీకార దినోత్సవం రఘురామ షాకింగ్ నిర్ణయం



**పశ్చిమగోదావరి:**ఏపీ అసెంబ్లీ డిప్యూటీ స్పీకర్ కనుమూరు రఘురామకృష్ణంరాజు ఇవాళ కీలక నిర్ణయం తీసుకున్నారు. తొలిసారి పశ్చిమ గోదావరి జిల్లా ఉండి నియోజకవర్గం నుంచి ఎమ్మెల్యేగా ఎన్నికైన ఆయన రేపు ఓ ముఖ్యమైన కార్యక్రమం నిర్వహించేందుకు సిద్ధమయ్యారు. దీనికి ప్రజలంతా హాజరు కావాలని కూడా ఆయన పిలుపునిచ్చారు. దీంతో రఘురామరాజు చేపడుతున్న ఈ కార్యక్రమంపై రాష్ట్రవ్యాప్తంగా చర్చ జరుగుతోంది.రేపు తన ఉండి నియోజకవర్గంలో ప్రతీకార దినోత్సవం నిర్వహించాలని రఘురామ నిర్ణయించారు. దీనికి ప్రజలంతా హాజరు కావాలని ఆయన పిలుపునిచ్చారు. 2021 మే 14న తనపై రాజద్రోహం కేసు పెట్టారని, తనపై కేసు పెట్టి ఏం చేశారో అందరికీ తెలుసని ఆయన తెలిపారు. కాబట్టి దీనికి వ్యతిరేకంగా ప్రజలంతా ప్రతీకారం తీర్చుకున్న రోజు కాబట్టి ఇలా ప్రతీకార దినోత్సవం నిర్వహిస్తున్నట్లు రఘురామ తెలిపారు.గత వైసీపీ ప్రభుత్వంలో వీడియోలో మతాల్ని రెచ్చగొట్టేలా వ్యాఖ్యలు చేసారన్న కారణంతో రాజద్రోహం కేసు నమోదు చేశారు. ఈ కేసులో రఘురామను అరెస్టు చేసి జైలుకు కూడా పంపారు. సీఐడీ కస్టడీలో రఘురామపై దాడి కూడా చేశారు. అయితే సుప్రీంకోర్టు జోక్యంతో ఆ తర్వాత జైలు నుంచి రఘురామ విడుదలయ్యారు. అప్పట్లో వైసీపీ ఎంపీగా ఉన్న ఆయన సొంత ప్రభుత్వంపై నిత్యం విమర్శలు చేస్తూ ఉండేవారు. తద్వారా టీడీపీకి దగ్గరైన ఆయన.. గత ఎన్నికల్లో ఆ పార్టీ నుంచి ఎమ్మెల్యే టికెట్ తెచ్చుకుని గెలిచారు.అయితే తనపై రాజద్రోహం కేసు పెట్టి హింసించినా ఆ వ్యవహారంపై ప్రస్తుత కూటమి ప్రభుత్వం చర్యలు తీసుకోవడం లేదని రఘురామరాజు అసంతృప్తిగా ఉన్నారు. దీంతో ఈ కేసులో ప్రభుత్వం తక్షణం చర్యలు తీసుకోవాలని ఒత్తిడి పెంచేందుకే ఇలా ప్రతీకార దినోత్సవం నిర్వహిస్తున్నట్లు తెలుస్తోంది. తద్వారా ప్రజల్లో ఈ వ్యవహారంపై చర్చ జరిగేలా చేయాలన్నది ఆయన వ్యూహంగా కనిపిస్తోంది.

## బ్రాండెడ్ మెడిసినా.. జర భద్రం..



**హైదరాబాద్, మే 13:** నిత్యం వినియోగించే 300 రకాల బ్రాండెడ్ ఔషధాల కొనుగోలు విషయంలో అప్రమత్తంగా ఉండాలని రాష్ట్ర ఔషధ నియంత్రణ మండలి(డీసీఏ) ప్రజలకు సూచించింది. రాష్ట్రవ్యాప్తంగా డీసీఏ అధికా రులు నిర్వహించిన దాడుల్లో 5 రకాల ఔష దాల్లో నాణ్యత లేనట్లు గుర్తించారు. వాటిని తదుపరి పరీక్షల కోసం పంపారు. ఔషధాల కవర్లపై క్యూఆర్ కోడ్ ఉంటుందని, దాన్ని స్కాన్ చేస్తే, తయారు చేసిన కంపెనీ వివరాలు, తయారీ తెలుస్తాయన్నారు.

## పొలం పనులకు వెళ్తూ తిరిగి రాని లోకాలకు




**పల్నాడు జిల్లా** :పల్నాడు జిల్లాలో ఈరోజు ( మే 13, 2025 ) ఉదయం ఘోర రోడ్డు ప్రమాదం చోటుచేసుకుంది. ఈ ఘటనలో ఐదుగురు వ్యవసాయ కూలీలు మృతి చెందగా.. మరో ఏడుగురు తీవ్రంగా గాయపడ్డారు. ఈ ప్రమాదం వినుకొండ మండలం శివాపురం సమీపంలో జరిగింది .పొలం పనులకై వెళ్తుండగా..ప్రకాశం జిల్లా యర్రగొండపాలెం మండలం గడ్డమీదపల్లికి చెందిన రైతు కూలీలు బొప్పాయి కాయల లోడ్‌తో వెళ్తున్న బొలెరో ట్రాలీలో ప్రయాణిస్తున్నారు. ఆ సమయంలోనే ఎదురుగా వస్తున్న మరో లారీ వేగంగా వచ్చి ట్రాలీని ఢీకొట్టింది. ఈ ఘటనలో ట్రాలీ పూర్తిగా ధ్వంసమవ్వగా.. సంఘటనా స్థలంలోనే ముగ్గురు మృతి చెందారు. ఆసుపత్రికి తరలించేలోపు మరో ఇద్దరు ప్రాణాలు కోల్పోయారని వాపోతున్నారు.అలానే ప్రమాదంలో గాయపడిన ఏడుగురిని సమీపంలోని వినుకొండ ప్రభుత్వాసుపత్రికి తరలించి చికిత్స అందిస్తున్నారు. అత్యవసర పరిస్థితిలో ఉన్న ఇద్దరిని గుంటూరులోని పెద్ద ఆసుపత్రికి రిఫర్ చేసినట్లు సమాచారం. మరోవైపు పోలీసులు ఘటనా స్థలానికి చేరుకుని కేసు నమోదు చేసి దర్యాప్తు ప్రారంభించారు. లారీ డ్రైవర్ నిర్లక్ష్యమే ప్రమాదానికి కారణమై ఉండవచ్చని అనుమానిస్తున్నారు. డ్రైవర్ పరారీలో ఉండగా.. అతడిని పట్టుకునేందుకు గాలింపు చర్యలు ప్రారంభించామని తెలిపారు. ప్రమాదానికి గురైన వాహనాలను క్రేన్ సహాయంతో తొలగించి ట్రాఫిక్ కి ఇబ్బందులు లేకుండా క్లియర్ చేశారు. ఘటనలో మృతి చెందిన వారంతా ఒకే గ్రామానికి చెందినవారు కావడంతో గడ్డమీదపల్లెలో తీవ్ర విషాదఛాయలు అలముకున్నాయి. మృతుల కుటుంబ సభ్యులు శోకసంద్రంలో మునిగిపోగా.. గ్రామస్తులు కన్నీరు మున్నీరవుతున్నారు. ప్రమాదంలో మృతి చెందిన వారికి తగిన పరిహారం ఇవ్వాలని.. క్షతగాత్రులకు మెరుగైన వైద్యం అందించాలని స్థానికులు కోరుతున్నారు.

## గుండె పోటుతో కుప్పకూలిన మాజీ ఎంపీ



**అనంతపురం**:ఆంధ్రప్రదేశ్ రాజకీయాల్లో తీవ్ర విషాదం చోటు చేసుకుంది. అనంతపురం మాజీ లోక్‌సభ సభ్యుడు దరూరు పుల్లయ్య గుండెపోటుతో కన్నుమూశారు. ప్రస్తుతం కర్ణాటక లోని బళ్లారిలో ఆయన నివాసం ఉంటు న్నారు. సోమవారం నాడు ( మే 12, 2025 ) బళ్లారి నుంచి కంప్లి కొట్టాలలో ఉన్న తన పొలాన్ని చూడడానికి వెళ్లారు. తిరుగు ప్రయాణంలో కంప్లిలో స్నేహితులతో మాట్లాడేందుకు కారు దిగగా అక్కడే గుండెపోటుతో కుప్పకూలి ప్రాణాలు కోల్పోయారు.పుల్లయ్య పార్థివ దేహాన్ని బళ్లారిలోని తన ఇంటికి తీసుకెళ్లారు. ఆయన సొంతూరు అనంతపురం జిల్లా వజ్రకరూరు మండలం ఛాయాపురం. ఆయనకు భార్య సత్యవతి, ఆరుగురు కుమార్తెలు, కుమారుడు ఉన్నారు. మద్రాస్ లో లా పూర్తి చేశారు. పుల్లయ్య మరణంతో ఆయన కుటుంబం శోకసంద్రంలో మునిగిపోయింది. ఈ నెల 14వ తేదీ, బుధవారం అంత్యక్రియలు నిర్వహించనున్నట్లు వారు తెలిపారు. ఆయన మృతి పట్ల పలువురు ప్రజాప్రతినిధులు, కమ్మ సంఘం నేతలు సంతాపం తెలిపారు. మీరు మీ అమ్మను ఎలా చూస్తారో.. మీ పిల్లలు మిమ్మల్ని అలానే చూస్తారు 1968 నుంచి 1974 వరకు ఉరవకొండ పంచాయతీ సమితి అధ్యక్షుడిగా రెండు సార్లు గెలుపొందారు.1977–79, 1982–85 మధ్య అనంతపురం ఎంపీగా కాంగ్రెస్ పార్టీ తరఫున గెలుపొందారు.కాంగ్రెస్ పార్టీ కన్వీనర్ గానూ ఆయన బాధ్యతలు నిర్వర్తించారు.1965 నుంచి 1977 వరకు కంప్లి షుగర్ ఫ్యాక్టరీ డైరెక్టర్‌గా, బీడీసీసీ బ్యాంక్ డైరెక్టర్‌గా విధులు చేపట్టారు.

## హైదరాబాద్ లోని ఈ రూట్‌పై ట్రాఫిక్ ఆంక్షలు



**హైదరాబాద్:** మిస్ వరల్డ్-2025 పోటీదారుల హెరిటేజ్ వాక్ సందర్భంగా నేడు పాతబస్తీలో అధికారులు ట్రాఫిక్ ఆంక్షలు విధించారు. ప్రపంచ సుందరి రాంగులు చార్మినార్ నుంచి లాడ్ బజార్ వరకు పరిసర ప్రాంతాలను సందర్శించనుండటంతో రేవంత్ ప్రభుత్వం ట్రాఫిక్ ఆంక్షలు విధించింది. మదీనా నుండి చార్మినార్, చార్మినార్ నుండి శాలిబండ వెళ్లే మార్గాలను మధ్యాహ్నం రెండు గంటల నుండి రాత్రి 11 గంటల వరకు ఆంక్షలు చేపట్టింది.నయాపూల్ నుండి చార్మినార్ వైపు వచ్చే ట్రాఫిక్‌ను అధికారులు మదీనా జంక్షన్ వద్ద సిటీ కాలేజ్ వైపు మళ్లించనున్నారు. హిమత్పురా నుండి వచ్చే ట్రాఫిక్‌ను వోల్గా జంక్షన్ వద్ద దారి మళ్లించనున్నారు. పురానాపూల్ నుండి వచ్చే ట్రాఫిక్‌ను సిటీ కాలేజ్, ఫతే దర్వాజా వైపు ద్వారా దారి మళ్లిస్తున్నారు. హెరిటేజ్ వాక్ నేపథ్యంలో అప్రమత్తమైన అధికారులు ఇప్పటికే చార్మినార్ పరిసర ప్రాంతాలను బాంబు, డాగ్ స్క్వాడ్ లతో తనిఖీలు చేశారు.దాదాపు 4 ప్రత్యేక బస్సుల్లో చార్మినార్‌కు చేరుకునే సుందరీమణులకు మార్ఫా వాయి ద్యాలతో ఘన స్వాగతం పలికేందుకు అధికారులు తగిన ఏర్పాట్లు చేశారు. ఈ నేపథ్యంలోనే చార్మినార్ వద్ద మిస్ వరల్డ్-2025 పోటీదారులకు ప్రత్యేకంగా ఫోటో షూట్ నిర్వహి ంచను న్నారు. అనంతరం, చార్మినార్ స మీపంలోని మదీ బజారులో వివిధ రకాల గాజులు, ముత్యాల హారాలు తదితర అలంకరణ వ స్తువుల తయారు విధానాన్ని స్వయంగా పరిశీలించడంతో పాటు వారు షాపింగ్ కూడా చేస్తారు.

## సైబర్ నేరస్తుల కోసం స్పెషల్ ఆపరేషన్



**హైదరాబాద్:** తెలంగాణ సైబర్ సెక్యూరిటీ బ్యూరో ఆధ్వర్యంలో సైబర్ నేరస్తుల కోసం టీజీసీఎస్‌బీ స్పెషల్ ఆపరేషన్ చేపట్టింది. 20 మంది సైబర్ నేరస్తులను అరెస్టు చేసింది. సైబర్ క్రిమినల్స్‌కు మ్యూల్ బ్యాంకు ఖాతాలు సరఫరా చేస్తున్న ఏజెంట్లతో పాటు.. సహక రిస్తున్న ముఠాను సైబర్ సెక్యూరిటీ బ్యూరో అరెస్ట్ చేసింది. మే నెల 1వ తేదీ నుంచి 10వ తేదీ వరకు తెలంగాణ సైబర్ సెక్యూరిటీ బ్యూరో అధికారులు ప్రత్యేక ఆపరేషన్ చేపట్టారు. అరెస్ట్ అయిన వారిలో 14 మంది మ్యూల్ ఖాతాదారులు, ఆరుగురు ఏజెంట్లు పట్టుబడిన వారిలో ఉన్నారు. నిందితులపై తెలంగాణలో 60కి పైగా కేసులు ఉన్నాయి. దేశవ్యాప్తంగా 515 సైబర్ నేరాలతో సంబంధం ఉన్నట్లు సైబర్ సెక్యూరిటీ బ్యూరో అధికారులు గుర్తించారు.ప్రాథమిక విచారణలో 27 మ్యూల్ ఖాతాల ద్వారా దేశవ్యాప్తంగా రూ. 44.37 కోట్ల అనుమానాస్పద లావాదేవీలు జరిగినట్లు సైబర్ సెక్యూరిటీ బ్యూరో అధికారులు గుర్తించారు. తెలంగాణలోనే ఐదుగురు నిందితులు చెక్కుల ద్వారా రూ 22,64,500 విత్ డ్రా చేశారు. నిందితులలో ప్రైవేటు ఉద్యోగులు, వ్యాపారవేత్తలు, బ్యాంకు ఉద్యోగి ఉన్నారు. వ్యాపారం, ఇన్వెస్ట్‌మెంట్ ఫ్రాడ్స్, ట్రేడింగ్ పార్ట్ టైం ఉద్యోగాల పేరిట మోసాలు జరుగుతున్నాయి.

## సరిహద్దుల్లో కిల్లర్ టైగర్



**ఉమ్మడి ఆదిలాబాద్** : కొమురం భీం జిల్లా సరిహద్దులోని మహారాష్ట్ర చంద్రపూర్ జిల్లాలో బెబ్బులి వరుస దాడులు ఆదివాసి గూడెల్లో వణికిస్తున్నాయి. వేసవిలో తునికాకు సేకరణకు అడవుల్లోకి వెళ్లే కూలీలపై పెద్ద పులులు పంజా విసురుతూ పొట్టన పెట్టుకుంటున్నాయి. తునికాకు సేకరించేందుకు పేద కూలీలు వెళ్లిన క్రమంలో రెండు రోజుల్లోనే పెద్దపులి నలుగురిని హతమార్చింది. ఇదే టైగర్ తాజాగా సోమవారం మరో మహిళ ప్రాణాలను బలిగొనడం కలకలం రేపింది. పెద్దపులుల వరుస దాడులు అటు అటవీ అధికారుల్లో, ఇటు ప్రజల్లో భయాందోళనలు వ్యక్తమవుతున్నాయి.మూల్ తాలూకాలో మరో మహిళా మృతిచంద్రపూర్ జిల్లా మూల్ తాలూకాలోని బదురణ గ్రామానికి చెందిన భూమిక బెండరే(28 ) అనే మహిళ సోమవారం ఉదయం భర్త ఉదయ్, ఆమె తల్లిదండ్రులు, గ్రామస్తులతో కలిసి సమీపంలోని వెళ్లింది.

## పాక్ కాళ్ల బేరం కారణం చెప్పిన మిలటరీ వ్యవహారాల నిపుణుడు




**న్యూఢిల్లీ** :ఆపరేషన్ సిందూర్ తో భారత్ – పాక్ మధ్య తీవ్ర ఉద్రిక్తతలు నెలకొన్న వేళ, శనివారం సీజ్ ఫైర్ ప్రకటన వెలువడిన సంగతి తెలిసిందే. అయితే... ఇంత సడన్ గా, ఇప్పుడు ఈ వైపు నుంచి అవసరం లేకపోయినా భారత్ అంత ఉన్నపలంగా ఎందుకు సీజ్ ఫైర్ కి అంగీకరించింది? అనేది ఇప్పుడు భారత్ లోని 140 కోట్ల ప్రజానికంలోని మెజారిటీ ప్రజల సందేహంగా ఉందని అంటున్నారు.అయితే... ఇరు దేశాలు కాల్పుల విరమణకు ఒప్పుకోవాలని.. అలా కానిపక్షంలో మీతో వాణిజ్యం చేయనని.. సీజ్ ఫైర్ కి అంగీకరిస్తే ఇరు దేశాలతోనూ పెద్ద ఎత్తున వాణిజ్యం చేస్తానని చెప్పి ఒప్పించానని డొనాల్డ్ ట్రంప్ చెప్పుకుంటున్నారు. మరోవైపు సీజ్ ఫైర్ కోసం ముందుగా.. భారత్ నుంచే ప్రపోజల్ వచ్చిందని పాకిస్థాన్ చెప్పుకుంటుంది.ఈ సందర్భంగా స్పందించిన భారత్ మాత్రం.. శనివారం మధ్యాహ్నం పాకిస్థాన్ డైరెక్టర్ జనరల్ ఆఫ్ మిలటరీ ఆపరేషన్స్ (డీజీఎంఓ) నుంచి భారత్ కు కాల్ వచ్చిందని.. ఈ నేపథ్యంలోనే భారత్ సీజ్ ఫైర్ కు అంగీకరించిందని వెల్లడించింది. ఈ సమయంలో పాకిస్థాన్ సీజ్ ఫైర్ కోసం వెంపర్లాడిందని చెబుతూ ఓ విశ్లేషణ తెరపైకి వచ్చింది. అందుకు గల కారణం ఆసక్తిగా ఉంది!అవును... పహల్గాం ఉగ్రదాడి తర్వాత భారత్ ఎదురుదాడి చేస్తే దీటుగా బదులిస్తామన్న పాకిస్థాన్ ఒక్కసారిగా కాల్పుల విరమణ అంటూ భారత్ కు ఫోన్ చేసి కాళ్లబేరానికి రావడం వెనుక... ఈ విషయంలో ముందుగా సీజ్ ఫైర్ కోసం ప్రపంచ దేశాల చుట్టూ తిరగడం వెనుక అసలు కారణం ఒకటుందని తెలుస్తోంది. అదే... పాక్ అణ్వాయుధ కర్మాగారం సమీపంలో భారత్ బాంబు దాడి!భారత్ ఇటీవల పాకిస్థాన్ పై పలు ప్రాంతాల్లో దాడి చేయగా.. అందులో ఒకటి పాక్ న్యూక్లియర్ కమాండ్ కంట్రోల్ సెంటర్ ప్రాంగణంలో జరిగినట్లు తెలుస్తోంది. దీంతో... పాక్ సైనిక నాయకత్వం వెన్నులో వణుకుపుట్టి అమెరికాను ఆశ్రయించిందనే వాదన బలంగా వినిపిస్తోంది. ఈ కారణం వల్లే సీజ్ ఫైర్ విషయంలో అమెరికా అంత యాక్టివ్ అయ్యిందని అంటారు.

ఈ సందర్భంగా స్పందించిన రాండ్ కార్పొరేషన్ కు చెందిన డెరక్ జే గ్రోస్మన్ అనే మిలటరీ వ్యవహారాల నిపుణుడు... అణ్వాయుధాలను నియంత్రించడంలోనూ, నిల్వచేయడంలోనూ న్యూక్లియర్ కమాండ్ కంట్రోల్ పాత్ర అత్యంత కీలకం అని.. అలాంటి కంట్రోల్ సెంటర్ కు సమీపంలోనే ఇండియన్ ఆర్మీ ప్రిసిషన్ స్ట్రైక్ చేసింది అని తెలిపారు.ఇప్పటికే అన్ని లక్ష్యాలపైనా కచ్చితమైన దాడులు నిర్వహించే సత్తా భారత్ కు ఉందని చెప్పడమే దీని ఉద్దేశ్యం అని అంటూన్నారు. ఈ నేపథ్యంలోనే.. భారత్ %-% పాక్ ఘర్షణ అతిప్రమాదకరంగా ఉందని గ్రహించిన అమెరికా.. పాక్ రిక్వస్ట్ తో పాటు ప్రమాదాన్ని అంచనా వేసి రంగంలోకి దిగి, సీజ్ ఫైర్ గురించి సర్ధిచెప్పినట్లు ఆయన వెల్లడించారు. ఇదే అసలు విషయం అని అంటున్నారు!!

## బ్రహ్మోస్,ఆకాష్ తయారీ ముమ్మరం,ఆపరేషన్ సిందూర్ ఎఫెక్ట్

**న్యూఢిల్లీ** :ఆపరేషన్ సిందూర్ అనంతరం పాకిస్తాన్‌తో సరిహద్దుల్లో అనిశ్చిత వాతావరణం నెలకొన్న నేపథ్యంలో, భారత ప్రభుత్వం రక్షణ రంగంలో అప్రమత్తమైంది. బ్రహ్మోస్, ఆకాష్ వంటి కీలక క్షిపణుల తయారీతో పాటు వాటికి అవసరమైన విడిభాగాల ఉత్పత్తిని వేగవంతం చేయాలని సంబంధిత తయారీదారులకు ఆదేశాలు జారీ చేసింది. యుద్ధమేఘాలు కమ్ముకున్నప్పుడు కాకుండా, శాంతి నెలకొన్నప్పుడే సన్నద్ధత కీలకమని కేంద్రం భావిస్తోంది.క్షిపణి తయారీ కేంద్రంగా హైదరాబాద్ ప్రాధాన్యతభారతదేశపు "మిస్సైల్ క్యాపిటల్"గా పేరుగాంచిన హైదరాబాద్, అనేక ప్రభుత్వ, ప్రైవేట్ రంగ రక్షణ తయారీ సంస్థలకు నిలయంగా ఉంది. డిఫెన్స్ రీసెర్చ్ అండ్ డెవలప్‌మెంట్ ఆర్గనైజేషన్ భారత్ డైనమిక్స్ లిమిటెడ్ భారత్ ఎలక్ట్రానిక్స్ లిమిటెడ్ వంటి ప్రభుత్వ రంగ సంస్థలతో పాటు, అదానీ ఎల్బిట్ అడ్వాన్స్‌డ్ సిస్టమ్స్, కళ్యాణి రాఫెల్ అడ్వాన్స్‌డ్ సిస్టమ్స్ ఎంటీఏఆర్ టెక్నాలజీస్, ఆస్ట్రా మైక్రోవేవ్, అనంత్ టెక్నాలజీస్, రఘు వంశీ, జెన్ టెక్నాలజీస్, ఎస్ఈసీ ఇండస్ట్రీస్ వంటి అనేక ప్రైవేట్ సంస్థలు ఇక్కడ ఉన్నాయి. క్షిపణి వ్యవస్థలకు కీలకమైన సబ్-సిస్టమ్‌లను ఈ సంస్థలు సరఫరా చేస్తాయి.

ఆకాష్ ఇంకాబ్రహ్మోస్ క్షిపణులకు కీలక విడిభాగాలను సరఫరా చేసే హైదరాబాద్‌లోని ఒక సంస్థ ప్రమోటర్ మాట్లాడుతూ, డెలివరీలను వేగవంతం చేసేందుకుగాను వారాంతాల్లో కూడా




పనిచేయమని తమను కోరినట్లు తెలిపారు. ఆపరేషన్ సిందూర్‌కు ముందు రక్షణ మంత్రిత్వ శాఖ నుండి క్షిపణుల కోసం పెద్ద ఎత్తున అత్యవసర కొనుగోలు ఆర్డర్ వచ్చిందని, అయితే ఆపరేషన్ ప్రారంభమయ్యాక ప్రభుత్వం నిరంతరం సంప్రదిస్తూ వారానికోసారి డెలివరీలను కోరుతోందని మరో సంస్థ ప్రమోటర్ వెల్లడించారు. వీరు వ్యూహాత్మక క్షిపణులు, యూఏవీల నుండి ప్రయోగించే ఖచ్చితత్వంతో కూడిన క్షిపణుల కోసం ప్రొపల్షన్ సిస్టమ్‌లను సరఫరా చేస్తున్నారు.

డ్రోన్ టెక్నాలజీపై కేంద్ర దృష్టిక్షిపణులతో పాటు డ్రోన్,యాంటీ-డ్రోన్ టెక్నాలజీ కంపెనీలతో కూడా రక్షణశాఖ అధికారులు సంప్రదింపులు జరుపుతున్నారు. సామర్థ్యాలను పెంచడానికి అన్ని కంపెనీలతో కలిసి పనిచేస్తున్నారని ఒక డ్రోన్ టెక్ కంపెనీ వ్యవస్థాపకుడు తెలిపారు. ఆపరేషన్ సిందూర్ సమయంలో కీలక రక్షణ మరియు పోర్ట్-సంబంధిత మౌలిక సదుపాయాల రక్షణ కోసం వీరి యాంటీ-డ్రోన్ సిస్టమ్‌లను ఉపయోగించారు. అన్ని విభాగాల కమాండర్లకు నేరుగా పరికరాలు కొనుగోలు చేసే హక్కులు ఇచ్చారని, రాబోయే రెండు, మూడు నెలల్లో పెద్ద ఎత్తున ఆర్డర్లు వస్తాయని ఆయన అంచనా వేస్తున్నారు.ఆపరేషన్ సిందూర్ అనుభవాల నేపథ్యంలో, నిజమైన దాడులు భూమి నుండి కాకుండా ఎక్కువగా ఉపరితలం నుండి వచ్చే అవకాశం ఉందని స్పష్టమైందని,అందుకే ప్రభుత్వం లొసుగులను పూడ్చాలని భావిస్తోందని ఆ కంపెనీ వ్యవస్థాపకుడు పేర్కొన్నారు. సాధారణంగా ఆర్డర్‌లను పూర్తి చేయడానికి ఆరు నెలల నుండి ఒక సంవత్సరం పట్టేదని,అయితే ఇప్పుడు ప్రభుత్వం వాటిని కొద్ది నెలల్లోనే కోరుకుంటోందని ఆయన తెలిపారు.బాలాకోట్ దాడుల్లో హైదరాబాదీ క్షిపణులుయాదృచ్ఛికంగా, ఫిబ్రవరి 2019లో బాలాకోట్ వైమానిక దాడుల్లో ఉపయోగించిన స్పైస్ 2000 క్షిపణులను హైదరాబాద్‌లోని కళ్యాణి రాఫెల్ అడ్వాన్స్‌డ్ సిస్టమ్స్ లోనే తయారు చేశారు. విశ్వసనీయ వర్గాల సమాచారం ప్రకారం, ఆపరేషన్ సిందూర్ కోసం కూడా స్పైస్ క్షిపణులను సిద్ధం చేసినప్పటికీ, భారత వైమానిక దళం చివరకు స్కాల్ప్ మరియు హామర్ ఉపయోగించింది.

## తిరుమలలో ఎల్లుండి నుండి వారికి బ్రేక్ దర్శనాలు




**తిరుమల:**కలియుగ ప్రత్యక్ష దైవం, ఏడుకొండల పైన కొలువైన శ్రీ వెంకటేశ్వర స్వామి భక్తులకు దేవాదాయ శాఖ మంత్రి ఆనం రామనారాయణరెడ్డి శుభవార్త చెప్పారు. తిరుమలలో ఎల్లుండి నుండి విఐపి సిఫార్సు లేఖలు స్వీకరిస్తామని మంత్రి ఆనం రామనారాయణరెడ్డి తెలిపారు. తెలుగు రాష్ట్రాల ప్రజాప్రతినిధుల సిఫార్సు లేఖల పైన ఎల్లుండి నుంచి బ్రేక్ దర్శనాలు చేసుకోవచ్చని ఆయన వెల్లడించారు.

మే 15వ తేదీ నుంచి ప్రజాప్రతినిధుల సిఫార్సు లేఖలు స్వీకరిస్తాం: మంత్రి ఆనంమే 15వ తేదీ నుంచి ప్రజాప్రతినిధుల సిఫార్సు లేఖలు స్వీకరిస్తామని ఏపీ మంత్రి ఆనం రామనారాయణ రెడ్డి వెల్లడించారు. దీంతో ప్రజా ప్రతినిధులు సిఫార్సు లేఖల మీద స్వామివారి దర్శనానికి వెళ్లాలని భావించే భక్తులకు స్వామివారి దర్శనానికి మార్గం సుగమమైంది. ఇక టీటీడీ కూడా సిఫార్సు లేఖ విషయంలో అధికారికంగా ప్రకటన చేసింది.తిరుమల శ్రీవారి దర్శనార్థం ఏపీ, తెలంగాణ రాష్ట్రాల ఎంపీ, ఎమ్మెల్యే, ఎమ్మెల్సీల సిఫార్సు లేఖల పునరుద్ధరణకు మాత్రమే తాత్కాలికంగా టిటిడి నిర్ణయం తీసుకుంది. ఈ నెల 15వ తేదీ నుండి సదరు నేతల సిఫార్సు లేఖలను మాత్రమే టిటిడి అనుమతించనుంది. అయితే మిగిలిన వారి సిఫార్సు లేఖలపై అంతకుముందు తీసుకున్న నిర్ణయం కొనసాగుతుంది . నియమావళి ప్రకారం అనుమతి పొందిన భక్తులకు ఈ నెల 16వ తేదీ నుండి శ్రీవారి దర్శనం కల్పించనున్నారు.విఐపి సిఫార్సు లేఖల విషయంలో కీలక నిర్ణయంవేసవికాలంలో భక్తుల రద్దీ ఎక్కువ ఉన్న నేపథ్యంలో తిరుమల శ్రీవారి దర్శనం చేసుకోవడానికి వచ్చే సామాన్య భక్తులకు ఇబ్బంది కలుగకుండా ఉండేవిధంగా వేసవి రద్దీని దృష్టిలో పెట్టుకొని విఐపి సిఫార్సు లేఖల విషయంలో కీలక నిర్ణయం తీసుకున్న విషయం తెలిసిందే. శ్రీవారి దర్శనానికి స్వయంగా వచ్చే ప్రోటోకాల్ విఐపిలకు మాత్రమే మే ఒకటవ తేదీ నుంచి జూలై 15వ తేదీ వరకు బ్రేక్ దర్శనాలు పరిమితం చేయాలని టిటిడి నిర్ణయించింది.వేసవిలో భక్తుల రద్దీతో నిర్ణయం.. ప్రస్తుతం నిర్ణయంలో మార్పుప్రజా ప్రతినిధులు, తిరుమల తిరుపతి దేవస్థాన సభ్యుల సిఫార్సు లేఖలు కూడా చెల్లవని ప్రకటించారు. ప్రోటోకాల్ విఐపి లకు మాత్రమే దర్శనాన్ని కల్పించే లాగా నిర్ణయం తీసుకున్నారు. వేసవి సెలవుల్లో భక్తుల రద్దీ ఎక్కువగా ఉండడంతో శ్రీవారి దర్శనానికి వచ్చే సాధారణ భక్తులకు అధిక ప్రాధాన్యత ఇవ్వడంలో భాగంగా అధికారులు ఈ నిర్ణయం తీసుకున్నారు.ప్రస్తుతం ఆ గడువును తగ్గిస్తూ తెలుగు రాష్ట్రాల ప్రజా ప్రతినిధుల సిఫార్సు లేఖలకు అవకాశం కల్పించనున్నారు. ఇదిలా ఉంటే నిన్న తిరుమల శ్రీవారిని 68 వేల 760 మంది భక్తులు దర్శించుకున్నారు. 27 వేల 544 మంది స్వామివారికి తలనీలాలను సమర్పించారు ఇక పది వెయిటింగ్ కంపార్ట్మెంట్లో వేచి ఉన్న భక్తులు నాలుగు గంటల సమయంలో స్వామివారిని దర్శించుకున్నారు. నిన్న తిరుమల స్వామి వారి హుండీ ఆదాయం 3.90 కోట్లు గా ఉంది.

## ఔటర్ రింగ్ రోడ్డు టోల్ ప్లాజా వద్ద కేవలం ఒక ఫాస్టాగ్ లేన్

**హైదరాబాద్ సిటీ:** ఔటర్ రింగ్ రోడ్డు టోల్ ప్లాజా వద్ద కేవలం ఒక ఫాస్టాగ్ లేన్‌ను, ఒక క్యాష్ లేన్‌ను మాత్ర మే తెరిచి ఉంచుతున్నారు. మిగతా వాటిని మూసివేశారు. దీంతో వాహనదారులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. వాహనాలన్నీ ఒకే లేన్ వద్ద బారులు తీరాల్సి వస్తోంది. పదేళ్ల క్రితం 8లేన్లతో నిర్మించిన ఔటర్ రింగ్‌రోడ్డుపై 2018 వరకు నగదు టోల్ చెల్లింపులే జరిగాయి. చిల్లర కోసం వాహనదారులు వెయిట్ చేయాల్సి రావడం వల్ల ట్రాఫిక్ జామ్ అయ్యేది. దీంతో రేడియో ఫ్రీక్వెన్సీ ఐడెంటిఫికేషన్ (ఆర్ఎఫ్ఐడీ) విధానాన్ని అందుబాటులోకి తెచ్చారు. ప్రయాణించిన దూరానికి మాత్రమే టోల్‌ఫీజు వసూలు చేసే సాంకేతిక వ్యవస్థను రూపొందించారు. ప్రపంచంలోని పలు అభివృద్ధి చెందిన దేశాల్లో మినహా ఎక్కడా ఈ విధానం లేదు. హెచ్ఎండీఏ ప్రయోగాత్మకంగా అమలు చేయగా అప్పుడప్పుడు సాంకేతిక సమస్యలు మినహా సత్ఫలితాలు



వచ్చాయి.ఔటర్ రింగు రోడ్డుపై బొంగులూరు ఇంటర్‌ఛేంజ్(ఎగ్జిట్-12) వద్ద ఇరువైపులా ఎంట్రీలో ఐదు టోల్ లైన్లు, ఎగ్జిట్‌లో ఐదు టోల్ లైన్లు ఉన్నాయి. వాటిలో ఇప్పుడు ఒక ఫాస్టాగ్, ఒక క్యాష్ లేన్ల నుంచి మాత్రమే వాహనాలను అనుమతిస్తున్నారు. మిగతా లేన్లు మూసివేశారు. ఔటర్ రింగ్‌రోడ్డుపై ప్రయాణించే వాహనాల్లో 90 శాతం ఫాస్టాగ్ కలిగినవే ఉంటాయి. అవన్నీ ఒకే లేన్ గుండా వెళ్లాల్సి రావడంతో ట్రాఫిక్ జామ్ సమస్యలు తలెత్తుతున్నాయి.

కారణాలేంటి?ఫాస్టాగ్ లేన్లు ఎన్ని ఎక్కువగా ఉంటే టోల్‌ప్లాజాల వద్ద వాహనాల ఆగే సమయం అంత తగ్గుతుంది. శివారు ప్రాంతాలకు వెళ్లేవారిలో చాలా మంది ఔటర్ గుండా వెళ్లేందుకే ఆసక్తి చూపుతారు. ట్రాఫిక్ జామ్ నుంచి తప్పించుకునేందుకు వాళ్లందరూ ఔటర్ ఎక్కితే ప్రస్తుతం టోల్‌ప్లాజాల వద్ద ఆగిపోవాల్సి వస్తోంది. అయితే లేన్లు మూసివేయడానికి గల కారణాలను టోల్ ప్లాజాల సిబ్బంది చెప్పడం లేదు. సాంకేతిక సమస్యల వల్లే ఫాస్టాగ్ లేన్లు మూసేశారనే అనుమానాలు వ్యక్తమవుతున్నాయి. హెచ్ఎండీఏ ఉన్నతాధికారులు దీనిపై దృష్టి సారించి తగిన చర్యలు తీసుకోవాలని వాహనదారులు కోరుతున్నారు.

## ఆపరేషన్ సిందూర్‌పై భారత విదేశాంగ శాఖ కీలక ప్రకటన



**న్యూఢిల్లీ, మే 13:** ఆపరేషన్ సింధూర్‌పై భారత విదేశాంగ శాఖ మంగళవారం కీలక ప్రకటన చేసింది. జమ్మూ కాశ్మీర్ విషయంలో భారత్ విధానంలో ఎటువంటి మార్పు లేదని స్పష్టం చేసింది. కాల్పుల విరమణపై డీజీఎంవోల సమావేశంలో చర్చించామని భారత విదేశీ వ్యవహారాల శాఖ అధికార ప్రతినిధి రణధీర్ జైస్వాల్ వెల్లడించారు. మే 10వ తేదీన పాకిస్థాన్ డైరెక్టర్ జనరల్ ఆఫ్ మిలటరీ ఆపరేషన్స్ నుంచి ఫోన్ వచ్చిందని చెప్పారు. ఆ క్రమంలో ఈ భేటీలో కాల్పుల విరమణపై నిర్ణయం తీసుకున్నామన్నారు.కాల్పుల విరమణ ప్రతిపాదత పాకిస్థాన్ నుంచే వచ్చిందన్నారు. జమ్మూ కాశ్మీర్ విషయంలో ఎలాంటి మార్పులు లేవని ఆయన స్పష్టం చేశారు. పాక్ ఆక్రమిత కాశ్మీర్‌ను ఖాళీ చేయించాలన్నదే భారత్ విధానమని రణ్‌ధీర్ జైస్వాల్ కుండబద్దలు కొట్టారు. కశ్మీర్ విషయంలో మధ్యవర్తిత్వం అవసరం లేదని స్పష్టం చేశారు. ద్వైపాక్షిక విధానంతోనే అన్ని సమస్యలకు పరిష్కారం లభిస్తోందని రణ్‌ధీర్ జైస్వాల్ విశ్వాసం వ్యక్తం చేశారు.ఆపరేషన్ సిందూర్ జరుగుతోన్న సమయంలో భారత్, అమెరికా నాయకులు మాట్లాడారని గుర్తు చేశారు. అయితే ఇందులో వాణిజ్యపరమైన అంశాలపై చర్చ జరగలేదని చెప్పారు. ఇక సింధూ నది జలాల ఒప్పందంపై సస్పెన్షన్ కొనసాగుతుందన్నారు. కాశ్మీర్‌పై తమ విధానం మారలేదని తెలిపారు. కాశ్మీర్ అంశంపై ద్వైపాక్షింగా చర్చిస్తామని పేర్కొన్నారు.పాక్ ఆక్రమిత కాశ్మీర్‌పైనే చర్చలు ఉంటాయని ఆయన వివరించారు. టిఆర్ఎఫ్ లష్కరితోయిబా అనుబంధ సంస్థ అని తెలిపారు. దీనిపై అంతర్జాతీయంగా నిషేధం విధించేందుకు చర్యలు తీసుకుంటున్నామన్నారు. పాకిస్తాన్ అక్రమంగా ఆక్రమించిన భారత భూభాగాన్ని వదిలివేయడం అనేది మిగిలి ఉన్న విషయమని విదేశీ వ్యవహారాల శాఖ అధికార ప్రతినిధి రణధీర్ జైస్వాల్ తెలిపారు.ఏప్రిల్ 22వ తేదీన జమ్మూ కశ్మీర్‌లోని పహల్గాంలో పర్యాటకులే లక్ష్యంగా ఉగ్రవాదులు కాల్పులు జరిపారు. ఈ కాల్పుల్లో 26 మంది మరణించారు. మృతుల్లో అత్యధికులు పర్యాటకులే ఉన్నారు. అయితే ఈ ఘటనకు తామే బాధ్యులమంటూ (టీఆర్ఎఫ్) ప్రకటించింది.

న్యూస్-9
తెలుగు దినపత్రిక
www.news9-india.com
news9.india News9India_ news9telugudaily

## ఆపరేషన్ సిందూర్ నష్టాలను చెప్పిన పాక్



**న్యూఢిల్లీ :**ఆపరేషన్ సిందూర్ తో పాకిస్థాన్ ను వణికించేశామని.. మన సైనిక దాడుల్లో పాక్ లో తీవ్ర నష్టాలు జరిగాయని.. ఈ క్రమంలో 100 మంది ఉగ్రవాదులతో పాటు సుమారు 35 నుంచి 40 మంది సైనికులు మృతి చెందారని భారత్ ప్రకటించిన సంగతి తెలిసిందే. ఈ నేపథ్యంలో ఆపరేషన్ సిందూర్ మిగిల్చిన నష్టాన్ని వెల్లడించింది పాక్!అవును... భారత్ చేపట్టిన ఆపరేషన్ సిందూర్ వల్ల పాక్, పీవోకే లోని 9 ఉగ్రశిబిరాలు, 100 మంది ఉగ్రవాదులు నాశనం అయినట్లు భారత్ ప్రకటించిన సంగతి తెలిసిందే. ఈ నేపథ్యంలో పాక్ లో జరిగిన సైనిక నష్టాన్ని ఆ దేశం వెల్లడించింది. ఇందులో భాగంగా... భారత దాడుల్లో 11 మంది పాక్ సైనికులు మరణించినట్లు ఐ.ఎస్.పీ.ఆర్. వెల్లడించింది.ఇదే సమయంలో 78 మంది గాయపడ్డారని ఇంటర్ సర్వీసెస్ పబ్లిక్ రిలేషన్స్ (ఐ.ఎస్.పీ.ఆర్) మంగళవారం ఓ ప్రకటనలో తెలిపింది. ఇదే సమయంలో... ఐ.ఎస్.పీ.ఆర్. తో పాటు పాకిస్థాన్ సైనిక మీడియా విభాగం కూడా ఈ విషయాన్ని వెల్లడించింది. అదేవిధంగా 40 మంది పౌరులు మరణించారని.. వారిలో ఏడుగురు మహిళలు, 15 మంది పిల్లలు ఉన్నట్లు తెలిపింది.

ఇక.. మరణించిన 11 మంది సైనికుల్లో ఆరుగురు పాకిస్థాన్ ఆర్మీకి చెందినవారని, మిగిలిన ఐదుగురు పాకిస్థాన్ వైమానిక దళానికి చెందినవారని తెలిపింది. వారి గొప్ప త్యాగం, ధైర్యం, భక్తి, అచంచలమైన దేశభక్తికి శాశ్వత చిహ్నం.. దేశం జ్ఞాపకార్థం శాశ్వతంగా చెక్కబడి ఉంటుందని ఐ.ఎస్.పీ.ఆర్. ప్రకటన తెలిపింది.

## భారత్ కొత్త యుద్ధం 'ఆపరేషన్ కెల్లర్'




**న్యూఢిల్లీ :**పహల్గాం ఉగ్రదాడికి ప్రతీకారంగా, ఉగ్రవాదుల ఏరివేతే లక్ష్యంగా భారత్ చేపట్టిన ఆపరేషన్ సిందూర్ కొనసాగుతూనే ఉంటుందని భారత్ ప్రకటించిన సంగతి తెలిసిందే. ఈ సమయంలో తాజాగా జమ్మూకాశ్మీర్ లో "ఆపరేషన్ కెల్లర్" చేపట్టింది భారత్ సైన్యం. పక్కా సమాచారంతో మొదలుపెట్టిన ఈ ఆపరేషన్ లో రిజల్ట్ వచ్చిందని ఆర్మీ ప్రకటించింది.అవును... పాక్ లో చివరి ఉగ్రవాది అంతమయ్యే వరకూ ఆపరేషన్ సిందూర్ ఆగదన్నట్లుగా చెబుతున్న భారత్.. ఈ క్రమంలో మరికొన్ని ఆపరేషన్స్ ని షురూ చేస్తుంది. ఇందులో భాగంగా... తాజాగా మంగళవారం షోపియన్ లోని జిన్ పథర్ కెల్లర్ ప్రాంతంలో భద్రతా దళాలకు, ఉగ్రవాదులకు మధ్య భీకర ఎన్ కౌంటర్ జరిగింది.ఈ ఎన్ కౌంటర్ లో కనీసం ముగ్గురు లష్కరే తోయిబా ఉగ్రవాదులు హతమయ్యారని ఆర్మీ ప్రకటించింది. అందులో ఒక ఉగ్రవాది స్థానిక నివాసి అయిన షాహిద్ అని గుర్తించినట్లు వర్గాలు తెలిపాయి. రాష్ట్రీయ రైఫిల్స్ యూనిట్ నుంచి వచ్చిన పక్కా నిఘా సమాచారం మేరకు సైన్యం ఎన్ కౌంటర్ స్థలం పేరు మీద "ఆపరేషన్ కెల్లర్"ను ప్రారంభించింది.ఈ సందర్భంగా స్పందించిన ఆర్మీ... రాష్ట్రీయ రైఫిల్స్ ఇచ్చిన పక్కా నిఘా సమాచారం ఆధారంగా ఇండియన్ ఆర్మీ ఒక సెర్చ్, విధ్వంస ఆపరేషన్ ప్రారంభించిందని.. ఆపరేషన్ సమయంలో ఉగ్రవాదులకు సైన్యానికి జరిగిన ఎదురు కాల్పుల్లో ముగ్గురు ఉగ్రవాదులు హతమయ్యారని తెలిపింది. ప్రస్తుతం ఆపరేషన్ ఇంకా కొనసాగుతుందని వెల్లడించింది.మరోవైపు... పహల్గాం దాడికి కారణమని భావిస్తున్న ముగ్గురు ఉగ్రవాదులు.. ఆదిల్ హుస్సేన్ థోకర్, అలీ భాయ్, హాషీం మూసాల కోసం "టెర్రర్ ఫ్రీ కాశ్మీర్" పోస్టర్లను భద్రతా సంస్థలు ఏర్పాటు చేశాయి. షోపియన్ జిల్లాలోని అనేక ప్రాంతాల్లో ఈ పోస్టర్లు అతికించబడ్డాయి. వీరికి సంబంధించిన సమాచారం ఇచ్చిన వారికి రూ.20 లక్షల రివార్డు ప్రకటించారు.

## జగన్‌కు షాక్ బాలాజీ గోవిందప్ప అరెస్టు



**విజయవాడ :**వైసీపీ అధినేత జగన్‌కు అత్యంత సన్నిహితుడు, జగన్ సతీమణిభారతి నేతృత్వంలోని భారతీ సిమెంట్స్ కంపెనీ మేనేజింగ్ డైరెక్టర్.. ఆ కంపెనీ ఆడిటర్ కూడా అయిన.. బాలాజీ గోవిందప్పను ఏపీ పోలీసులు అరెస్టు చేశారు. ఈపరిణామం..వైసీపీ అధినేతకు షాకిచ్చింది. ఏపీ పోలీసుల కళ్లు గప్పి.. మైసూరులో దాక్కున్న బాలాజీ గోవిందప్పను పక్కా సమాచారంతో అక్కడకు వెళ్లిన పోలీసులు.. అరెస్టు చేశారు. ప్రస్తుతం ఆయనను ఏపీకి తీసుకు వస్తున్నారు.వైసీపీ హయాంలో మద్యం కుంభకోణం జరిగినట్టు గుర్తించిన ఏపీ ప్రభుత్వం.. దీనిపై కేసు నమోదు చేసింది. ఆ వెంటనే దీనిని విచారించేందుకు విజయవాడ పోలీసు కమిషనర్ రాజశేఖర్‌బాబుతో కలిసి.. ఒక ప్రత్యేక దర్యాప్తు బృందాన్ని(సిట్) ఏర్పాటు చేసింది. ఈ క్రమంలోనే విచారణ ముమ్మరంగా సాగింది. మద్యం కుంభకోణంలో ఏకంగా 3200 కోట్ల రూపాయలు గోల్‌మాల్ జరిగినట్టు సిట్ గుర్తించింది. కీలక నిందితుడు రాజ్ కసిరెడ్డిని అదుపులోకి తీసుకున్న అధికారులు అతని నుంచి మరింత సమాచారం సేకరించారు.ఈ క్రమంలోనే నాటి అధికారి.. ధనుంజయ్‌రెడ్డి, అప్పటి జగన్ ఓఎస్డీ గా పనిచేసిన కృష్ణమోహన్‌రెడ్డి, అదేవిధంగా బాలాజీ గోవిందప్పలపై కేసులు నమోదు చేసింది. అయితే.. ఈ కేసులో వారి పేర్లు నమోదైన వెంటనే వారు తప్పించుకుని పారిపోయారు. అప్పటి నుంచి వెతుకులాట ప్రారంభమైంది. అయితే.. తమకు ముందస్తు బెయిల్ కావాలని.. ముగ్గురు నిందితులు.. హైకోర్టు, సుప్రీంకోర్టులను కూడా ఆశ్రయించి నా.. ఫలితం దక్కలేదు.ఈ క్రమంలో ఈ నెల 11న విచారణకు హాజరుకావాలని సిట్ అధికారులు ఈ ముగ్గురి ఇళ్లకు వెళ్లి నోటీసులు అందించారు. అయితే.. వారు విచారణకు గైర్హాజరయ్యారు. అయినప్పటికి సిట్ అధికారులు వదిలి పెట్ట కుండా హైదరాబాద్, చెన్నై, బెంగళూరుల్లో వెతకడం ప్రారంభించారు. ఈ క్రమంలోనే బాలాజీ గోవిందప్ప మైసూరులో ఉన్నట్టు గుర్తించి.. అక్కడకు వెళ్లి అదుపులోకి తీసుకున్నారు. మద్యం ద్వారా అందిన ముడుపులను... తన ఆడిటింగ్ నైపుణ్యంతో గోవిందప్ప దేశాలు దాటించారని పోలీసులు భావిస్తున్నారు.

## సైన్యం కోసం షష్ట షణ్ముఖ క్షేత్రాల్లో జనసేన పూజలు



**తమిళనాడు:**భారత్-పాకిస్థాన్ దేశాల మధ్య తలెత్తిన ఉద్రిక్తతలు.. యుద్ధ వాతావరణం నేపథ్యంలో జనసేన అధినేత పవన్ కల్యాణ్ కీలక నిర్ణయం తీసుకున్న విషయం తెలిసిందే. భారత సైన్యానికి నైతిక బలం ఉండేలా.. దైవాన్ని ప్రార్థించాలని ఆయన నిర్ణయించారు. ఈ క్రమంలో ధైర్యానికి, విజయానికి ప్రతీక అయిన కుమార స్వామి ఆలయాల్లో ప్రత్యేక పూజలు నిర్వహించాలని.. సైన్యానికి భౌతిక శక్తితోపాటు.. ఆధ్యాత్మిక శక్తి కూడా ఒనగూరేలా చూడాలని పార్టీ నాయకులను ఆదేశించారు.ఈ క్రమంలో కుమారస్వామికి ప్రీతిపాత్రమైన మంగళవారం నాడు.. రాష్ట్రమే కాకుండా.. ఇతర రాష్ట్రాల్లోని ప్రముఖ కుమారస్వామి ఆలయాల్లో జనసేన నాయకులు, ఎమ్మెల్యేలు, కార్యకర్తలు ప్రత్యేక పూజలు నిర్వహించారు. భారత సైన్యానికి మరింత బలమైన శక్తి ప్రసాదించాలని కోరుకున్నట్టు తెలిపారు. ఏపీలో మోపిదేవితోపాటు.. తమిళనాడులోని తిరుత్తణి, కర్ణాటక, కేరళలలోని కుమా రస్వామి ఆలయాల్లో ఈ ప్రత్యేక పూజలు నిర్వహించారు.విజయవాడలోని కనకదుర్గ ఆల యంలో ఉన్న కుమారస్వామి ఆలయంలో మంత్రి, జనసేన పీఏసీ చైర్మన్ నాదెండ్ల మనోహర్ ప్రత్యేక పూజలు నిర్వహించారు. 'ఆపరేషన్ సిందూర్' తో పాకిస్థాన్‌కు గట్టి గుణపాఠం చెప్పిన మన దేశ సైన్యానికి, నాయకత్వానికి దైవబలం మెండుగా ఉండాలని కోరుకున్నట్టు మంత్రి నాదెండ్ల ఈ సందర్భంగా తెలిపారు.మరోవైపు.. కర్ణాటకలోని ఘాటీ సుబ్రహ్మణ్య క్షేత్రంలో రాజానగరం ఎమ్మెల్యే బత్తుల బలరామకృష్ణ ఆధ్వ ర్యంలో పూజలు చేశారు.

## బాయ్ కాట్ టర్కీ చావుదెబ్బ కొడతున్న భారతీయులు



**న్యూఢిల్లీ :**భారత్, పాకిస్తాన్‌ల మధ్య నెలకొన్న తాజా ఉద్రిక్త పరిస్థితుల నేపథ్యంలో, పాకిస్తాన్‌కు మద్దతుగా నిలిచిన టర్కీ, అజర్‌బైజాన్‌లకు భారత్ గట్టి షాక్ ఇచ్చింది. ఈ రెండు దేశాలకు ట్రావెల్ బుకింగ్ సేవలు అందించే పలు ప్రముఖ ఆన్‌లైన్ ప్లాట్‌ఫామ్‌లు కొత్త బుకింగ్‌లను నిలిపివేస్తున్నట్లు ప్రకటించాయి. ఇది ఆ రెండు దేశాలకు ఆర్థికంగా గణనీయమైన ఎదురుదెబ్బగా మారనుంది.టర్కీ ప్రస్తుతం ఆర్థికంగా ఇబ్బందులు పడుతోంది. ఈ క్రమంలోనే తమ దేశానికి వచ్చి పర్యాటకాన్ని ఎంజాయ్ చేయాలంటూ భారతీయులను వేడుకుంటోంది. అక్కడ ఎలాంటి భయాందోళన పరిస్థితులు లేవని.. స్వేచ్ఛగా తిరగొచ్చంటూ ఆహ్వానిస్తోంది. అయితే ఇదంతా పాకిస్తాన్ కు సపోర్టు చేయకముందు ఉండాల్సిందని.. భారతీయులు అక్కడికి వచ్చేది లేదంటూ నెటిజన్లు ఫైర్ అవుతున్నారుతాజాగా జరిగిన పహల్గామ్ ఉగ్రదాడిని ప్రపంచ దేశాలు ముక్తకంఠంతో ఖండించాయి. ఈ దాడికి ప్రతీకారంగా భారత్ చేపట్టిన 'ఆపరేషన్ సిందూర్'కు కూడా చాలా దేశాలు మద్దతు తెలిపాయి. పాకిస్తాన్ గడ్డపై ఉన్న ఉగ్రవాద శిబిరాలను లక్ష్యంగా చేసుకుని భారత్ చేపట్టిన ఈ చర్యలను పలు దేశాలు ప్రశంసించాయి. అయితే, టర్కీ, అజర్‌బైజాన్ మాత్రం ఈ విషయంలో పాకిస్తాన్‌కు బాసటగా నిలిచాయి. భారత్ చర్యలను ఖండించాయి. ఈ రెండు దేశాల వైఖరి అంతర్జాతీయంగా తీవ్ర చర్చనీయాంశంగా మారింది.ఈ నేపథ్యంలోనే, అంతర్జాతీయ ట్రావెల్ బుకింగ్ సేవలు అందించే పలు భారతీయ ఆన్‌లైన్ ప్లాట్‌ఫామ్‌లు కీలక నిర్ణయం తీసుకున్నాయి. పాకిస్తాన్‌కు మద్దతుగా వ్యవహరిస్తున్న టర్కీ, అజర్‌బైజాన్‌లకు ఇప్పటి నుంచి కొత్త బుకింగ్‌లను నిలిపివేస్తున్నట్లు ప్రకటించాయి. అంతేకాకుండా, ఈ రెండు దేశాలకు అనవసర ప్రయాణాలను రద్దు చేసుకోవాలని భారతీయ పర్యాటకులకు సూచించాయి. ఒకవేళ తప్పనిసరి పరిస్థితుల్లో వెళ్లాల్సి వస్తే, అక్కడి సున్నితమైన ప్రాంతాల్లో అప్రమత్తంగా ఉండాలని హెచ్చరించాయి.ప్రముఖ టూరిస్ట్ సర్వీసెస్ సంస్థ 'కాక్స్ అండ్ కింగ్స్' టర్కీ, అజర్‌బైజాన్, ఉజ్బెకిస్తాన్‌లకు కొత్త బుకింగ్‌లను తాత్కాలికంగా నిలిపివేస్తున్నట్లు ప్రకటించింది. అనవసర ప్రయాణాలను ప్రస్తుతం విరమించుకోవాలని సంస్థ డైరెక్టర్ కరణ్ అగర్వాల్ సూచించారు.మరో ఆన్‌లైన్ ట్రావెల్ ఏజెన్సీ ఈజ్ మై ట్రిప్ కూడా ఇదే విధమైన సూచనలు చేసింది. పహల్గామ్ దాడి తదనంతర పరిణామాల నేపథ్యంలో ప్రయాణికులు అప్రమత్తంగా ఉండాలని, అత్యవసర పరిస్థితులుంటే తప్ప టర్కీ, అజర్‌బైజాన్‌లను సందర్శించవద్దని కోరింది. ప్రయాణ ప్రణాళికలు చేసుకునే ముందు తాజా ట్రావెల్ అడ్వైజరీలను పరిగణనలోకి తీసుకోవాలని ఈజ్ మై ట్రిప్ ఫౌండర్ నిషాంత్ ట్వీట్ చేశారు.ట్రావోమింట్ అనే మరో ట్రావెల్ ప్లాట్‌ఫామ్ కూడా టర్కీ, అజర్‌బైజాన్‌లకు సంబంధించిన అన్ని రకాల ప్రయాణ ప్యాకేజీలను రద్దు చేస్తున్నట్లు ప్రకటించింది. ఇప్పటికే చేసుకున్న బుకింగ్‌లు రద్దు చేసుకుంటే ఎలాంటి క్యాన్సలేషన్ ఫీజులు వసూలు చేయబోమని స్పష్టం చేసింది. అయితే, అత్యవసర పరిస్థితుల్లో ఎమర్జెన్సీ ఫ్లైట్ బుకింగ్‌లు అందుబాటులో ఉంటాయని తెలిపింది.మరోవైపు, పాకిస్తాన్‌తో నెలకొన్న ఉద్రిక్తతల నేపథ్యంలో భారత్‌లో కూడా దేశీయ పర్యాటకంపై ప్రభావం పడుతోంది. జమ్మూ కాశ్మీర్, పంజాబ్, రాజస్థాన్ వంటి సరిహద్దు రాష్ట్రాల్లోని హోటల్ బుకింగ్‌లు భారీగా రద్దవుతున్నట్లు హోటల్ ప్రతినిధులు తెలిపారు. భద్రతాపరమైన ఆందోళనలతో పర్యాటకులు ఈ ప్రాంతాలకు వెళ్లేందుకు వెనుకాడుతున్నారని పేర్కొన్నారు.

భారత్, పాకిస్తాన్ మధ్య కొనసాగుతున్న ఉద్రిక్తతలు కేవలం సరిహద్దులకే పరిమితం కాకుండా అంతర్జాతీయ ప్రయాణాలపై కూడా ప్రభావం చూపుతున్నాయని ఈ పరిణామాలు స్పష్టం చేస్తున్నాయి. ఈ క్రమంలో పాకిస్తాన్‌కు మద్దతిచ్చిన దేశాలకు ట్రావెల్ సంస్థలు బుకింగ్‌లు నిలిపివేయడం ఇప్పుడు చర్చనీయాంశంగా మారింది. ఇది టర్కీ మరియు అజర్‌బైజాన్‌ల పర్యాటక రంగానికి కొంత మేర నష్టం కలిగించే అవకాశం ఉంది. అందుకే మా దేశానికి రావాలంటూ టర్కీ భారతీయులను వేడుకుంటున్న వైనం చర్చనీయాంశమైంది.

- ఊపందుకున్న 'బాయ్‌కాట్ తుర్కియే' నినాదం!పాకిస్థాన్‌లోని ఉగ్రవాద స్థావరాలను అంతం చేయడమే లక్ష్యంగా భారత్ చేపట్టిన ఆపరేషన్ సిందూర్ సమయంలో తుర్కియే పాకిస్థాన్‌కు అనుకూలంగా వ్యవహరించడంతో అయ్యాయి.

## సుప్రీంలో మిథున్ రెడ్డి విజయం లిక్కర్ స్కాంలో బిగ్ అప్డేట్



**రాజంపేట:**ఏపీ లిక్కర్ స్కాంలో నిందితుడుగా ఉన్న రాజంపేట వైసీపీ ఎంపీ పెద్దిరెడ్డి మిథున్ రెడ్డికి గొప్ప ఊరట లభించింది. ఇప్పటికే సుప్రీంకోర్టు రక్షణతో అరెస్టు నుంచి రక్షణ పొందిన మిథున్ రెడ్డికి అనుకూలంగా సుప్రీం తీర్పు వెలువరించింది. సర్వోన్నత న్యాయస్థానం తీర్పుతో మరోమారు ఆయన ముందస్తు బెయిల్ కోసం దరఖాస్తు చేసుకోవచ్చు. ముందస్తు బెయిల్ పై హైకోర్టు తీర్పు వెలువరించేవరకు ఆయనను అరెస్టు చేయొద్దంటూ సుప్రీం తీర్పునిచ్చింది. అంతేకాకుండా మిథున్ రెడ్డి బెయిల్ పిటిషన్ విచారించిన కోర్టు కీలక వ్యాఖ్యలు చేసింది.ఏపీ మద్యం స్కాంలో రాజంపేట ఎంపీ మిథున్ రెడ్డిని ఏ2 నిందితుడిగా అభియోగాలు మోపిన విషయం తెలిసిందే. ఈ కేసులో తనను అరెస్టు చేసే అవకాశం ఉందన్న కారణంగా ఎంపీ మిథున్ రెడ్డి గతంలో సుప్రీంకోర్టును ఆశ్రయించారు. హైకోర్టులో ముందస్తు బెయిల్ పిటిషన్ ను కొట్టివేయడంతో ఆయన సుప్రీంను ఆశ్రయించాల్సివచ్చింది. మిథున్ రెడ్డి పిటిషన్ ను పరిగణలోకి తీసుకున్న సర్వోన్నత న్యాయస్థానం తాత్కాలిక ఉపశమనం కల్పించి, విచారణకు సహకరించాల్సిందిగా ఆదేశించింది.దీంతో గతంలో జరిగిన సిట్ విచారణకు మిథున్ రెడ్డి హాజరయ్యారు. పోలీసులు అడిగిన ప్రశ్నలకు సమాధానాలు చెప్పారు. ఇక తాజాగా జరిగిన వాదనల్లోనూ సిట్ ఎప్పుడు పిలిచినా విచారణకు సహకరిస్తానని మిథున్ రెడ్డి కోర్టుకు తెలిపారు. దీంతో మిథున్ రెడ్డి బెయిల్ పిటిషన్ పై విచారణ జరిపిన సుప్రీంకోర్టు గతంలో హైకోర్టు ఇచ్చిన తీర్పును పక్కన పెట్టింది. అరెస్టులు యాంత్రికంగా జరగకూడదని వ్యాఖ్యానించింది. మిథున్ రెడ్డి మరోసారి హైకోర్టులో బెయిల్ పిటిషన్ దాఖలు చేసుకునేందుకు అవకాశం కల్పించింది. హైకోర్టు నిర్ణయం వెలువడే వరకు అరెస్టు చేయొద్దంటూ ఆదేశాలిచ్చింది .అదేవిధంగా మిథున్ రెడ్డి బెయిల్ పిటిషన్ ను నాలుగు వారాల్లో పరిష్కరించాలని సుప్రీం కోర్టు సూచించింది. ఇప్పటివరకు జరిపిన దర్యాప్తు వివరాలను మరోసారి హైకోర్టు పరిశీలించాలని ధర్మాసనం స్పష్టం చేసింది. అరెస్టుకు సరైన కారణాలు చూపించాల్సివుంటుందని వ్యాఖ్యానించిన సుప్రీం ధర్మాసనం కేసు పెట్టిన వెంటనే అరెస్టు చేయాలని అనుకోవడం సరైనది కాదని వ్యాఖ్యానించింది. పార్లమెంటు సభ్యుడి పరువు ప్రతిష్ఠలను సుప్రీం సూచించింది.

## హైదరాబాద్ రప్పించి విద్యార్థినిపై స్నేహితుల అత్యాచారం



**నిజాంపేట:**స్నేహాన్ని నమ్మి వచ్చిన ఓ యువతిపై ఇద్దరు మృగాళ్లు అత్యాచారానికి పాల్పడిన దారుణ సంఘటన నిజాంపేటలో చోటుచేసుకుంది. చెన్నైకి చెందిన 20 ఏళ్ల బయోమెడికల్ ఇంజనీరింగ్ చివరి సంవత్సరం విద్యార్థినిపై ఆమె స్నేహితుడు, అతని మరో మిత్రుడు కలిసి ఈ ఘాతుకానికి ఒడిగట్టారు.వివరాల్లోకి వెళితే... బాధితురాలు చెన్నైలో బయోమెడికల్ ఇంజనీరింగ్ ఫైనల్ ఇయర్ చదువుతోంది. హైదరాబాద్‌లోని ఓ ఫార్మా కంపెనీలో ఇంటర్న్‌షిప్ ఇప్పిస్తానని ఆమె స్నేహితుడైన అజయ్ నమ్మబలకడంతో ఆమె నగరానికి వచ్చింది. నగరానికి వచ్చిన యువతి కూకట్‌పల్లిలోని ఓ మహిళా హాస్టల్‌లో నివాసం ఉంటోంది.కొన్ని రోజుల క్రితం, అజయ్ తన స్నేహితుడైన హరి ఫ్లాట్‌లో పార్టీ ఉందని బాధితురాలిని ఆహ్వానించాడు. స్నేహితుడి పిలుపు కావడంతో నమ్మిన యువతి, నిజాంపేటలోని రాజీవ్ గృహకల్పలో ఉన్న హరి ఫ్లాట్‌కు వెళ్లింది. అక్కడికి వెళ్లిన తర్వాత, అజయ్, హరి కలిసి యువతిని బలవంతంగా మద్యం తాగించారు. ఆమె మత్తులోకి జారుకున్న తర్వాత, అజయ్ , హరి ఇద్దరూ కలిసి ఆమెపై అత్యాచారానికి పాల్పడ్డారు.

- పోలీసులకు ఫిర్యాదు, దర్యాప్తు ప్రారంభంఈ దారుణమైన బాధాకరమైన సంఘటన జరిగిన తర్వాత తేరుకున్న బాధితురాలు ధైర్యం కూడగట్టుకుని బచుపల్లి పోలీసులకు ఫిర్యాదు చేసింది. యువతి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకున్న పోలీసులు దర్యాప్తు ముమ్మరం చేశారు. నిందితులైన అజయ్, హరి కోసం గాలిస్తున్నారు.


- సమాజంలో ఆందోళన స్నేహం ముసుగులో ఇలాంటి లైంగిక వేధింపులకు పాల్పడటం, నమ్మిన స్నేహితులే కాలయముళ్లుగా మారడం తీవ్ర ఆందోళన కలిగిస్తోంది. అత్యంత రద్దీగా ఉండే నిజాంపేట వంటి జనసమ్మర్ధ ప్రాంతంలో ఇలాంటి దారుణం జరగడం స్థానికులను దిగ్భ్రాంతికి గురిచేసింది. అత్యాచార నిందితులపై కఠిన చర్యలు తీసుకోవాలని, ఇలాంటి ఘటనలు పునరావృతం కాకుండా చూడాలని ప్రజలు డిమాండ్ చేస్తున్నారు. అమాయక యువతుల జీవితాలతో ఆడుకుంటున్న ఇలాంటి మృగాళ్లను కఠినంగా శిక్షించాలని సామాజిక కార్యకర్తలు కోరుతున్నారు.

## అమెరికాపై భారత్ భారీ టారిఫ్ లు ముదిరిన వాణిజ్య యుద్ధం



**అమెరికా:**భారతదేశం కొన్ని అమెరికన్ ఉత్పత్తులపై ప్రతీకార సుంకాలను విధించనున్నట్లు ప్రపంచ వాణిజ్య సంస్థకు తెలియజేసింది. భారతీయ ఉక్కు , అల్యూమినియంపై అమెరికా విధించిన సుంకాలకు ప్రతిస్పందనగా ఈ నిర్ణయం తీసుకున్నట్లు స్పష్టమవుతోంది. ఈ చర్య ఇరు దేశాల మధ్య వాణిజ్య ఉద్రిక్తతలు పెరుగుతున్నాయనడానికి సంకేతంగా నిపుణులు భావిస్తున్నారు.కొన్ని ప్రత్యేకమైన అమెరికా వస్తువులపై ఇప్పటివరకు ఇస్తున్న రాయితీలను నిలిపివేసి, వాటిపై దిగుమతి సుంకాలను పెంచనున్నట్లు భారత్ తన ప్రకటనలో పేర్కొంది. అమెరికా విధించిన టారిఫ్‌ల కారణంగా సుమారు 7.6 బిలియన్ డాలర్ల విలువైన భారతీయ ఎగుమతులపై ప్రతికూల ప్రభావం పడుతుందని అంచనా. అమెరికా అనుసరిస్తున్న రక్షణాత్మక వాణిజ్య వైఖరిని భారత్ తీవ్రంగా తప్పుబ ట్టింది.గతంలో డొనాల్డ్ ట్రంప్ రెండోసారి అధికారంలోకి వచ్చిన తర్వాత, ప్రపంచవ్యాప్తంగా పలు దేశాలపై అమెరికా భారీగా టారిఫ్‌లు విధించిన విషయం తెలిసిందే. ముడి ఉక్కు ఉత్పత్తిలో ప్రపంచంలోనే రెండో స్థానంలో ఉన్న భారత్‌పై ఈ టారిఫ్‌ల ప్రభావం అధికంగా పడనుంది. ఈ నేపథ్యంలో, భారత్ ఈ అంశాన్ని ప్రపంచ వాణిజ్య సంస్థ దృష్టికి బలంగా తీసుకెళ్లింది.ఆసక్తికరంగా న్యూఢిల్లీ -వాషింగ్టన్ ఒక సరికొత్త వాణిజ్య ఒప్పందానికి చాలా దగ్గరగా ఉన్నాయని వార్తలు వస్తున్న తరుణంలో ఈ పరిణామాలు చోటుచేసుకోవడం గమనార్హం. అమెరికాతో వాణిజ్య లోటును తగ్గించేందుకు ఈ ఒప్పందంలో భాగంగా భారత్ అనేక రాయితీలను ప్రతిపాదించినట్లు కూడా ప్రచారం జరిగింది. అయితే, తాజా పరిణామాలు ఈ ఒప్పందం భవిష్యత్తుపై నీలినీడలు కమ్ముకునేలా చేస్తున్నాయి. భారత్ తీసుకున్న ఈ నిర్ణయం అమెరికాతో వాణిజ్య సంబం ధాలలో ఒక కీలక మలుపుగా చెప్పవచ్చు. ఒకవైపు వాణిజ్య ఒప్పందం కోసం చర్చలు జరుగుతున్నాయంటూనే, మరోవైపు ప్రతీకార సుంకాలకు సిద్ధపడటం ఇరు దేశాల మధ్య నెలకొన్న సంక్లిష్ట వాణిజ్య వాతావరణాన్ని సూచిస్తోంది.

## మీడియాను ఎదుర్కొనే దమ్ముందా నానికి చిన్ని సవాల్



**విజయవాడ:**విజయవాడ ఎంపీ, మాజీ ఎంపీ మధ్య మాటల యుద్ధం కొనసాగుతోంది. సొంత అన్నదమ్ములైన ఇద్దరు నేతలు కొన్ని రోజులుగా సోషల్ మీడియా వేదికగా పరస్పరం ఆరోపణలు చేసుకుంటున్న విషయం తెలిసిందే. సిట్టింగ్ ఎంపీ చిన్నిపై మాజీ ఎంపీ కేశినేని నాని పలు అవినీతి ఆరోపణలు చేస్తున్నారు. ఫేస్ బుక్స్, ఎక్స్ ద్వారా వివిధ పత్రాలను చూపుతూ ఎంపీ కేశినేని చిన్నిని టార్గెట్ చేస్తున్నారు. ఆయన ఆరోపణలపై సోషల్ మీడియా వేదికగానే సమాధానాలు చెబుతున్న ఎంపీ చిన్ని, ఈ రోజు మీడియాతోనూ మాట్లాడారు. తనపై విమర్శలు చేస్తున్న మాజీ ఎంపీ నాని తనలా దమ్ముంటే మీడియా ప్రశ్నలకు సమాధానం చెప్పాలని సవాల్ విసిరారు. బెజవాడ బ్రదర్స్ ఎంపీ కేశినేని శివనాథ్ అలియాస్ చిన్ని, మాజీ ఎంపీ కేశినేని శ్రీనివాస్ అలియాస్ నాని మధ్య వార్ కంటిన్యూ అవుతోంది. రాజకీయంగా ఒకరినొకరు తీవ్రంగా విభేదించుకుంటున్న ఇద్దరు సవాళ్లు, ప్రతిసవాళ్లతో తీవ్ర దుమారం రేపుతున్నారు. తన సోదరుడు, మాజీ ఎంపీ కేశినేని నాని చేస్తున్న ఆరోపణలు తాను ఎలాంటి విచారణకైనా సిద్ధంగా ఉన్నానని ఎంపీ చిన్ని స్పష్టం చేశారు. తనలా మీడియాను ఎదుర్కొనే ధైర్యం లేక మాజీ ఎంపీ ఇంట్లో కూర్చొని సోషల్ మీడియాలో బురద జల్లుతున్నారని ధ్వజమెత్తారు.

ఎన్టీఆర్ జిల్లా చందర్లపాడులోని మంగళవారం మీడియాతో మాట్లాడిన ఎంపీ చిన్ని, మాజీ ఎంపీకి విమర్శలకు గట్టి కౌంటర్ ఇచ్చారు. మాజీ ముఖ్యమంత్రి జగన్ అనుచరులు ధైర్యం లేక ఇంట్లో కూర్చొని తనపై బురద జల్లుతున్నారని ఆగ్రహం వ్యక్తం చేశారు. ఎన్నికల్లో ఓడిన తర్వాత విజయవాడ మాజీ ఎంపీ కేశినేని నాని ఒక్కసారైనా మీడియా ముందుకు వచ్చారా? అంటూ ప్రశ్నించారు.మాజీ ఎంపీ నానిలో పారదర్శకత, జవాబుదారీతనం లేదని, అక్రమంగా సంపాదించిన డబ్బుకు లొంగిపోయే వ్యక్తుల జాతికి చెందినవాడంటూ నిప్పులు చెరిగారు. తన విమర్శలపై వారు స్పందించాల్సిన అవసరం లేదని, వారు వివరణ ఇచ్చేందుకు కూడా అర్హత లేనివారుగా తాను భావిస్తున్నట్లు చెప్పారు. కాగా, మాజీ ఎంపీ నానిపై టీడీపీ నేత నాగుల్ మీరా కూడా తీవ్ర స్థాయిలో ధ్వజమెత్తారు. ఆర్థిక వ్యవహారాల్లో మోసాలకు పాల్పడిన నాని ఏం సమాధానం చెబుతారని ప్రశ్నించారు.కేశినేని హోటల్స్ ప్రైవేటు లిమిటెడ్ పేరుతో రుణ మోసాలకు పాల్పడ్డారని ఆరోపించారు. బ్యాంకు రుణాలు ఎగ్గొట్టారని, కంపెనీ వనరులను దుర్వినియోగం చేశారని తీవ్రస్థాయిలో ధ్వజమెత్తారు. మాజీ ఎంపీ నాని త్వరలో జైలుకు వెళతాడని, తన బాస్, మాజీ ముఖ్యమంత్రి జగన్ ను కూడా అదే జైలుకు పంపునున్నారని వ్యాఖ్యానించారు.కాగా, మాజీ ఎంపీ కేశినేని నానికి పలు అవినీతి వ్యవహారాలతో సంబంధం ఉందని విమర్శలు గుప్పించారు. బ్యాంకు నుంచి రుణాలు తీసుకుని షెల్ కంపెనీలకు తరలించారని ఆరోపించారు.

# 20 న దేశవ్యాప్త సమ్మెను విజయవంతం చేయాలని సిఐటియు పిలుపు

**వివిధ డిమాండ్ల తో ఐసిడిఎస్ సిడిపిఓ కే. నరసమ్మకు వినతి పత్రం ఇవ్వడం జరిగింది**



**మంత్రాలయం:**20 నా జరిగే దేశవ్యాప్త సమ్మెను విజయవంతం చేయాలని సిఐటియు మంత్రాలయం మండల కార్యదర్శి టి భీమేశ్వరి సిఐటియు నాయకులు హెచ్ జయరాజు వారు పిలుపునిచ్చారు ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ కేంద్రంలో రాష్ట్రంలో రాజకీయ పార్టీలు మారుతున్న కూడా కార్మికుల కష్టజీవుల బ్రతుకుల మాత్రం మారడం లేదని వారు ఆవేదన వ్యక్తం చేశారు కార్మికులకు నష్టం చేసే నాలుగు లేబర్ కోడ్లను రద్దు చేయాలని అట్లాగే కనీస వేతనం 26000 ఇవ్వాలని ప్రభుత్వ రంగ సమస్తలను ప్రైవేటీకరణ ఆపాలని ఓల్డ్ పెన్షన్ విధానం అమలు చేయాలని ఉద్యోగ భద్రత కల్పించాలని ఈ నెల 20వ తేదీ జరిగే దేశవ్యాప్త సమ్మెను అసంఘటిత కార్మికులు కర్షకులు రైతులు వ్యవసాయ కూలీలు అందరు కలిసి జయప్రదం చేయాలని వారు పిలుపునిచ్చారు అనంతరం వివిధ డిమాండ్లతో కూడిన వినతి పత్రాన్ని ఐసిడిఎస్ సిడిపిఓ కే నరసమ్మ మేడమ్ కి ఇవ్వడం జరిగింది ఈ కార్యక్రమంలో పాల్గొన్నవారు అంగన్వాడీ టీచర్లు కళ్యాణి శ్వేత ప్రమీల ఆశ వర్కర్లు శారద లక్ష్మి బిల్డింగ్ కార్మికులు దానేలు తిక్కయ్య రామారావు తదితరులు పాల్గొన్నారు

# విశాఖపట్నంలో జిల్లా పరిషత్ రెండోవ స్థాయి సంఘాల సమావేశం...



**అనంతగిరి:**విశాఖపట్నం జిల్లా పరిషత్ 2వ స్థాయి సంఘాల సమావేశం జల్లిపల్లి సుభద్ర అధ్యక్షతన జరిగిన సమావేశంలో సమస్యలపై చర్చించిన అనంతగిరి జడ్పిటిసి దీసరి గంగరాజు ఈ సందర్భంగా జడ్పీటీసీ దీసరి గంగరాజు మాట్లాడుతూ డి.ఆర్.డి.ఎ పి.డి,జిల్లా అధికారులతో చర్చిస్తూ
కొత్తగా మంజూరు చేసే వృద్ధాప్య పింఛన్లు సచివాలయం కేంద్రాల్లో దరఖాస్తులు స్వీకరించాలని నిరుద్యోగ యువతకు బేంక్ లనుండి లోన్లు మంజూరు చేయాలని,వెటర్నరీ డిపార్ట్మెంట్ నేషనల్ లైవ్ స్టాక్ మిషన్ ద్వారా సెంట్రల్ గవర్నమెంట్ అండర్ టేకింగ్ లో కోట్లాది రూపాయలు మంజూరై ఉపయోగపడకుండా మురిగి పోతున్నాయి.వందలాది గిరిజన యువత నిరుద్యోగులు గా ఉన్నారు.బేంకర్స్ విల్లింగ్ కాకపోవడం నిరుద్యోగ యువత లోన్లు పొందలేకపోతున్నారు.ఇప్పటికైనా సంబంధిత జిల్లా అధికారులు అల్లూరి సీతారామరాజు జిల్లా కలెక్టర్ దృష్టికి తీసుకు వెళ్లి లోన్లు మంజూరు అయ్యేలా చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు.మహాత్మా గాంధీ జాతీయ గ్రామీణ ఉపాధి హామీ పథకం అల్లూరి సీతారామరాజు జిల్లా 11 మండలాల్లో గిరిజన ప్రాంతాల్లో పొలాలు,గురువులు పనులు చేయడమే కాకుండా కాఫీ తోటల్లో బెంచి కట్టింగ్,టెరాసింగ్ పనులు చేయుట,అలాగే మరికొన్ని ప్రాంతాల్లో జీడి మామిడి తోటల పెంపకం కోసం పనులు చేయుటకు ప్రత్యేక అనుమతులు మంజూరు చేయాలని సభ దృష్టికి తీసుకు వెళ్ళడం జరిగింది.కేటిల్ షెడ్స్ నిర్మించిన లబ్దిదారులకు బిల్లులు చెల్లించాలని షోక్ ఫిట్స్ అని గ్రామాలకు నిర్మించాలని ఎపిడెమిక్ సీజన్ ప్రారంభం కావడంతో దోమల కాటుతో మలేరియా,టైఫాయిడ్,డెంగూ లాంటి జబ్బులు వెంటాడుతూన్నాయి.గ్రామాల్లో ఫాగింగ్ చేయాలని అనేక సమస్యలపై చర్చించారు.

# లింగ నిర్ధారణ పరీక్షలు చేసినా,ప్రోత్సహించినా చట్టప్రకారం చర్యలు తప్పవని హెచ్చరిచేరు



**ఏలూరు:-**లింగ నిర్ధారణ పరీక్షలు చేసినా, ప్రోత్సహిం చినా చట్టప్రకారం చర్యలు తప్పవని రెవిన్యూ డివిజనల్ అధికారి యం.అచ్యుత అంబరీష్ అన్నారు రెవిన్యూ డివిజనల్ అధికారి ఛాంబర్లో పిసిపియన్ డిటి యాక్టు 1994 (గర్భస్థ లింగ నిర్ధారణ నిషేధ చట్టం ) పై సంబంధిత అధికారులతో ఆర్డీవో యం.అచ్యుత అంబరీష్ సమావేశం నిర్వహించారు.ఈ సందర్భంగా ఆర్డీవో మాట్లాడుతూ సమాజంలో స్త్రీ,పురుషులు ఇరువురు సమానమేనని దేనిలోనూ తక్కువ కాదన్నారు.పుట్ట బోయేది ఆడ శిశువు అని తెలియగానే కొన్ని సందర్భాల్లో గర్భస్రావానికి సిద్ధ పడుతున్నారని ఇది చాలా విచారకరమని అన్నారు.ఇటువంటి సంఘటనలు పునరావతం కాకుండా కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు లింగ ఎంపిక నిషేధ చట్టం తీసుకు వచ్చి కట్టుదిట్టమైన చర్యలు తీసుకోవడం జరుగుతుందని తెలిపారు. జిల్లాలో ప్రభుత్వ, ప్రవేటు 115 స్కానింగు సెంటర్లలో ఏప్పట కప్పుడు అధికారులు క్రమం తప్పకుండా తనిఖీలు నిర్వహించి పూర్తిస్థాయిలో నివేదికలను అందించాలని అన్నారు.అలాగే రిజిస్టర్లు, కంప్యూటరు డేటాను కూడా పరిశీలన చేయాలన్నారు. ఎక్కడైనా లింగనిర్ధారణ పరీక్షలు జరుగుతు న్నాయని సమాచా రం అందించిన వారి పేర్లను గోప్యంగా ఉంచాలని తెలిపారు. అటువంటి స్కానింగు సెంటర్ల పై అధికారు ల బృందంతో వెళ్ళి విచారణ చేసి,రుజువైతే ఆయా స్కానింగు సెంటర్లను సీజ్ చేసి, భారీ జరిమానా విధించాలని ఆర్డీవో యం.అచ్యుత అంబరీష్ అన్నారు.ఈ సమావేశంలో డా.యం. నాగేశ్వర రావు,డెమో ఇంచార్చి డా.కె.ప్రదీప్తి, కమిటీ సభ్యులు నాగారత్నం, న్యాయ వాది వడ్డి సత్యారవి, హెల్త్ ఎడ్యుకేటరు యన్. విజయకుమార్, జిల్లా వైద్య ఆరోగ్య శాఖ సిబ్బంది, తదితరులు పాల్గొన్నారు.

# రేషన్ కార్డులు దరఖాస్తు స్వీకరణ



**పశ్చిమగోదావరి జిల్లా బ్యూరో:** అర్హులైన లబ్ధిదారుల నుంచి కొత్త రేషన్ కార్డుల కోసం దరఖాస్తుల స్వీకరణతో పాటు చేర్పులు మార్పులు చేసుకునే అవకాశాన్ని రాష్ట్ర ప్రభుత్వం కల్పించిందని తాడేపల్లిగూడెం తహసిల్దార్ ఎం సునీల్ కుమార్ తెలిపారు. గ్రామ ,పట్టణ పరిధిలోని రెవెన్యూ అధికారులతో మంగళవారం సమీక్ష సమావేశం నిర్వహించారు. అవసరమైన ధ్రువపత్రాలను అందించిన వారికి 21 రోజుల్లో చేసుకున్న దరఖాస్తులు ధ్రువీకరించబడతాయన్నారు ఎవరికి ఎటువంటి సమస్యలు లేకుండా అన్ని సచివాల యాలలోను డిజిటల్ అసిస్టెంట్లు ఈ కార్యక్రమానికి సహకరిస్తారని చెప్పారు. ప్రస్తుతానికి చేర్పులు మార్పులు మాత్రమే అమల్లోకి వచ్చాయని అన్నారు. రేషన్ కార్డులో పేర్లు తొలగించడానికి తప్పనిసరిగా మరణ ధ్రువీకరణ పత్రం సమర్పించాల్సి ఉంటుంది అన్నారు . కొత్త కార్డులను పొందెందుకు, చేర్పులకు మార్పులకు కూడా కుటుంబ సభ్యుల హౌస్ హెూల్డ్ మ్యాపింగ్ తో పాటు, ఈ కేవైసీ చేయించుకోవలసి ఉంటుందని ఈనెల 15 తర్వాత వాట్సప్ గవర్నర్స్ కూడా అందుబాటులోకి వస్తుందని తెలియజేశారు. రెవిన్యూ అధికారులు సంబంధిత సచివాలయాల్లో అందుబాటులో ఉండటంతో పాటు పూర్తి సమాచారం ఇవ్వాల్సి ఉంటుందన్నారు దీనికోసం సచివాలయాల వద్ద డిస్ప్లే ఏర్పాటు చేయనున్నట్లు ఆయన వెల్లడించారు..

# రైతు కుటుంబాల పరువు బజారు పాలు చేస్తున్న - జీలుగుమిల్లి సొసైటీ





**సొసైటీ కార్యదర్శి ఒంటెద్దు పోకడతో ఆసుపత్రి పాలవుతున్న రైతు కుటుంబ సభ్యులు. మరణించిన వారిని సైతం అప్పు కట్టాలంటూ రైతు కుటుంబ సభ్యులను వేధిస్తున్న వైనం.**

**జీలుగుమిల్లి :** సన్న చిన్న కారు రైతులకు సొసైటీలు శాపంగా మారాయి. రైతులకు రుణాలు మంజూరు చేసి తర్వాత సొసైటీ సిబ్బంది వేధిస్తున్నారు. రైతులకు ఎటువంటి నోటీసులు ఇవ్వకుండా బహిరంగ వేలం పాట నిర్వహించడం ఏమిటని రైతులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. జీలుగుమిల్లి సొసైటీలో 169 మంది రైతులు బకాయిలు చెల్లించాల్సి ఉంది. అయితే సొసైటీ అధికారులు కుట్రపూరితంగా ఒక రైతు కుటుంబానికి చెందినవి మాత్రమే కరపత్రం వేయించి గ్రామాలలో పంచటం విడ్డూరంగా ఉందని రైతులు ప్రశ్నిస్తున్నారు .అన్ని పార్టీలకు చెందిన రైతులు ఉండగా ఒక రైతుకు చెందిన మాత్రమే గ్రామాలలో ప్రచారం చేయడం తగదని అన్నారు. సొసైటీ అధికారులు బకాయిలు కట్టని రైతులను మానసికంగా వేధిస్తున్నారని ఆరోపిస్తున్నారు. రైతులకు నోటీసులు ఇవ్వకుండా బహిరంగ వేలం వేయడం అధికారులు కుట్రపూరితంగా వ్యవహరిస్తున్నారు .ఒక రైతు కుటుంబం అల్లరి చేసి వారి ప్రతిష్టలను భంగం కలిగిస్తుండటం సొసైటీ అధికారులు పన్నాగం. సొసైటీలు రైతుల అభివృద్ధికి సహకరించక పొగ వారిని మానసికంగా వేధించటం వారి డ్యూటీ అయింది .అధికారులు శాఖ పరంగా చర్యలు తీసుకోకుండా వారు ఇష్టం వచ్చినట్లు కరపత్రాలు వేయించి అవమానపరచడం ఏమిటని రైతులు ప్రశ్నిస్తున్నారు. సొసైటీ అధికారులు ఏకపక్షంగా కొంతమంది రైతులను వేధించటం సరికాదని దీనిపై ఉన్నతాధికారులు స్పందించాలని బకాయిలు రైతులు వేడుకుంటున్నారు. బకాయిలు ఉంటే రైతులను పిలిచి వన్ టైం సెటిల్మెంట్ ద్వారా పరిష్కరించాల్సింది పోయి రైతులను వేధించటం సరికాదని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. రైతులను ఇబ్బంది పెడుతున్న సొసైటీ అధికారులపై చర్యలు తీసుకోవాలని రైతులు కోరుతున్నారు.సొసైటీ అధికారులు రైతుల ను వేదించడంతో అక్కడనుండి వేరే బ్యాంకులకు వలస వెళ్లి పోతున్నారు. సొసైటీ అధికారులు ఇస్తారాజ్యంగా వ్యవహరించడంతో రైతులు మనోవేదనకు గురి అవుతున్నారు .సొసైటీ అధికారులు ఇకనైనా రైతులను పిలిపించి బకాయిలు కట్టాలని లేనిపక్షంలో వన్ టైం సెటిల్మెంట్ ద్వారా పరిష్కరించి రైతులను ప్రోత్సహించాలని కోరారు. సొసైటీ అధికారులు ప్రభుత్వానికి సహకరించకుండా నిర్లక్ష్యంగా వ్యవహరిస్తున్నారు. రైతులను ఇబ్బంది పెడుతున్న సొసైటీ అధికారుల పై శాఖ పరమైన చర్యలు తీసుకోవాలని ఉన్నతాధికారులను కోరుతున్నారు.

# మైగ్రేన్‌కు ఏడు రోజుల్లోనే శాశ్వత పరిష్కారం.. ఎలాగో తెలుసా..?



మైగ్రేన్‌తో తలలో తీవ్రమైన పోటు ఉంటుంది. వెలుతురును చూస్తే పోటు ఎక్కువ అనిపిస్తుంది. వికారంతో తలలో తిప్పుతుంది. మెదడు మబ్బుగా అనిపిస్తుంది. తలపోటును తగ్గించే మాత్రల తో తాత్కాలిక ఉపశమనం మాత్రమే లభిస్తుంది.కేవలం ఏడు రోజుల్లో మైగ్రేన్ నొప్పి నుంచి శాశ్వత ఉపశమనం లభిస్తుంది. దీనికి పరిష్కారం ఆయుర్వేదం. ఆయుర్వేదంలో మైగ్రేన్‌లను 'అర్ధవభేదక' అంటారు. అర్ధవభేదక అంటే సగం తలనొప్పి అని అర్థం. మైగ్రేన్‌లు తరచుగా శరీరంలోని మూడు ప్రధాన శక్తులైన వాత, పిత్త, కఫాలలో అసమతుల్యతవల్ల సంభవిస్తాయి. మానసిక ఒత్తిడి, సరైన ఆహారం లేకపోవడం, నిద్ర సరిగా లేకపోవడం లాంటివి వాత, పిత్త, కఫాల్లో అసమతుల్యతకు కారణమవుతాయి.మన శరీంలో ఏ దోషం కారణంగా మనకు సమస్య వచ్చిందనేది తెలుసుకుంటే దానికి పరిష్కారాన్ని కనుగొనడం సులభం అవుతుంది.మన రోజు వారీ అలవాట్లు,ఆహార నియమాల్లో కొన్ని మార్పులు చేసుకోవడం, ఆయుర్వేద మూలికలను వినియోగించడం ద్వారా సమస్యకు చెక్ పెట్టవచ్చు. ధనియాల టీతో కేవలం ఏడు రోజుల్లోనే సమస్యకు చక్కని పరిష్కారం లభిస్తుంది.కొత్తిమీర టీ న్యూరోవాస్కులార్ ఇన్‌ఫ్లమేషన్, హార్మోన్ల అసమతుల్యత,పేలవమైన పేగు ఆరోగ్యం మేగ్రేన్‌కు కారణాలని, ఆధునిక సైన్స్ చెబుతున్నాయి. కొత్తిమీర గింజలు మైగ్రేన్ తీవ్రతను, ఫ్రీక్వెన్సీని తగ్గించగల యాంటీ ఇన్‌ఫ్లమేటరీ లక్షణాలను కలిగి ఉంటాయి.'ది మెడికల్ జర్నల్ ఆఫ్ ది ఇస్లామిక్ రిపబ్లిక్ ఆఫ్ ఇరాన్' లో ప్రచురితమైన ఒక అధ్యయనం ప్రకారం.. ధనియాలు మైగ్రేన్ సమస్యను తగ్గించడంలో, మైగ్రేన్ వేధించే సమయాన్ని తగ్గించడంలో, మైగ్రేన్ తిరగబట్టే ఫ్రీక్వెన్సీని తగ్గించడంలో స్వల్పకాల ప్రభావం చూపుతుంది. మైగ్రేన్ సమస్యకు ధనియాలు సరైన, సమర్థవంతమైన పరిష్కారము. దీనివల్ల సాధారణ కెమికల్ డ్రగ్స్‌వల్ల కలిగే దుష్ప్రభావాల లాంటివి దరిచేరవు.టీ తయారీ ఇలా..ఒక గ్లాసు నీటిలో ఒక టీ స్పూన్ ధనియా గింజలను మరిగిస్తే దనియాల టీ రెడీ. ఈ ధనియాల టీని క్రమం తప్పకుండా ఏడు రోజులపాటు ప్రతిరోజూ తీసుకోవాలి. దాంతో మైగ్రేన్ నుంచి శాశ్వత ఉపశమనం లభిస్తుంది. ఆయుర్వేదం సమగ్ర జీవనశైలి మార్పును ప్రోత్సహిస్తుంది. త్వరిత పరిష్కారాలను చూపే ఔషధాల కంటే మెరుగైన ఫలితాలను ఇస్తుంది.బోనస్ చిట్కా మైగ్రేన్ నొప్పి నుంచి తక్షణ ఉపశమనానికి ఒక బోనస్ చిట్కాను కూడా శ్వేతా షా సూచించారు. న్యూరో ప్రొటెక్టివ్ లక్షణాలు కలిగిన దాల్చిన చెక్కను, యాంటీ ఇన్‌ఫ్లమేటరీ లక్షణాలు కలిగిన తేనెను కలిపి మృదువైన పేస్ట్‌ను తయారు చేసుకోలి. ఆ పేస్టును నుదిటిపై రాసుకుని 15-20 నిమిషాలు ఉండనివ్వాలి. ఆ తర్వాత కడిగేసుకోవాలి. ఈ చిట్కాతో తక్షణమే నొప్పి నుంచి ఉపశమనం కలుగుతుంది.

# వారంలో 7 రోజులు.. ఏ రోజు ఏ దేవుడిని పూజించడం మంచిదో తెలుసా..

హిందూ మతంలో వారంలోని ప్రతి రోజు ఒక నిర్దిష్ట దేవతకు, నవ గ్రహాల్లోని ఒకొక్క గ్రహానికి అంకితం చేయబడింది. ఆదివారం నుంచి శనివారం వరకు ఈ దేవతలను పూజించడం వల్ల జీవితంలో శాంతి, ఆనందం, శ్రేయస్సు లభిస్తాయని నమ్ముతారు.ఈ రోజు ఒకొక్క రోజు ఒకొక్క దేవుడిని తగినవిధంగా పూజించాలని నియమాలను పద్దతులను కూడా పురాణాలు పేర్కొన్నాయి జీవితంలో దేవుడి ఆరాధనకు చాలా ముఖ్యమైన స్థానం ఉంది. దేవుని గురించి ప్రతి ఒక్కరికీ వేర్వేరు ఆలోచనలు ఉంటాయి. దేవుడిని పూజించడం వ్యక్తి నుంచి వ్యక్తికి ఒకొక్క విధంగా ఉంటుంది.కొందరికి దేవుడిని ఆరాధించడం చిన్న విషయంగా అనిపించవచ్చు. మరికొందరికి పూజ చేయడం చాలా గొప్ప విషయంగా అనిపించవచ్చు. రోజూ దేవుడికి పూజ చేయడం వలన జీవితంలో శాంతి, ఆనందం, ఆత్మవిశ్వాసం లభిస్తాయని నమ్ముతారు. హిందూ మతంలో వివిధ పురాణాల ఆధారంగా దేవుళ్ళు అవతరించారు. ప్రతి వ్యక్తికి ప్రత్యేక లక్షణాలు, ఆసక్తులు ఉంటా యని నమ్ముతారు.ఈ పరిస్థితిలో వారంలోని ఏడు రోజులు ఏ ఏ దేవుళ్ళను పూజించాలో తెలుసుకుందాం..హిందూ మతం ప్రకారం సోమవారం శివుడికి అంకితం చేయబడిన రోజుగా పరిగణించబడుతుంది. సోమవారం రోజున శివుడిని పుజిస్తారు. శివుడికి అభిషేకం చేస్తారు. సోమవారం రోజున సమీపంలోని శివాలయానికి వెళ్లి శివయ్యను సందర్శించి అభిషేకం చేసి పుజదికార్యక్రమాలు నిర్వహిస్తే శివయ్య అనుగ్రహం లభిస్తుందని.. గొప్ప పుణ్యం పొందుతారని కూడా చెబుతారు.మంగళవారం చాలా పవిత్రమైన రోజుగా పరిగణించబడుతుంది. ఈ రోజు హనుమంతుడి పూజకు చాలా ప్రత్యేకమైనది.మంగళవారం రోజున హనుమంతుడిని పూజిం చడంవల్ల జీవితంలోని భయాలు, అడ్డంకులు, ప్రతికూల శక్తులు తొలగిపోతాయని నమ్ముతారు. సాధ్యమైనప్పుడల్లా ఇంట్లో లేదా ఆలయంలో హనుమంతుడిని పూజించడం ప్రయోజనకరమని విశ్వాసం.బుధవారం విఘ్నాలకధిపతి గణపతిని పుజిస్తారు. గణపతిని పూజించడం వలన జ్ఞానం,తెలివి లభిస్తుందని నమ్మకం. ఇంట్లోనే కాదు గణపతి ఆలయాల్లో కూడా పూజ చేయడం వలన చేపట్టిన పనుల్లో ఎటువంటి ఆటంకాలు లేకుండా అవి సక్సెస్ అవుతాయని నమ్మకం. జీవితంలోని అడ్డంకులను తొలగించడానికి గణేశుని ఆరాధన ముఖ్యం.గురువారం విష్ణువు రోజుగా పరిగణించబడుతుంది.విష్ణువు ఆరాధించే వారికి సామరస్యం, స్థిరత్వం, ఆధ్యాత్మిక వృద్ధికి మార్గాన్ని చూపిస్తాడు.ఈ రోజున ప్రజలు విష్ణు సహస్రనామ జపించి భగవంతుడిని ప్రసన్నం చేసుకుంటారు.శుక్రవారం అమ్మవారి ఆరాధనకు అంకితం చేయబడిన రోజు. ఈ రోజున లక్ష్మీదేవి, లేదా దుర్గాదేవిని పూజించడం వల్ల గొప్ప ఫలితాలు లభిస్తాయని నమ్మకం. ఆ రోజు ఉపవాసం ఉండి పూజలు చేస్తే అమ్మవారి ఆశీర్వదం లభిస్తుందని నమ్మకం.శనివారం: శనిశ్వరుడి అంకితం చేయబడిన రోజు. ఈ రోజున శ్రీ వెంకటేశ్వర స్వామిని కూడా పూజిస్తారు. అయితే దేవాలయాలలో నవగ్రహాలు ఉన్న మందిరంలో పూజలు చేయడం , నువ్వుల దీపం వెలిగించడం వల్ల శనిశ్వరుడి అనుగ్రహం లభిస్తుందని నమ్ముతారు.ఆది వారం: వారంలో మొదటి రోజుగా పరిగణించబడే ఆదివారం..ప్రత్యక్ష దైవం సూర్య భగవానుడికి అంకితం చేయబడింది. సూర్యుడిని పూజించే వారికి మంచి ఆరోగ్యం, శక్తి ని ఇస్తాడని నమ్మకం.

# ఈ రాశి వారు చేపలు తింటే లేని పాపాలు చుట్టుకుంటాయా.. జ్యోతిష్య శాస్త్రం ఏం చెప్తోంది..?

వేద జ్యోతిష్యంలో మాంసాహారం,ముఖ్యంగా చేపలు తినడం గురించి కొన్ని సందర్భాలలో హెచ్చరికలు ఉన్నాయి.మన ఆహారపు అలవాట్లు గ్రహాలు,రాశులతో సంబంధం కలిగి ఉంటాయి. మీన రాశి జల రాశి కావడం వల్ల, నీటితో సంబంధం ఉన్న చేపలు ఈ రాశి వారికి సహజంగా సమీపంగా ఉంటాయని కొందరు జ్యోతిష్యులు భావిస్తారు. అయితే, ఉదాహరణకు, 2025లో మీన రాశి వారు మాంసాహారానికి దూరంగా ఉండాలని కొన్ని జ్యోతిష్య సూచనలు పేర్కొన్నాయి, ఎందుకంటే శని, బృహస్పతి ప్రభావం వల్ల ఆరోగ్యం, ఆధ్యాత్మిక శాంతి పై ప్రభావం పడవచ్చని వారు అభిప్రాయపడుతున్నారు.జ్యోతిష్య శాస్త్రంలో, ఆహారపు అలవాట్లు గ్రహాలు, రాశులతో సంబంధం కలిగి ఉంటాయి. మీన రాశి జల రాశి కావడం వల్ల, నీటితో సంబంధం ఉన్న చేపలు ఈ రాశి వారికి సహజంగా సమీపంగా ఉంటాయని కొందరు జ్యోతిష్యులు భావిస్తారు. అయితే, వేద జ్యోతిష్యంలో మాంసాహారం, ముఖ్యంగా చేపలు తినడం గురించి కొన్ని సందర్భాలలో హెచ్చరికలు ఉన్నాయి. ఉదాహరణకు, 2025లో మీన రాశి వారు మాంసాహారానికి దూరంగా ఉండాలని కొన్ని జ్యోతిష్య సూచనలు పేర్కొన్నాయి, ఎందుకంటే శని, బృహస్పతి ప్రభావం వల్ల ఆరోగ్యం, ఆధ్యాత్మిక శాంతి పై ప్రభావం పడవచ్చు.మీన రాశికి చేపలతో సంబంధంమీన రాశి చిహ్నం ఒక జత చేపలు కావడం వల్ల, చేపలు తినడం ఈ రాశి వారి ఆధ్యాత్మిక లేదా కర్మ స్వభావంతో అనుసంధానించబడవచ్చని కొందరు విశ్వసిస్తారు. చేపలు సోదరభావం, ఐక్యతను సూచిస్తాయని, కాబట్టి వీటిని తినడం వల్ల కొందరు ఆధ్యాత్మిక దృష్టిలో వ్యతిరేక ప్రభావం ఉండవచ్చని భావిస్తారు. అయితే, ఇది సాంప్రదాయిక విశ్వాసాలపై ఆధారపడి ఉంటుంది, శాస్త్రీయ ఆధారం లేదు.ఆరోగ్య, ఆధ్యాత్మిక దృక్కోణంచేపలు తినడం వల్ల ఆరోగ్య ప్రయోజనాలు (ఒమేగా-3, ప్రోటీన్లు) ఉన్నప్పటికీ, జ్యోతిష్యంలో మీన రాశి వారు 2025లో ఆరోగ్యం, ఒత్తిడి విషయాల్లో జాగ్రత్తగా ఉండాలని సూచించబడింది. కొన్ని చేపలలో పాదరసం (మెర్క్యురీ) ఎక్కువగా ఉండటం వల్ల, ముఖ్యంగా కింగ్ మాకేరెల్ వంటి చేపలను తినకూడదని నిపుణులు హెచ్చరిస్తున్నారు, ఇది నాడీ వ్యవస్థ, కిడ్నీలపై ప్రభావం చూపవచ్చు. జ్యోతిష్య దృష్టిలో, ఇటువంటి ఆహారం తినడం వల్ల శని లేదా కేతు దోషాలు తీవ్రమవచ్చని కొందరు భావిస్తారు.పరిహార సూచనలు మీన రాశి వారుకి జ్యోతిష్య శాస్త్రం కొన్ని పరిహారాలను సూచిస్తుంది:శని పూజ: శనివారం నవగ్రహ ఆలయంలో శనికి తైలాభిషేకం చేయడం. దత్తాత్రేయ ఆరాధన: మీన రాశి వారికి మిశ్రమ ఫలితాలు వచ్చే సమయంలో దత్తాత్రేయుని పూజించడం శుభం.మూగ జీవులకు ఆహారం: చేపలకు ఆహారం అందించడం వల్ల పుణ్య ఫలితాలు వస్తాయని జ్యోతిష్య శాస్త్రం సూచిస్తుంది.

# బొడ్రాయి ప్రతిష్టాపనకు ఆహ్వానం



**నాగారం:** నాగా రం మండలం ఈటూరు గ్రామంలో ఈనెల 18 19 20 తేదీల్లో జరుగు బొడ్రాయి ప్రతిష్టాపనకు మాజీ శాసనసభ్యులు & బిజెపి పార్టీ రాష్ట్ర ఉపాధ్య క్షులు శ్రీ సంకినేని వెంకటే శ్వరరావు గారిని హైదరా బాద్ లోని ఆయన నివాసంలో మర్యాదపూర్వ కంగా కలిసి ఆహ్వాన పత్రిక అందజేసి శాలువాతో సన్మానించారు. గ్రామ పెద్దలు శ్రీ తిరుమల గిరి వ్యవసాయ మార్కెట్ వైస్ చైర్మన్ చింత రెడ్డి రాజగోపాల్ రెడ్డి భారతీయ జనతా పార్టీ రాష్ట్ర నాయకులు కన్నెబోయిన రాము యాదవ్ దూదిగాని చంద్రశేఖర్ తదితరులు ఉన్నారు.

# ఘనంగా బ్రహ్మోత్సవాలు



**పరిగి:** పూడూరు మండల పరిధిలోని రాకంచెర్ల గ్రామంలోని శ్రీ తిరుమలనాథ స్వామి దేవస్థానములో శ్రీ యోగానంద లక్ష్మీ నరసింహ స్వామి వారి బ్రహ్మోత్స వాల్లో శ్రీ యోగానంద లక్ష్మి నరసింహా స్వామిని స్థానిక నాయకులతో కలిసి ఎమ్మెల్యే రామ్మోహన్ రెడ్డి దర్శించుకుని ప్రత్యేక పూజలు నిర్వహిం చారు.ఈ సందర్భంగా ఎమ్మెల్యే రామ్మోహన్ రెడ్డి మాట్లాడుతూ.. శ్రీ యోగానంద లక్ష్మీనరసింహస్వామి దేవాలయానికి ఎంతో గణ చరిత్ర కలదని అన్నారు. స్వామివారి కరుణ కటాక్షాలతో ప్రజలంతా ఆయురారోగ్యాలతో సుఖసంతోషాలతో ఉండాలని ఆకాంక్షించినట్లు తెలిపారు.దైవచింతలతో మానసిక ప్రశాంతత ఏర్పడుతుం దన్నారు.ఈ కార్యక్రమంలో మాజీ సర్పంచ్ కమ్లి బాయ్ పెంటయ్య, మండల పిఎసిఎస్ చైర్మన్ సతీష్ రెడ్డి, ఎస్సై మధుసూదన్ రెడ్డి, మండల కాంగ్రెస్ అధ్యక్షులు సురేందర్, కాంగ్రెస్ నాయకులు నరసింహారెడ్డి ,భాస్కర్ రాజు ,తదితరులు పాల్గొన్నారు.

# అభివృద్ధి పనులను వేగవంతం చేయాలి



**సిద్దిపేట:** అభివృద్ధి పనులను వేగవంతం చేయాలని జిల్లా కలెక్టర్ ఎం.మనుచౌదరి అధికారులను ఆదేశించారు. మంగళవారం హుస్నాబాద్ పట్టణంలోని పలు అభివృద్ధి పనులను పరిశీలించారు.పట్టణంలోని బంజారా భవన్ వెనక ఆర్అండ్బీ గెస్ట్‌హౌస్ కోసం గుర్తించిన స్థలాన్ని కలెక్టర్ క్షేత్రస్థాయిలో సందర్శించి భవన నిర్మాణానికి ప్రణాళిక రూపొందించాలని సూచించారు. ఎల్లమ్మ చెరువు కట్ట సుందరీకరణ పనులను వేగవంతం చేయాలన్నారు. ఉమ్మాపూర్ శివారులోని గుట్ట ప్రాంతాన్ని చదును చేసి ఆ స్థలాన్ని ఇంజినీరింగ్ కళాశాల నిర్మాణ కోసం శాతవాహన యూనివర్సిటీ వైస్ ఛాన్సలర్‌కు అందించాలని చెప్పారు. జిల్లెల గడ్డ ప్రాంతంలో నేషనల్ అకాడమిక్ సెంటర్ భవన నిర్మాణానికి సేకరించిన రెండెకరాల స్థలాన్ని పరిశీలించి శంకుస్థాపనకు సిద్ధం చేయాలని అధికారులను ఆదేశించారు. పాత ప్రభుత్వ ఆస్పత్రి ని కూల్చేసి కొత్తగా మంజూరైన 150పడకల ఆస్పత్రి భవన నిర్మాణానికి చర్యలు తీసుకోవాలని టీజీ ఎంఎస్ఐడీసీ అధికారులకు సూచించారు. పాత భవనంలోని పలు విభాగాలను కొత్తగా నిర్మించిన ఎంసీహెచ్‌లోకి మార్చాలని తెలిపారు. కలెక్టర్ వెంట జిల్లా గ్రంథాలయ చైర్మన్ లింగమూర్తి, ఆర్డీవో రామ్మూర్తి, మున్సిపల్ కమిషనర్ మల్లికార్జున్ తదితరులు ఉన్నారు.

# ఘనంగా రేణుకా ఎల్లమ్మ తల్లి కల్యాణ మహోత్సవం

### పాల్గొన్న ఎమ్మెల్యే వీరేశం



**రామన్నపేట:** యాదాద్రి భువనగిరి జిల్లా, రామన్నపేట మండలంలోని వెల్లంకి గ్రామం లో నిర్వహించిన శ్రీశ్రీశ్రీ రేణుకా ఎల్లమ్మ తల్లి కల్యాణ మహో త్సవ కార్యక్రమంలో నకిరేకల్ ఎమ్మెల్యే వేముల వీరేశం పాల్గొన్ని ప్రత్యేక పూజలు నిర్వహించి, అనంతరం మారమ్మ అమ్మవారిని కూడా దర్శించుకున్నారు.

# దుర్గమ్మ తల్లి తిరుగు పండుగ వేడుకల్లో ఎంపీ వద్దిరాజు

**తొర్రూరు:** తొర్రూర్ మునిసిపాలిటీలోని టీక్యా, ఎర్రసోమ్లా తండాలలో మంగళవారం దుర్గమ్మ తల్లి తిరుగు పండుగ ఘనంగా జరిగింది.మాజీ కౌన్సిలర్, బీఆర్ఎస్ నాయకుడు గూగుల్ శంకర్ ఆహ్వానం మేరకు రాజ్యసభ సభ్యులు వద్దిరాజు రవిచంద్ర ముఖ్య అతిథిగా హాజరయ్యారు. గిరిజనులు ఎంతో ఉత్సాహంగా, సంప్రదాయబద్ధంగా, భక్తిశ్రద్ధ లతో జరుపుకొనే ఇలాంటి పండుగలు మానవ సంబంధాలను మరింత పెంచుతాయని,ప్రేమను పంచుతాయని ఎంపీ రవి చంద్ర చెప్పారు. శంకర్ నివాసంలో ఈ పండుగ సంబరాలలో పాల్గొనడం ఎంతో సంతోషంగా ఉందని ఎంపీ వద్దిరాజు



అన్నారు.ఈ సందర్భంగా బీ ఆర్ఎస్ తొర్రూరు మండల శాఖ అధ్యక్షులు పసుమర్తి సీతారాములు, మాజీ జేడ్పీటీసీ మంగళపల్లి శ్రీనివాస్, పార్టీ మండల శాఖ ప్రధాన కార్యదర్శి నలమాస ప్రమోద్,పట్టణ శాఖ అధ్యక్షులు రామిని శ్రీనివాస్, వర్కింగ్ ప్రెసిడెంట్ అనుమాండ్ల ప్రదీప్ రెడ్డి, పార్టీ ప్రధాన కార్యదర్శి కుర్ర శ్రీనివాస్ , ఫ్లోర్ లీడర్స్ ఎన్నమ నేని శ్రీనివాసరావు, నాయకులు కర్నే నాగరాజు, పేర్లజంపా సింగిల్ విండో డైరెక్టర్ జనార్దన్ రాజు , మాజీ సర్పంచ్ విజయకుమార్, నాయకులు గుంజి రవి యాకూబ్, అశోక్ తదితర ప్రముఖులు,శంకర్ కుటుంబ సభ్యులు,స్థానికులు పాల్గొన్నారు.

# అర్హులైనవారికి ఇందిరమ్మ ఇళ్లను అందించడమే ప్రభుత్వ లక్ష్యం

### ఎమ్మెల్యే రామ్మోహన్ రెడ్డి

**పరిగి:-** దోమ మండల పరిధిలోని శివారెడ్డి పల్లి గ్రామం లో ఇందిరమ్మ ఇళ్ల లబ్ధిదారులు సుజాత,లావణ్య, ఎండి షరీఫ ఇళ్ల నిర్మాణ పనులను స్థానిక నాయకులతో కలిసి ఎమ్మెల్యే డీసీసీ అధ్యక్షులు టి.రామ్మోహన్ రెడ్డి పరిశీలించారు.ఈ సందర్భంగా ఎమ్మెల్యే రామ్మోహన్ రెడ్డి మాట్లాడుతూ... అర్హులైన ప్రతి పేదవారికి ఇందిరమ్మ ఇళ్లను అందించడమే ప్రభుత్వ లక్ష్యం అని అన్నారు.అర్హులైన ప్రతి ఒక్కరికి ఇందిరమ్మ ఇళ్లను అందిస్తామని అన్నారు.బేస్ మీట్ వరకు పూర్తి చేసిన వెంటనే లక్ష రూపాయలు



లబ్ధిదారుల ఖాతాలో జమ చేశామని వీలైనంత తొందరగా ఇందిరమ్మ ఇల్లు నిర్మాణాలను పూర్తి చేయాలని యజమానులు నాన్న తో నిర్మించుకోవాలని సూచించారు. ఈ కార్యక్రమంలో మార్కెట్ కమిటీ చైర్మన్ పరశురాం రెడ్డి, మండల కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు విజయకుమార్ రెడ్డి, మండల పిఎసిఎస్ చైర్మన్ యాదవ రెడ్డి, కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకులు రాఘవేందర్ రెడ్డి,మార్కెట్ కమిటీ డైరెక్టర్ శాంతు కుమార్, కాంగ్రెస్ నాయకులు రమేష్ గౌడ్, సాయి రెడ్డి, మొగులయ్య గౌడ్, తదితరులు పాల్గొన్నారు.

# మే 20న దేశవ్యాప్త సమ్మెను జయప్రదం చేయాలి

**మెట్ పల్లి:** భారతదేశ వ్యాప్తంగా మే20తేదీన జరిగే దేశవ్యాప్త సమ్మెను జయప్రదం చేయాలని ఈరోజు మెట్ పల్లి మున్సిపల్ కమిషనర్ టి మోహన్ కు జగిత్యాల జిల్లా మున్సిపల్ సంఘం(ఏఐటీయూసీ) ప్రధాన కార్యదర్శి ఎండి ఉస్మాన్ సమ్మె నోటీస్ ఇవ్వడం అనంతరం వాల్ పోస్టర్లు విడుదల చేయడం జరిగింది.ఈ సందర్భంగా,ఎండి ఉస్మాన్ మాట్లాడుతూ కార్మికులు 102 సంవత్సరాల నుండి పోరాడి సాధించుకున్న కార్మిక చట్టాలను కార్మికుల హక్కులను రద్దు చేస్తూ కేంద్ర ప్రభుత్వం 44 కార్మిక చట్టాలలో 29 కార్మిక చట్టాలను రద్దుచేసి నాలుగు కోడ్లు తెచ్చి కార్మికుల హక్కులను కాల రాస్తున్నది కేంద్ర ప్రభుత్వం, కార్మిక, ప్రజా, రైతు వ్యతిరేక విధానాలతో 47 కోట్ల మందికి నష్టం కలుగుతున్న సందర్భంలో భారతదేశంలో ఇప్పటికే 27 సార్లు సమ్మెలు చేసి 4 కోడ్లు అమలు కాకుండా



ఆపడం జరిగింది. బిజెపి ప్రభుత్వం మళ్లీ అధికారంలోకి రావడంతో మళ్లీ 4కోడ్లు అమలు చేయాలని కేంద్ర ప్రభుత్వం నిర్ణయాన్ని వెనక్కి తీసుకోవాలని అందులో భాగంగా దేశవ్యాప్తం గా మే 20న సార్వత్రిక సమ్మెను జయప్రదం చెయ్యాలన్నారు. కార్మికులందరూ మే 20 రోజు జరిగే ఒక రోజు దేశ వ్యాప్త సమ్మెలో కార్మికులందరూ పాల్గొనేందుకు సహకరించాలని కమిషనర్ ని కోరడం జరిగింది. శాంతియుతంగా ఎలాంటి అవాంఛనీయ ఘటనలకు అవకాశం లేకుండా సమ్మె చేస్తామని ముందస్తు సమ్మె నోటీస్ ఇవ్వడం జరిగింది. ఈ కార్యక్రమంలో కార్మిక సంఘం జిల్లా అధ్యక్షులు బర్ల లక్ష్మణ్ మున్సిపల్ కార్మికులు ఏఐటీయూసీ నాయకులు తదితరులు పాల్గొన్నారు.

# దేశం సైనికుల వైపు.. మోడీ ట్రంప్ వైపు

### కాంగ్రెస్ పట్టణ అధ్యక్షుడు అత్తు ఇమామ్

**సిద్దిపేట:** పాకిస్తాన్‌తో కాల్పుల విరమణపై దేశ ప్రజలకు కేంద్రంలోని మోడీ ప్రభుత్వం వివరణ ఇవ్వాలని కాంగ్రెస్ పట్టణ అధ్యక్షుడు అత్తు ఇమామ్ డిమాండ్ చేశారు. దేశం మొత్తం సైనికుల వైపు ఉంటే మోడీ మాత్రం ట్రంప్ వైపు ఉన్నాడని చెప్పారు. జిల్లా కేంద్రంలోని పార్టీ కార్యాలయంలో మంగళవారం ఆయన మీడియాతో మాట్లాడుతూ మన దేశ భద్రతపై ట్రంప్ పెత్తనం ఏమిటని ప్రశ్నించారు. తన దేశంపై దాడి చేస్తే ఉగ్రవాది ఒసామా బిన్ లాడెన్‌ను అమెరికా చంపలేదా అని నిలదీశారు. అలాంటప్పుడు ఉగ్రవాదులను మనమెందుకు



విడిచిపెట్టాలన్నారు. యుద్ధంలో చనిపోయిన సైనికుల ఆత్మలు ఘోషిస్తున్నాయని ఆవేదన వ్యక్తంచేశారు. ఆపరేషన్ సింధూర్‌ను అవమానించిన మోదీ పహల్గామ్ బాధితులకు ఏం సమాధానం చెప్తారన్నారు. కాల్పుల విరమణలో మోదీ పాత్రపై సుప్రీంకోర్టు సుమోటోగా విచారణ చేపట్టాలని కోరారు. కార్యక్రమంలో పట్టణ ప్రధాన కార్యదర్శి కేదారి మధు, పట్టణ యువజన కాంగ్రెస్ అధ్యక్షుడు గయాజుద్దీన్, మైనార్టీ జనరల్ సెక్రెటరీ హర్షద్, నాజ్జు, బబ్బు రవితేజ తదితరులు పాల్గొన్నారు.

# ఘనంగా బుద్ధుడి జయంతి వేడుకలు

**సిద్దిపేట:** బుద్ధుడి హృదయమే భారత రాజ్యాంగ పీఠికని జంబూద్వీప జన జాగృతి సెంట్రల్ కమిటీ మెంబర్ లింగంపల్లి భాస్కర్ మహారాజ్ అన్నారు. గౌతమ బుద్ధుడి జయంతి సందర్భంగా సిద్దిపేట జిల్లా కేంద్రంలోని బుద్ధుని విగ్రహానికి J 3 నాయకులు మంగళవారం దీపారాధన కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ బుద్ధుడి గొప్పతనాన్ని, ప్రాచీనమైన జంబూద్వీపం నుంచి తీసుకున్న స్వేచ్ఛ, సమానత్వం, సోదరా భావం, న్యాయం అనే విలువలు ప్రస్తుత భారత రాజ్యాంగ పీఠికలో ఉన్నాయని చెప్పారు. బుద్ధుడు దేవుడు కాదని, ఆయనది మతమూ కాదని, ఆధ్యాత్మిక వాదం అంతకన్నా కాదన్నారు. బుద్ధుడు ఒక పరిపూర్ణ మానవుడు, మానవుల దుఃఖ నిర్మూలన కోసం సంఘాన్ని కట్టి, అంధకారంలోని మనందరి కోసం మార్గదాతగా, దీప స్థంభమై నిలిచిన వైతాళికుడని కొని యాడారు. ఆయన మనకు ఒక



హేతుబద్ధమైన జీవన విధానాన్ని అందించాడని చెప్పారు. బుద్ధుడి మార్గంలో నడవడమంటే బుద్ధుడిని సజీవంగా నిలిపి ఉంచడమేనని తెలిపారు. కార్యక్రమంలో మాదిగ జాగృతి సంఘం జిల్లా కన్వీనర్ వేముల మల్లికార్జున్ మహారాజ్, దీపారాధన కమిటీ ఇన్‌ఛార్జి పరమేశ్వరి మహారాణి, ధర్మ మహిళా జాగృతి నాయకురాలు నిర్మల మహారాణి, ప్రసన్న మహారాణి, బోయ పరమేశ్వరి, రాజేశ్వరి, J3నాయకులు దేవయ్య మహారాజ్, మహేష్ మహారాజ్, రాజన్ మహారాజ్, ఫిరాజి నాయక్, ప్రవీణ్‌రాజ్ మహారాజ్ తదితరులు పాల్గొన్నారు.

# సమ్మర్ క్యాంపులో మనోవికాసంపై శిక్షణ

**సిద్దిపేట:** ఎదిగే పిల్లలకు శారీరక దారుఢ్యం, మానసిక దృఢత్వం ఎంతో అవసరమని సంక్షేమ సిద్ధి యోగ సభ్యుడు పెద్ది మనోహర్ చెప్పారు. సంఘం సభ్యులతో కలిసి మంగళవారం జిల్లా కేంద్రంలోని స్థానిక ప్రెస్‌క్లబ్‌లో మీడియా సమావేశంలో మాట్లాడారు. 8 నుంచి 18ఏండ్లలోపు బాల బాలికలకు శారీరక దారుఢ్యం, మనోవికాసం, ఆధ్యాత్మికత, మానసికోల్లాసం పెంపొందించుటకు సంక్షేమ సిద్ధియోగ ఆధ్వర్యంలో సమ్మర్ క్యాంపు నిర్వహిస్తున్నామని తెలిపారు. క్యాంపు పట్టణంలోని లాల్‌కమాన్ పక్కనున్న సుందర సత్సంగ భవనంలో పది రోజులు జరుగుతుందని చెప్పారు.విద్యార్థులకు శారీరక మానసిక ఆరోగ్యం కోసం యోగాసనాలు, సూర్య నమస్కారాలు, ఆత్మరక్షణ కోసం కర్ర సాము విద్య, మానసిక వికాసం కోసం చిత్రలేఖనం, జానపద నృత్య శిక్షణ, ఆధ్యాత్మికత పెంపొందించుటకు భగవద్గీత, పూజ విధానం నేర్పిస్తామన్నారు. శిబిరంలో పాల్గొనే విద్యార్థులకు నామమాత్రపు ఫీజు మాత్రమే తీసుకుంటామని, ఈ అవకాశాన్ని పట్టణ, పరిసర ప్రాంతాల ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని కోరారు. సమావేశంలో ప్రభుదాస్, బిర్కూరీ మనోహర్, రాజేంద్రప్రసాద్, పోతుల రాజు, సురేశ్ తదితరులు పాల్గొన్నారు.



## బాధిత కుటుంబాలకు ఆర్థిక సాయం



**జనగాం:**దేవరుప్పల మండలంలోని మాధపురం,కడవెండి గ్రామాలలో బాధిత కుటుంబాలను పరామర్శించి ఆర్థిక సాయం అందజేసిన పాలకుర్తి నియోజక వర్గ ఎమ్మెల్యే మామిడాల యశస్విని రెడ్డి.ఈ సందర్భంగా ప్రతి కుటుంబానికి అండగా ఉంటామని భరోసా ఇచ్చారు. ఈ కార్యక్రమంలో మండల కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు నల్ల శ్రీరామ్,మాజీ మండల అధ్యక్షుడు ఉప్పుల సురేష్ బాబు,మండల,ఆయా గ్రామాల కాంగ్రెస్ పార్టీ నాయకులు, కార్యకర్తలు,తదితరులు పాల్గొన్నారు.

## సార్వత్రిక సమ్మె గోడ పత్రిక ఆవిష్కరణ



**నెల్లికుదురు:** దేశవ్యాప్త సార్వత్రిక సమ్మె గోడపత్రికలను స్థానిక గెస్ట్ హౌస్ లో మంగళవారం వివిధ కార్మిక సంఘాలు హాజరై ఆవిష్కరించాయి. ఈ సందర్భంగా ఎఐటి యుసి జిల్లా కార్యదర్శి రేషన్ పల్లి నవీన్ కుమార్ మాట్లాడుతూ.. ఈనెల 20న తలపెట్టిన సమ్మె జయప్రదం చేయాలని పిలుపునిచ్చారు.4లేబర్ కోడ్ ల ను రద్దుచేసి 44 కార్మిక చట్టాలను అమలు చేయాలని ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు.కార్యక్రమంలో ఎఐటియుసి సిఐటియు ఐప్టియు నాయకులు ఇసంపల్లి సైదులు, బాబు గౌడ్,వరి పెల్లి వెంకన్న, ఆలకుంట్ల సాయిలు, ఊడుగుల లింగన్న,చిర్ర వెంకన్న,లక్ష్మి,నరసమ్మ, తూటి వెంకటరెడ్డి పాల్గొన్నారు.

## ఎమ్మెల్యే వేముల వీరేశం పరామర్శ



**రామన్నపేట:**యాదాద్రి భువ నగిరి జిల్లా, రామన్నపేట మండల కేంద్రానికి చెందిన రాపోలు ఉపేందర్ అనారోగ్యం తో భాదపడు తూ ఇంటి వద్ద విశ్రాంతి తీసుకుంటుడంగా వారిని నకిరేకల్ ఎమ్మెల్యే వేములవీరేశం పరామర్శించి ప్రస్తుత ఆరోగ్య వివరాలను అడిగి తెలుసుకు న్నారు. అలాగే రామన్నపేట మండల కేంద్రానికి చెందిన బూరుగు లక్ష్మమ్మ ఇటీవలే అనారోగ్యం తో మరణించగా వారి చిత్రపటానికి పూలమాలవేసి నివాళులర్పించి కుటుంబ సభ్యులను పరామర్శించారు.

## ముగిసిన ఎన్ఎస్ఎస్ శిబిరం..




**ఇనుగుర్తి:** ప్రొఫెసర్ జయశంకర్ వ్యవసాయ విశ్వవిద్యా లయం వరంగల్ కళా శాల విద్యార్థులు వారం రోజులుగా మండల కేంద్రం ఇనుగుర్తిలో నిర్వహించిన ఎన్ ఎస్ ఎస్ శిబిరం మంగళ వారంతో ముగిసింది.ఈ సందర్భంగా స్థానిక రైతు వేదికలో నిర్వహించిన సమావేశానికి తహసిల్దార్ కుసుమ రవీందర్ తో పాటు ప్రొఫెసర్లు హాజరయ్యారు. వాలంటీర్లు చేసిన మాడల్స్ పరిశీలించారు.అనంతరం ప్రొఫెసర్లు మాట్లాడుతూ.. మండలంలోని అయ్యగారి పల్లి గ్రామానికి చెందిన ఆదర్శ సేంద్రియ రైతు పెండెం వెంకన్న పటేల్ శిబిరం విజయవంతా నికి సహకరిం చిన తీరును ప్రశంసించారు మెమెంటోతో సత్కరించారు. అంతకమునుపు వెంకన్న పటేల్ అగ్రి విద్యార్థులకు తమ జీవిత అనుభవాలను క్రోడీకరించి చక్కటి సందేశాన్ని చ్చారు.కార్యక్రమంలో ప్రొఫెసర్లు డా.కె. రాజేంద్రప్రసాద్,కె గోపిక వంశీకృష్ణ,పి ఇటి నాగిరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

## 100మందికి అన్నదానం



**నార్కట్ పల్లి:**మనం స్వచ్ఛంద సంస్థ ఆధ్వర్యంలో 257 నా, చొక్కరపు సాయిశ్రీజ పుట్టినరోజు సందర్భంగా వారి అమ్మ నాన్న చొక్కరపు కిరణ్ కుమార్ – హారిక కుటుంబ సభ్యులు కలిసి నిరుపేదలకు బాటసారులకు నిస్సహాయులకు 100 మందికి అన్నదానం చేయడం జరిగింది. ఇంట్లో వేడుకలు లక్షలు పెట్టీ ఫక్షన్ హాల్ లో వృథాగా ఖర్చు చేసే కంటే ఇక్కడ నిరుపేదల ఆకలి తీరిస్తే కలిగే ఆనందం కోట్లల్లో కలిగింది అని కుటుంబ సభ్యులు పేర్కొన్నారు.నార్కెట్ పల్లి లో మనం స్వచ్ఛంద సంస్థ నిర్వహిస్తున్న ప్రతిరోజూ ఉచిత భోజనం కార్యక్రమం కు దాతలు సహాయ సహకారాలు అందించాలని విజ్ఞప్తి చేశారు.

# ఉత్సాహంగా జిల్లా స్థాయి క్రికెట్ పోటీలు

**రామన్నపేట:**యాదాద్రి భువనగిరి జిల్లా, రామన్నపేట మండల కేంద్రంలోని స్థానిక లోతుకుంట క్రీడా మైదానంలో మంగళవారం రోజు గరిక ఫౌండేషన్ ఆధ్వర్యంలో గరిక లక్ష్మమ్మ-బచ్చయ్య, వారి కుమారుడు గరిక యాదగిరి గార్ల స్మారకార్థం గరిక ఫౌండేషన్ వ్యవస్థాపక అధ్యక్షులు గరిక సత్యనారాయణ జిల్లాస్థాయి క్రికెట్ టోర్నమెంట్ ప్రారంభించడం జరిగింది.ఈ సందర్భంగా క్రీడలు శారీరక దృఢత్వానికి మానసిక ఉల్లాసానికి తోడ్పడతాయని, రామన్నపేట మండల యువకులు క్రీడల్లో భాగస్వామ్యం కావాలని గరిక సత్యనారాయణ తెలిపారు.



ఈ కార్యక్రమంలో మహమ్మద్ నాజర్, బొడ్డు సురేందర్రావు, జమీరుద్దీన్, కోట సుధాకర్, వ్యాయామ ఉపాధ్యాయుడు పెద్దబోయిన మణి, వనం చంద్రశేఖర్, కొమ్ము రామస్వామి, గోదాసు ప్రవీణ్, కొమ్ము శేఖర్, బుర్రి రవీందర్, గొలుసుల ప్రసాద్, పల్లపు రవి, దండుగుల శివరంజన్, లవణం సాయి, క్రికెట్ అసోసియేషన్ సభ్యులు మీర్జా మజీద్ బేగ్, జింకల ప్రసాద్, ప్రవీణ్ ప్రకాష్, క్రికెట్ క్రీడాకారులు పెద్ద సంఖ్యలో పాల్గొని విజయవంతం చేసినారు.

# ట్రాఫిక్ సిగ్నల్స్ ప్రారంభం

### ప్రారంభించిన మంత్రి దామోదర రాజనర్సింహా

**సంగారెడ్డి:**సంగారెడ్డి జిల్లాఐబి, పోతిరెడ్డిపల్లి చౌరస్తాల లో ట్రాఫిక్ సిగ్నల్స్ ను వైద్య ఆరోగ్య శాఖ మాత్యులు దామోదర రాజనర్సింహా లాంఛనంగా ప్రారంభించారు. ఈ సందర్భంగా ఎస్పీ పరితోష్ పంకజ్ మాట్లాడుతూ.. సంగారెడ్డి జిల్లా కేంద్రం లో ట్రాఫిక్ రద్దీని అదిగమించి, ప్రజల సురక్షిత ప్రయాణానికి సంగారెడ్డి ఐబి, పోటిరెడ్డిపల్లి ప్రధాన కూడళ్లలో అధునిక సాంకేతికతతో కూడిన ట్రాఫిక్ సిగ్నల్స్ ను మంగళవారం వైద్య ఆరోగ్య శాఖ మాత్యులు దామోదర రాజనర్సింహా చేతుల



మీదుగా ప్రారంభించుకోవడం జరిగిందని జిల్లా ఎస్పీ తెలియజేశారు. వాహనదారులు విధిగా ట్రాఫిక్ నియమాలు పాటించి, సురక్షిత ప్రయాణం చేయాలని,ట్రాఫిక్ సిగ్నల్స్ జంప్ చేసినా, ట్రిపుల్ రైడింగ్ వంటి ట్రాఫిక్ ఉల్లంగాన చేసినట్లయితే హై రెజల్యూషన్ గల ఎ.ఎన్.పి.ఆర్. సిసి కెమెరాల ద్వారా గుర్తించి ఫైన్ విధించడం జరుగుతుందన్నారు. ఈ ట్రాఫిక్ సిగ్నల్స్ ఆధునిక సాంకేతికత కలిగి 24ఠ7 పనిచేస్తాయని, అత్యవసర సమయాలలో సిగ్నల్స్ మార్పు చేసుకోవడానికి అనుకూలంగా ఉంటుంది అని అన్నారు. ఈ కార్యక్రమంలో సంగారెడ్డి డియస్పి సత్యయ్య గౌడ్, సంగారెడ్డి ట్రాఫిక్ సీఐ సుమన్, టౌన్ సీఐ రమేష్, తదితరులు పాల్గొన్నారు.

# సిపిఐ పార్టీలో పలువురి చేరిక

**రామన్నపేట:**యాదాద్రి భువనగిరి జిల్లా, రామన్నపేట మండలం, బోగారం గ్రామానికి చెందిన తెలుసూరి మల్లేశం, కూనూరు కబీర్ దాస్ నీ, సిపిఐ మండల కార్యదర్శి ఉట్కూరి నరసింహ చేతుల మీదుగా సిపిఐ పార్టీలోకి కండువా కప్పి ఆహ్వానించారు.ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, అసెంబ్లీ లో నిత్యం ప్రజల పక్షాన ప్రజా గొంతుకై నినదిస్తున్న కూనమనేని సాంబశివరావు మాటలకు ఆకర్షితులై పార్టీలో పలువురు




చేరుతున్నారని, భవిష్యత్తులో పార్టీ అభివృద్ధి కొరకు పాటుపడా లని నిత్యం పేదల పక్షాన ఎర్రజెండా ప్రజా సమస్యలపై పోరాడుతుందని, నిత్యం ప్రజా సమస్యలపై అలుపెరగని పోరాటాలు భారత కమ్యూనిస్టు పార్టీ చేస్తుందని ఈ సందర్భంగా అన్నారు. ఈ కార్యక్రమంలో సిపిఐ మండల సహాయ కార్యదర్శి ఎర్ర రమేష్ గౌడ్, భగవంత, రచ్చ యాదగిరి, కల్లెం యాదగిరి, ఊట్కూరి కృష్ణ, పర్సా సుదర్శన్ తదితరులు పాల్గొన్నారు.

# ఇంటి దొంగలున్నారు తస్మాత్ జాగ్రత్త!

### సింగరేణిలో ప్రైవేట్ సెక్యూరిటీ గార్డుల చేతివాటం

**కొత్తగూడెం :** దాదాపుగా నూటఇరవై సంవత్సరాలుగా వెలుగొందిన సింగరేణి సంస్థ మన ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ లోనే కాదు దేశంలో విద్యుత్ ఉత్పత్తికి కీలక పాత్ర పోషించిన ఘనత సింగరేణి బొక్కగనులది. ఒకప్పుడు దాదాపు లక్షనలభైవేలమంది కార్మికులతో వెలుగొందిన సంస్థ ఈరోజు సింగరేణి వ్యాప్తంగా కేవలం నలభైవేలమందితో సంస్థ కార్యకలాపాలు కొనసాగి స్తుంది. ఒకప్పుడు బిఐఎఫ్ ఆర్ నోట్లోకి వెళ్లిన సింగరేణి సంస్థను ఆనాటి తెలుగుదేశం ప్రభుత్వంలోముఖ్యమంత్రి చంద్రబాబు చొరువవల్ల బ్రతికిబట్ట కట్టిందనే విషయం కార్మికులు మర్చిపోయిన చంద్రబాబు మానిటోర్యం చెల్లించి సంస్థను కాపాడాడు. కానీ, ఈ నాడు పర్మనెంట్ కార్మికులకంటే ఎక్కువగా సంస్థలో ప్రైవేట్ కార్మికులున్నారు, ముఖ్యంగా సంస్థలో ప్రైవేట్ సెక్యూరిటీ గార్డులను అవసరానికి మించి నియమించుకున్నారు. కానీ, కంచే చేను మేస్తే అనే వైనంగా ఈ ప్రైవేట్ గార్డులు పర్మనెంట్ గార్డులతో మీలాకాత్ అయ్యి ఖాళీగా ఉన్న సింగరేణి ఇండ్లను ఇతరేతులకు నెల వెయ్యి నుండి రెండు వేల చొప్పున కిరాయికి ఇస్తున్నారు. ఈ విషయం సింగరేణి యాజమాన్యం దృష్టికి పోలేదా లేదా వారి దృష్టికి వచ్చినా కళ్ళున్నా ధృతరాష్ట్రుని పోషిషస్తున్నారానేది జన వాఖ్యం. ప్రైవేట్ సెక్యూరిటీ గార్డులతో మిలాఖాత్ అయ్యి పెర్మనెంట్ సెక్యూరిటీ గార్డులు నెలలో దాదాపుగా ఒకొక్కరు పది నుండి ఇరవైవేలు అక్రమసంపాదన ఉండనేది నగ్నసత్యం. ఎవరైనా సింగరేణి కార్మికుడు తన ఇంటిని బాగుచేసుకుందామనుకుంటే దానికి కూడా అభ్యంతరం తెలియజేసే గార్డులు వారి ఇంటిని మాత్రం ఒక జనరల్ మేనేజర్ లేదా డైరెక్టర్ స్థాయిలో ఉంచుకోవడం ఏంటని కార్మికులు ప్రశ్నిస్తున్నారు. ఒక ప్రైవేట్ సెక్యూరిటీ గార్డ్ ఇంట్లో రెండు పంపు కనెక్షన్లు ఉన్న పట్టించుకోని యాజమాన్యం దాదాపు నలభై సంవత్సరాలు సేవలు చేసిన కార్మికునిపై జులుం చెయ్యడం ఏంటని కార్మికులు ప్రశ్నిస్తున్నారు. ప్రైవేట్ గార్డ్ ఇంట్లో ఏడు ఎనిమిది బుల్బులు పెట్టుకున్న ప్రశ్నించని విజిలెన్స్ విభాగం సమాన్య కార్మికుడిపై జులుం చెయ్యడాన్ని జీర్ణించుకోలేని పరిస్థితి. ఇకనైనా విజిలెన్స్ డిపార్ట్మెంటుని ప్రక్షాలన చెయ్యాల్సిన అవసరం ఎంతైనా ఉందని కార్మికులు కోరుకుంటున్నారు.

# ఎంపీ వద్దిరాజు మాతృమూర్తి ఘన నివాళులు

**ఇనుగుర్తి:** రాజ్యసభ సభ్యులు వద్దిరాజు రవిచంద్ర మాతృమూర్తి వెంకటనర్సమ్మకు తన కుటుంబ సభ్యులతో కలిసి ఘనంగా నివాళులర్పించారు.వెంకటనర్సమ్మ 11వ వర్థంతి (తద్దినం) సందర్భంగా స్వగ్రామం ఇనుగుర్తిలో మంగళవారం ఆమె కుమారులు కిషన్, దేవేందర్, రవిచంద్ర, వెంకటేశ్వర్లు ప్రత్యేక పూజలు చేసి పిండ ప్రధానం చేశారు.ఈ సందర్భంగా వద్దిరాజు సోదరులు తమ తల్లిదండ్రులు నారాయణ-వెంకట నర్సమ్మల జ్ఞాపకార్థం నెలకొల్పిన స్మృతివనాన్ని సందర్శించి కుటుంబ సభ్యులతో కలిసి వారి విగ్రహాలకు పూలుజల్లి, కొబ్బరికాయలు కొట్టి ఘనంగా నివాళులర్పించారు,గత స్మృతుల ను నెమరు వేసుకున్నారు.స్మృతివనాన్ని వద్దిరాజు కమలమ్మ, వద్దిరాజు కిషన్-శశిరేఖ,వద్దిరాజు దేవేందర్ -ఇందిర,వద్దిరాజు రవిచంద్ర



విజయలక్ష్మి,వద్దిరాజు వెంకటేశ్వర్లు-ఉమా మహేశ్వరి ,వద్దిరాజు మోహన్ -వాసవి,వద్దిరాజు వెంకటేశ్వర్లు(పోలీస్) -పద్మ,వద్దిరాజు శ్రీనివాస్,వద్దిరాజు నాగరాజు,వద్దిరాజు శ్రీనివాస్ (గడ్డి),శీలం సత్యనారాయణ -లక్ష్మి, సంగిశెట్టి సోమయ్య, సంగిశెట్టి శంకర్, సంగిశెట్టి ప్రభాకర్,ఆకుల గాంధీ,ఆకుతోట ఆదినారాయణ,వనం నాగయ్య తదితరులు సందర్శించి నారాయణ-వెంకటనర్సమ్మ విగ్రహాలకు పూలుజల్లి ఘనంగా నివాళులర్పించారు. తమ తల్లి తద్దినం (వర్థంతి) సందర్భంగా వద్దిరాజు సోదరులు పలువురు బ్రాహ్మణులకు నిత్యావసర సరుకులు,కొంత నగదు అందజేసి గౌరవించారు,సుమారు 1,000మంది పేదలకు అన్నదానం చేశారు.

## సీఎంఆర్ఎఫ్ ఎల్వోసీ అందజేత



**ఇనుగుర్తి:** మండల కేంద్రం ఇనుగుర్తి కి చెందిన కుంచాల పుల్లయ్య కుమారుడు లక్ష్మణ్ రాజ్ కు ఎంపీ వద్దిరాజు రవిచంద్ర సిఫారస్ చేసి రెండు లక్షల ఎల్ఓసి మంజూరు చేయించి తమ పిఎ ధనుంజయ్ ద్వారా లక్ష్మణ్ రాజు సతీమణి జ్యోతి కి అందజేశారు.లక్ష్మణ్ రాజ్ బ్రెయిన్ సంబంధిత డిసీజ్ తో బాధ పడడం తెలుసుకున్న ఎంపీ వద్దిరాజు నిమ్స్ డైరెక్టర్ తో మాట్లాడి నిమ్స్ ఆసుపత్రిలో అడ్మిట్ చేయించారు. చికిత్స కోసం ప్రభుత్వం నుంచి లెటర్ ఆఫ్ క్రెడిట్ మంజూరు చేయించారు. దీంతో బాధిత కుటుంబం ఎంపీ కి కృతజ్ఞతలు తెలిపారు.

## నిరుద్యోగుల సమస్యలు పరిష్కరించాలి

### ఎమ్మెల్సీ అంజి రెడ్డి కి నిరుద్యోగుల ఫోరం వినతి...



**బషీర్ బాగ్:** నిరుద్యోగుల సమస్యలను తక్షణమే పరిష్కరిం చాలని మెదక్-నిజామాబాద్-ఆదిలా బాద్-కరీంనగర్ పట్టభద్రుల నియో జకవర్గం శాసనమండలి సభ్యుడు అంజి రెడ్డికి నిరుద్యోగుల ఫోరం అధ్యక్షుడు అనుజ్ కుమార్ వినతి పత్రాన్ని అందజేశారు. నిరుద్యోగుల సమస్యలపై శాసన మండలి లో చర్చిస్తానని హామీ ఇచ్చినట్లు అనుజ్ కుమార్ తెలిపారు.ఈ సందర్భంగా నిరుద్యోగుల ఫోరమ్ క్యాలెండర్ 2025నుఅందజేశామని వెల్లడిం చారు.నిరుద్యోగ భృతి, గ్రూప్ 4 బ్యాక్‌లాగ్ ఖాళీలు తక్షణమే భర్తీ చేయాలని కోరారు .నిరుద్యో గుల కోసం నైపుణ్య కేంద్రాన్ని ఏర్పాటు చేయాలని విజ్ఞప్తి చేశారు.నిరుద్యోగుల ఫోరం విన్నపని ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లి పరిష్కరించే దిశగా కృషి చేస్తానని ఎమ్మెల్సీ అంజి రెడ్డి హామీ ఇచ్చినట్లు ఆయన తెలిపారు.

న్యూస్-9 సామాజిక అవసరం...సామాన్యుడి ఆయుధం తెలుగు దినపత్రిక
www.news9-india.com
news9.india News9India_ news9telugudaily

# కాల్పుల విరమణపై విమర్శలు తగవు !

యుద్ధాన్ని అర్థాంతరంగా అపారు. అమెరికా పెత్తనమేంటి..? ఎవరిని అడిగి కాల్పులు ఆపారు.. ఎందుకు పాక్‌పై పూర్తిస్థాయి దాడికి పూనుకోలేదు. పాక్ జుట్టు చేతికి అందే సమయంలో మోడీ లొంగిపోయారు. ఇలా రకరకాల ప్రశ్నలు ఇప్పుడు మోడీ లక్ష్యంగా సంధిస్తున్నారు. ఇదే సమయంలో కాంగ్రెస్ వారు ఓ అడుగు ముందుకు వేసి ఆనాడు ఇందిరా గాంధీ ఎలాంటి ఒత్తిళ్లకు తలొగ్గలేదని, నాటి ఆమె ప్రసంగాలను సోషల్ మీడియాలో ప్రచారం చేస్తున్నారు. నిజానికి మోడీ అమెరికా లేదా,పాక్‌కు తలొగ్గారని ఎవరైనా అనుకుంటే భ్రమే అవుతుంది. ఎందుకంటే ఆయన ప్రసంగం విన్నవారు ఈ భ్రమల నుంచి బయటపడాలి. మోడీ ఎక్కడా రాజీపడలేదు. అలాగే పాకిస్థాన్‌కు గతంలో కన్నా గట్టి దెబ్బ కొట్టారు. అంతే కాకుండా కాచుకో అని హెచ్చరించారు. తోక ఝాడిస్తే పాక్ మసవుతుందని నిరూపించారు. ఉగ్రవాదులను ఉసిగొల్పితే నేరుగా పాక్‌పై దాడి చేస్తామని హెచ్చరించారు. ఇక ఇందిర విషయానికి వస్తే..1971లో బంగ్లాదేశ్ విముక్తితో బాగుపడ్డది బంగ్లా తప్ప భారత్ కాదు. కొత్తగా దేశం అవతరించింది. అదికూడా మనకు పక్కలో బల్లెంలా తయారయ్యిందని ఇటీవలి ఘటనలు రుజువు చేస్తున్నాయి. అక్కడా హిందువులను ఊచకోత కోశారు. కనీస కృతజ్ఞత లేకుండా బంగ్లాదేశం నేతలు వ్యవహరిస్తున్నారు. ఇకపోతే ఆనాటి యుద్ధం లో 93వేల మంది పాక్ సైనికులు పట్టుబడితే ఉదారంగా వదిలేశారు. ఆనాడే పట్టుబట్టి పివోకెను స్వాధీన పరచుకునే అవకాశం ఉన్నా వదిలిపెట్టారు. ఇదీ ఇందిరాగాంధీ నిర్వాకం. ఆనాడు గట్టిగా బుద్ది చెబితే ఇప్పుడు భారత్‌కు ఉగ్రవాదుల సమస్యలు వచ్చేవి కావు. ఈ విషయాన్ని కాంగ్రెస్ నేతలు గుర్తు పెట్టుకుంటే మంచింది. అన్నింటికన్నా ముఖ్య విషయమేంటంటే ఆపరేషన్ సింధూర్ కేవలం ఉగ్రవాద స్థావరాలను ధ్వంసం చేసేందుకు మాత్రమే ఉద్దేశించినది. ఈ క్రమంలో పాక్ కాల్పులకు తెగబడగా మన సైనిక దళాలు మరో అడుగు ముందుకు వేసి పాక్‌ను చావుదెబ్బ కొట్టాయి. మరో వందేళ్లయినా కోలుకోకుండా సర్వనాశనం చేశాయి. పహల్గాంలో ఉగ్రమూకలు కర్కశంగా దాడి చేసి 26 మందిని హతమార్చిన తర్వాత రగిలిపోయిన ప్రధాని పాకిస్థాన్‌పై దాడికి త్రివిధ దళాలను సిద్ధంచేసి ప్రతిదాడులకు శ్రీకారం చుట్టారు. ఈ క్రమంలో ప్రధానమంత్రి మోడీ తీసుకున్న నిర్ణయాలను ప్రపంచంతో పాటు దేశం కూడా శ్లాఘిస్తోంది. ఇంటా బయటా ఆయన ప్రతిష్ఠ అమాంతంగా పెరిగింది. పహల్గాంలో యాత్రికుల మతం తెలుసుకొని మరీ పురుషులను మాత్రమే చంపి మన మహిళల పసుపు కుంకుమలను ఉగ్రవాదులు చెరిపేయడంతో దేశ ప్రజలందరిలోనూ ప్రతీకారేచ్ఛ రగిలిపోయింది. పాకిస్థాన్‌కు సరైన గుణపాఠం చెప్పాల్సిందేనని దేశ ప్రజలంతా నినదించారు. దీంతో ఇదే అదనుగా భావించిన ప్రధానమంత్రి... పాక్‌పై ప్రారంభించిన ప్రతిదాడులకు 'ఆపరేషన్ సిందూర్' అని వ్యూహాత్మకంగా నామకరణం చేశారు. ఏ మహిళల నుదుటిపై సిందూరం తుడిచివేయబడిందో అదే సిందూరం పేరిట ఆపరేషన్‌కు గ్రీన్ సిగ్నల్ ఇచ్చారు. ఆపరేషన్‌కు సంబంధించిన సమాచారాన్ని ఎప్పటికప్పుడు మీడియాకు తెలియజేసే బాధ్యతను ఇద్దరు మహిళా సైనికాధికారులకు అప్పగించారు. ప్రధాని మోదీ చతురతకు ఇది నిదర్శనంగా చెప్పుకోవాలి. ఈ క్రమంలో లక్ష్యం నెరవేరింది. పాక్ గడ్డపై 9 ఉగ్రవాద స్థావరాలను ధ్వంసం చేశారు. తరవాత పాక్ దీనికి కట్టుబడి అభినందించకుండా ఉగ్రవాదులకు అండగా నిలిచింది. అకారణంగా భారత్‌పై కాల్పులకు తెగబడింది. దీంతో భారత్ ధీటుగా సమాధానం ఇవ్వండంతో చివరకు దానికి చావుదెబ్బ తప్పలేదు. ఎయిర్‌బేస్‌లు దెబ్బతిన్నాయి. అణుస్థావరంపై దాడి జరిగింది. చివరకు కోలుకోలేని స్థితిలో కాళ్లబేరానికి వచ్చింది. మనం నేరుగా చెబితే ఒప్పుకోమన్న భయంతో అమెరికాను వేడుకుంది. అమెరికా ద్వారా పాకిస్థాన్ రాయబారాలు నడిపి కాల్పుల విరమణకు ఒప్పించింది. శనివారం సాయంత్రం 5 గంటల నుంచి అనూహ్య రీతిలో ఇరు దేశాల మధ్య కాల్పుల విరమణ అమలులోకి వచ్చింది. ఇది ఒకరకంగా శుభ పరిణామంగా చూడాలి. ఎందుకంటే ఆపరేషన్ సింధూర్ ముగియలేదని మోడీ తేల్చారు. సైన్యం కూడా తేల్చింది. ఏమాత్రం అల్లరి జరిగినా ఈసారి దాడికి రెడీగా ఉంటామని, సింధూర్ ముగియలేదని తేల్చి చెప్పాం.



ఉగ్రవాదాన్ని, చర్చలను ఒకేగాటిన కట్టలేమని చెప్పారు. నీళ్లను రక్తాన్ని కలిపి పారించలేమన్నారు. పివోకె, ఉగ్రవాదంపైనే తదుపరి చర్చలని కూడా మోడీ తేల్చారు. ఇవి గ్రహించకుండా పాక్శై కాల్పుల విరమణ గురించి విమర్శలు చేసేవారు గతాన్ని, ప్రస్తుతాన్ని గమనించి మాట్లాడితే మంచిది. ఇకపోతే పాక్ ఉగ్రవాదులు మత ప్రాతిపదికన మారణహోమం సృష్టించడం ద్వారా మన దేశంలో హిందువులను సంఘటితం చేశారు. ఫలితంగా ప్రధాని మోదీ అత్యంత శక్తిమంతమైన నేతగా అవతరించారు. మాకు మోదీ ఉన్నారన్న ధీమాలో ఇప్పుడు దేశ ప్రజలు ఉన్నారు. పాకిస్థాన్ గడ్డపై తిష్ఠవేసిన దాదాపు వంద మంది ఉగ్రవాదులను మట్టుబెట్టగలగడం మన దేశం సాధించిన విజయం. గతంలో పాకిస్థాన్‌పై మన దేశం రెండు పర్యాయాలు యుద్ధం చేయవలసి వచ్చింది. ఈ రెండు సందర్భాలలోనూ భారత దేశానిదే పైచేయి అయింది. కానీ ఇప్పుడు ఉన్నంతగా ఆనాడు పరిస్థితులు అనుకూలించలేదు. ఆనాడే పివోకేను ఇస్తేనే సైనికులను వదులుతామని ఇందిర చెప్పి వుంటే సమస్య ఇంతదాకా వచ్చేది కాదు. భారత్‌తో నేరుగా తలపడి నెగ్గే పరిస్థితి లేనందున ఉగ్ర మూకల ద్వారా మన దేశంలో అలజడులు సృష్టించే ప్రయత్నం పాకిస్థాన్ చేస్తోంది. ఈ క్రమంలో పాక్‌లో తిష్ఠ వేసిన ఉగ్రవాదులు మరింత శక్తిమంతులుగా మారారు. పాకిస్థాన్ గూఢచార సంస్థ ఇంటర్ సర్వీస్ ఇంటెలిజెన్స్ ఐఎస్ఐ ద్వారా ఉగ్రవాదులకు శిక్షణ ఇస్తున్నారు. ఫలితంగా పాక్ మిలటరీకి, ఉగ్రవాద సంస్థలకు మధ్య విడదీయరాని బంధం ఏర్పడింది. తాము శత్రు దేశంగా పరిగణించే భారత్‌ను ఏదో చేయాలన్న దుగ్ధతో పాకిస్థాన్ తన తల కొరివిని తానే పెట్టుకుంటోంది. ఈ క్రమంలో ఇప్పుడు పహల్గామ్ దాడి తరవాత ఇక పాక్ ఉగ్రవాదులకు శిక్షణ ఇచ్చి దూకుడుగా భారత్‌పై దాడికి దిగే ఛాన్స్ తక్కువ. భారత్ అమ్ముల పొది ఏమిటో పాక్‌కు తెలిసి వచ్చింది. మళ్లీ ఇలాంటి ప్రయత్నం చేస్తే పాక్ ముక్కచెక్కలు కాక తప్పదు. అందుకు మోడీ వ్యూహంతోనే ఉంటారు. భారత రక్షణ దళాలు కూడా ఇప్పుడు అదే వ్యూహంతో సిద్దంగా ఉన్నాయి.

# ముక్తిమార్గం ..చార్‌ధామ్ యాత్ర (ఆధ్యాత్మికం )



**నైనిటాల్,మే13:** మనదేశంలోని ఉత్తరాఖండ్ రాష్ట్రంలో గల గంగోత్రి, యమునోత్రి, కేదారనాథ్, బద్రీనాథ్‌లను కలిపి చార్ ధామ్ అని పిలుస్తారు. ఈ ఏడాది అక్షయ తృతీయ రోజున చార్‌ధామ్ యాత్ర మొదలైంది. లక్షలాదిమంది హిందువులు ఈ యాత్రలో పాల్గొందామనుకునే సమయంలో పహల్గామ్ దాడి జరిగింది. అయితే కాల్పుల విరమణ జరగడంతో ఇప్పుడు చార్‌ధామ్ యాత్రకు నమ్మకం ఏర్పాడింది. ప్రభుత్వం కూడా గతం కన్నా మిన్నగా భద్రతా ఏర్పాట్లను చేసింది. చార్‌ధామ్ యాత్ర చేసిన వారికి జననమరణ చకభ్రమణం నుంచి విముక్తి దొరకుతుందని నమ్మకం. కేదార్ నాథ్ జ్యోతిర్లింగ దర్శనం తర్వాత స్వామివారి అభిషేక జలం స్వీకరించిన భక్తులకు తప్పక మోక్షం సంప్రాప్తిస్తుందని చెప్తారు. బద్రీనాథ్ దామ్ సందర్శన చేసిన వారు తిరిగి గర్భప్రవేశం చెయ్యడని, ముక్తిని పొందుతాడని శాస్త్రం చెబుతోంది. చార్‌ధామ్ ప్రయాణం వెనుకున్న కారణాలు, ఈ యాత్ర ప్రాశస్త్యం కారణంగా ప్రజలు చార్‌ధామ్ యాత్రకు ఆసక్తి చూపుతారు. ఈ యాత్ర చేయడం వల్ల జీవితానికి ఎన్నో ఆధ్యాత్మిక ప్రయోజనాలు లభిస్తాయని ప్రశస్తి. పరమాత్ముడితో అనుసంధానం చేసే యాత్రే చార్‌ధామ్ యాత్ర. తీర్ధయాత్ర చేసే సంకల్పం చేశారంటేనే ఎక్కడో సాత్వికత ఉందని అర్థం. చార్ ధామ్ ఒక సుదీర్ఘ తీర్థయాత్ర. ఈ యాత్ర ఆసాంతం మనసు ఒక పవిత్ర భావనతో ఉంటుంది. ఫలితంగా సానుకూల శక్తులను ఆకర్షించగలుగుతారు. ఈ యాత్ర జీవిత లక్ష్యాలను అర్థం చేసుకోవడంలో మీకు ఎంతో తొడ్పడుతుంది. నిజానికి ఈ యాత్ర జీవన యానానికి ఒక మార్గదర్శనం వంటిది. చార్‌ధామ్ యాత్ర చేసిన వారికి జన్మజన్మలుగా వెంటాడుతున్న పాపాలు ప్రక్షాళన అవుతాయని విశ్వాసం. తెలిసీ తెలియక చేసిన అన్ని తప్పులకు ఈ యాత్ర ద్వారా మన్నింపు దొరుకుతుందని నమ్మకం. చార్ ధామ్ యాత్ర చేసి వచ్చిన వారు మరింత జాగరూకతతో ఇక జీవితంలో పాపాలు చెయ్యకుండా జీవించాల్సి ఉంటుందని నమ్ముతారు. చార్‌ధామ్ లో కేవలం దైవదర్శనం మాత్రమే కాదు, ప్రకృతిలో లీనమైన భగవద్దర్శనం జరుగుతుంది. గంగోత్రి, యమునోత్రి, కేదార్ నాథ్, బద్రీనాథ్ లలోని ప్రకృతి అందాలు ఒక అద్భుతమైన అనుభూతి ఇస్తుంది.

## కుడితిలో పడ్డ ఎలుకలా పాక్ పరిస్థితి

- సైన్యానికి, ఉగ్రవాదులకు తలొగ్గే దుస్థితి
- బలూచీ ఉద్యమం మరింత ఉధృతంతో భయం



**న్యూఢిల్లీ,మే13:** పాక్ పరిస్థితి ఇప్పుడు కుడితిలో పడ్డ ఎలుకలా తయారయ్యింది. భారత్ ప్రతిదాడితో ఇక ముమ్మందు సాహసం చేసే పరిస్థితి లేకుండా చేసుకుంది. ఉగ్రవాదులకు తర్ఫీదు ఇవ్వడం, ఉసిగొల్పడం ద్వారా భారీ మూల్యం చెల్లించుకుంది. ఇకపోతే పాకిస్థాన్‌లో ప్రజా ప్రభుత్వం కంటే మిలటరీనే శక్తిమంతమైనది. సైన్యాన్ని ధిక్కరించి పాక్ ప్రధానమంత్రులు పదవిలో కొనసాగలేరని గతంలో అనేకమార్లు రుజువయ్యింది. గతంలో ఎంతో మంది సైన్యాధ్యక్షులు ప్రధానమంత్రులను తొలగించి పాలనా పగ్గాలు చేపట్టారు. అదే సమయంలో ఉగ్రవాద సంస్థలను కాదని స్వతంత్రంగా వ్యవహరించే పరిస్థితి సైన్యానికి కూడా లేదు. సైన్యాన్ని ఉగ్రవాదులు తమ అదుపులో పెట్టుకోగా, ప్రభుత్వాలను సైన్యం తన అదుపులో పెట్టుకుంటోంది. భారత్ ఉగ్రవాదులను మట్టుపెడితే వారికి పాక్ సైన్యం నివాళి అర్పించిందంటేనే ఎంతగా వారు దుస్థితిలో ఉన్నారో అర్థం చేసుకోవచ్చు. ఉగ్రవాదులను కట్టడి చేయాలనుకునే ప్రభుత్వాలకు మనుగడ ఉండదు. కొన్ని దశాబ్దాలుగా పాకిస్థాన్‌లో ఇదే పరిస్థితి ఉంది. ఫలితంగా పాకిస్థాన్ అన్ని విధాలుగా నష్టపోతోంది. ఆ దేశం ఆర్థికంగా దివాలా అంచున ఉంది. బయటి నుంచి ఆర్థిక సాయం అందని పక్షంలో పాక్ కుప్పకూలిపోతుంది. ఆర్థిక సంక్షోభం ఒకవైపు – అంతర్గత పోరు మరోవైపు ఆ దేశాన్ని కుంగదీస్తున్నప్పటికీ ఉగ్రవాదులు మతపరమైన ఉన్మాదంతో ఊగిపోతున్నారు. మరోవైపు పాకిస్థాన్‌లో దాదాపు 40 శాతం భూ భాగమైన బలూచిస్థాన్ స్వతంత్ర దేశంగా ఏర్పడాలని కోరుకుంటోంది. ఇందుకోసం బలూచీలు సుదీర్ఘ పోరాటం చేస్తున్నారు. ఈ తరుణంలో భారత్‌తో సయోధ్యకుమించిన మార్గం లేదు. అందుకే కాల్పుల విరమణకు పాక్ ముందుకు వచ్చింది. ఇందులో పాక్ రాయబేరమే ఎక్కువ. దానికి అంతర్జాతీయ మద్దతు కావాలి. రుణం కావాలి. అందుకే ట్రంప్ కాళ్లావేళ్లా పడి రుణం కోసం కాల్పుల విరమణకు సిద్దపడింది. అయితే ఇది అక్కడి ఉగ్రవాదులకు, సైన్యానికి రుచించకున్నా తప్పని పరిస్థితి. మన దేశం 1971లో పాకిస్థాన్‌తో యుద్ధం చేసింది. అప్పుడే పాకిస్థాన్ నుంచి బంగ్లాదేశ్ విడిపోయి స్వతంత్ర దేశంగా ఆవిర్భవించింది. మనకు 1947లో స్వాతంత్యం÷–ర వచ్చిన తర్వాత రెండుసార్లు పాకిస్థాన్‌తో, ఒకసారి చైనాతో యుద్ధం చేయాల్సి వచ్చింది. 1971 తర్వాత భారత్–పాక్ మధ్య ఉద్రిక్తతలు ఏర్పడటం, స్వల్ప స్థాయిలో దాడులు చేసుకోవడం మినహా పూర్తి యుద్ధం జరగలేదు

# కమ్మిన్స్ కాకాకు బిగ్ ఛాన్స్ ఇక్కడ పరువు ఎలాగూ పోయింది

ప్రపంచ టెస్ట్ ఛాంపియన్‌షిప్ ఫైనల్స్ గడువు సమీపిస్తోంది. జూన్ 11వ తేదీన లార్డ్స్ వేదికగా ఈ మ్యాచ్ ఆరంభం కానుంది. డిఫెండింగ్ ఛాంపియన్ ఆస్ట్రేలియా.. దక్షిణాఫ్రికాతో తలపడనుంది. డబ్ల్యూటీసీ ఫైనల్స్‌లో అడుగుపెట్టడం దక్షిణాఫ్రికాకు ఇదే తొలిసారి.డబ్ల్యూటీసీ ఫైనల్స్ ఆడబోయే జట్టును క్రికెట్ ఆస్ట్రేలియా కొద్దిసేపటి కిందటే ప్రకటించింది. మొత్తం 15 మంది ప్లేయర్లతో కూడిన టీమ్ ఇది. గత ఏడాది శ్రీలంక, భారత్‌లల్లో పర్యటించిన జట్టునే ఇప్పుడు కూడా కొనసాగించినట్టు కనిపిస్తోంది. ఇందులో పెద్దగా మార్పులేమీ చేయలేదు. శ్రీలంకను 2-1, భారత్‌ను 3-1తో మట్టికరిపించిన టీమ్ అది.సర్జరీ కారణంగా కొంతకాలం పాటు క్రికెట్‌కు దూరంగా ఉంటోన్న కామెరాన్ గ్రీన్‌కు మళ్లీ జట్టులో చోటు దక్కింది. టెస్ట్ స్పెషలిస్ట్ స్పిన్ బౌలర్ మాట్ కుహ్నెమాన్ కూడా జట్టులో పునరాగమనం చేశాడు. బ్రెండన్ డాగెట్‌ను ట్రావెలింగ్ రిజర్వ్‌గా ఎంపిక అయ్యాడు. షెఫీల్డ్ షీల్డ్ ఫైనల్‌లో అదరగొట్టాడు డాగెట్. ప్లేయర్ ఆఫ్ ద మ్యాచ్‌గా నిలిచాడు. దీనితో అతన్ని రిజర్వ్ ప్లేయర్‌గా తీసుకుంది క్రికెట్ ఆస్ట్రేలియా.పాట్ కమిన్స్, జోష్ హేజిల్‌వుడ్ జట్టుకు అందుబాటులోకి వచ్చారు. గాయాల కారణంగా వాళ్లిద్దరూ కూడా శ్రీలంకతో సిరీస్, ఛాంపియన్స్ ట్రోఫీకి దూరంగా ఉన్న విషయం తెలిసిందే. ఈ ఇద్దరూ కూడా వంద శాతం ఫిట్‌నెస్ సాధించారు. ప్రస్తుతం సన్‌రైజర్స్ హైదరాబాద్, రాయల్ ఛాలెంజర్స్ బెంగళూరు తరఫున ఐపీఎల్ 2025 ఆడుతున్నారు.డబ్ల్యూటీసీ ఫైనల్స్‌కు అర్హత సాధించడానికి ఆస్ట్రేలియా మొత్తం ఆడిన ఆరు సిరీస్‌లలో నాలుగింట్లో గెలిచింది. రెండింటిని డ్రా చేసుకుంది. 2023లో ఇంగ్లాండ్‌తో జరిగిన యాషెస్, 2023-24 వెస్టిండీస్ సిరీస్ డ్రా అయింది. అత్యంత కీలకమైన భారత్‌తో సిరీస్‌లో విజయకేతనాన్ని ఎగురవేసింది ఆస్ట్రేలియా. 3-1 తేడాతో టీమిండియాను సొంతగడ్డపై ఓడించింది.దక్షిణాఫ్రికా 12 టెస్టుల్లో 8 విజయాలతో 69.44 పాయింట్ల శాతంతో డబ్ల్యూటీసీ పాయింట్ల పట్టికలో అగ్రస్థానంలో నిలిచింది. ఐసీసీ వరల్డ్ టెస్ట్ ఛాంపియన్‌షిప్ ఫైనల్స్ 2025 చేరిన మొట్టమొదటి జట్టుగా ఆవిర్భవించింది. డబ్ల్యూటీసీ ఫైనల్స్ చేరడం కూడా ఇదే తొలిసారి. సెంచూరియన్ పార్క్ స్టేడియంలో పాకిస్తాన్‌తో తొలి టెస్ట్ మ్యాచ్‌లో ఘన విజయాన్ని సాధించడం ద్వారా ఫైనల్స్‌కు అర్హత సాధించింది. డబ్ల్యూటీసీ ఫైనల్స్ ఆడే ఆస్ట్రేలియా జట్టులో- పాట్ కమిన్స్ (కెప్టెన్), స్కాట్ బోలాండ్, అలెక్స్ కారీ, కామెరాన్ గ్రీన్, జోష్ హేజిల్‌వుడ్, ట్రావిస్ హెడ్, జోష్ ఇంగ్లిస్, ఉస్మాన్ ఖవాజా, సామ్ కొన్‌స్టాస్, మాట్ కుహ్నెమాన్, మార్నస్ లాబుషేన్, నాథన్ లియోన్, స్టీవ్ స్మిత్, మిచెల్ స్టార్క్, బ్యూ వెబ్‌స్టర్ ఉన్నారు.



# బంగారం కొనాలనుకునే వారికి గుడ్‌న్యూస్ తగ్గిన బంగారం ధరలు



ముందెన్నడూ ఊహించని విధంగా బంగారం ధరలు భారీగా తగ్గుతూ వస్తున్నాయి. భారత్, పాకిస్తాన్ యుద్ధం ముందు వరకు బంగారం ఆకాశాన్ని అంటుతూ దూసుకుపోయింది. అయితే, యుద్ధం రావటంతో మార్కెట్‌లో అనిశ్చితి ఏర్పడింది. బంగారం ధరలు తగ్గాయి. లక్ష రూపాయల దగ్గర ట్రేడ్ అయిన స్వచ్ఛమైన బంగారం ఇప్పుడు భారీగా పడిపోయింది. 98 వేల దగ్గర ట్రేడ్ అవుతోంది. యుద్ధం ముగిసి, కాల్పుల విరమణ ఒప్పందం తర్వాత కూడా బంగారం ధరలు దిగజారుతూ ఉన్నాయి. ఈ రోజు బంగారం, వెండి ధరలు ఎలా ఉన్నాయంటే..13వ తేదీనాటి బంగారం ధరలు ఇలా..గుడ్ రిటర్న్స్ వెబ్ సైట్ ప్రకారం.. నిన్న హైదరాబాద్ మహా నగరంలో 10 గ్రాముల స్వచ్ఛమైన 24 క్యారెట్ల బంగారం ధర 96880 దగ్గర ట్రేడ్ అయింది. 10 గ్రాముల 22 క్యారెట్ల బంగారం ధర 88800 దగ్గర ట్రేడ్ అయింది. ఇక, 10 గ్రాముల 18 క్యారెట్ల ధర 72660 దగ్గర ట్రేడ్ అయింది. ఈ రోజు 18,22,24 క్యారెట్ల బంగారంపై 10 రూపాయలు తగ్గింది. 10 గ్రాముల స్వచ్ఛమైన 24 క్యారెట్ల బంగారం ధర ఈ రోజు 96870 దగ్గర ట్రేడ్ అవుతోంది. 10 గ్రాముల 22 క్యారెట్ల బంగారం ధర 88790 దగ్గర ట్రేడ్ అవుతోంది. ఇక, 10 గ్రాముల 18 క్యారెట్ల ధర 72650 దగ్గర ట్రేడ్ అవుతోంది.

నేటి వెండి ధరలు ఎలా ఉన్నాయంటే..పసిడి కంటే వెండి ధరలు నిలకడగా తగ్గుతూ వస్తున్నాయి. బంగారం పెరగటం.. తగ్గటంతో సంబంధం లేకుండా వెండి ధరలు ప్రతీ రోజు తగ్గుతూ వస్తున్నాయి. నిన్న 100 గ్రాముల వెండి ధర 10900 రూపాయల దగ్గర ట్రేడ్ అయింది. కేజీ వెండి ధర 1,09000 దగ్గర ట్రేడ్ అయింది. ఈ రోజు 100 గ్రాములపై 10 రూపాయలు, కేజీపై 100 రూపాయలు తగ్గింది. ఈ రోజు 100 గ్రాముల వెండి ధర 10890 దగ్గర ట్రేడ్ అవుతోంది. కేజీ బంగారం ధర 1,08900 దగ్గర ట్రేడ్ అవుతోంది.

# భారత్‌లో స్మార్ట్‌ఫోన్ అమ్మకాలలో వివో అగ్రస్థానం

భారతదేశంలో స్మార్ట్‌ఫోన్ అమ్మకాలలో కొన్ని ఫోన్లు అగ్రస్థానంలో ఉన్నాయి. సైబర్ మీడియా రీసెర్చ్ విడుదల చేసిన కొత్త నివేదిక ప్రకారం.. 2025 మొదటి త్రైమాసికంలో జనవరి నుండి ఏప్రిల్ వరకు భారత స్మార్ట్‌ఫోన్ మార్కెట్‌లో అమ్మకాలు 7 శాతం తగ్గాయి. మొదటి త్రైమాసికంలో స్మార్ట్‌ఫోన్ అమ్మకాలు తగ్గినప్పటికీ, రూ.25,000 పైగా ధర ఉన్న స్మార్ట్‌ఫోన్‌లు కూడా తక్కువ వృద్ధిని చూశాయి. అదే సమయంలో రూ. రూ.7,000 నుంచి రూ.25,000 మధ్య ధర ఉన్న ఫోన్లు 6 శాతం తగ్గాయి. 5జీ స్మార్ట్‌ఫోన్‌ల అమ్మకాలు పెరుగుతున్నాయి:2025 మొదటి త్రైమాసికంలో మొత్తం స్మార్ట్‌ఫోన్ అమ్మకాలలో స్మార్ట్‌ఫోన్‌లు 86 శాతం వాటాను కలిగి ఉన్నాయి. 8,000 నుండి రూ. 13,000 వరకు ఉన్న ఫోన్లు 100 శాతం అమ్మకాలు సాధించాయి స్మార్ట్‌ఫోన్ విభాగంలో రూ.10,000 లోపు అమ్మకాలు గణనీయంగా పెరిగాయని సైబర్ మీడియా రీసెర్చ్ తెలిపింది. సరసమైన ధరలకు స్మార్ట్‌ఫోన్‌లను కొనుగోలు చేయడానికి వినియోగదారులు పెరుగుతున్నారని అధ్యయనం చూపిస్తుంది. షియోమి, పోకో, మోటరోలా, రియల్‌మీ వంటి బ్రాండ్లు ఈ వృద్ధికి నాయకత్వం వహిస్తున్నాయని తెలిపింది. 2025 మొదటి త్రైమాసికంలో భారతదేశంలో ప్రముఖ స్మార్ట్‌ఫోన్ బ్రాండ్‌గా వివో అవతరించిందని సైబర్ మీడియా రీసెర్చ్ వెల్లడించింది. ఈ కంపెనీ స్టాక్ మార్కెట్‌లో 20 శాతం వృద్ధి చెందింది. వివో ఐదు మోడళ్లు, అవి ఫోన్ అమ్మకాలలో 43 శాతం వాటాను కలిగి ఉండటం గమనార్హం. దీని తరువాత శామ్సంగ్ స్టాక్ మార్కెట్లో 18 శాతం వృద్ధితో రెండవ స్థానంలో ఉంది. కానీ దాని ప్రసిద్ధ స్మార్ట్‌ఫోన్‌ల అమ్మకాలు 13 శాతం తగ్గాయి. ఈ విషయంలో షియోమికి పెద్ద ఎదురుదెబ్బ తగిలింది. గత సంవత్సరంతో పోలిస్తే స్టాక్ మార్కెట్లో దాని షేర్లు 13 శాతం తగ్గాయి. కంపెనీ స్మార్ట్‌ఫోన్‌ల అమ్మకాలు తగ్గడం వల్ల ఈ క్షీణతను ఎదుర్కొంది. అలాగే ఈ నివేదిక ప్రకారం, ఫోన్‌ల అమ్మకాలు గణనీయంగా తగ్గాయి. మొబైల్స్ 17 శాతం తగ్గుదల చూశాయి. మొబైల్స్ కూడా 66 శాతం తగ్గుదల చూసాయి.దీని ఆధారంగా సాంకేతికత అభివృద్ధి, వినియోగదారుల ప్రాధాన్యతల ఆధారంగాస్మార్ట్‌ఫోన్‌ల అమ్మకాలు పెరుగుతున్నాయి. భవిష్యత్తులో ఇది మరింత పెరుగుతుందని, ఇప్పటికే మార్కెట్లో ఉన్న లేదని అధ్యయనం చెబుతోంది.



# రియల్ ఎస్టేట్ లో పెట్టుబడి పెడుతున్నారా



నేడు భూమి విలువ రోజురోజుకూ పెరుగుతోంది. ప్రతి ఒక్కరూ వాటిని కొనడానికి ప్రాధాన్యమిస్తున్నారు. దీంతో రియల్ ఎస్టేట్ రంగం ప్రగతి పథంలో దూసుకుపోతోంది. అయితే ఈ రంగంలో పెట్టుబడి పెట్టే ముందు కొన్ని అంశాలను గమనించాలని నిపుణులు సూచిస్తున్నారు. అవి ఏమిటో ఇప్పుడు తెలుసుకుందాం.ప్రాథమిక అంశాలురియల్ ఎస్టేట్ సంస్థలు తమ భూములను కొనుగోలు చేసేవారికి అనేక ఆకర్షణీయమైన డిస్కౌంట్లు ప్రకటిస్తాయి. వాటినే కాకుండా కొన్ని ప్రాథమిక అంశాలపై కొనుగోలుదారులు అవగాహన పెంచుకోవాలి. భూమి ఉన్న ప్రదేశం, డెవలపర్ ట్రాక్ రికార్డు, ఆమోదాలు, మౌలిక సదుపాయాలు, ఇతర ప్రాంతాలతో కనెక్టివిటీ వంటి వాటిని చూసుకోవాలి. ప్రస్తుతం టైర్ 2 నగరాల్లో రియల్ ఎస్టేట్ జోరుగా సాగుతోంది. తక్కువ ఈఎంఐలు, నో కాస్ట్ డౌన్ పేమెంట్, ప్రత్యేక పండగ పథకాలను అందజేస్తున్నారు.పన్ను ప్రయోజనాలు రియల్ ఎస్టేట్ లోని పెట్టుబడులకు ఆదాయపు పన్ను చట్టం ప్రకారం కొన్ని మినహాయింపులు లభిస్తాయి. హౌసింగ్ రుణాలు, వాటి చెల్లింపులను కొనుగోలుదారులు క్లెయిమ్ చేసుకోవచ్చు. ఆర్థిక సంవత్సరం ప్రారంభంలో పెట్టుబడి పెడితే రాబోయే ఏడాదిలో పన్ను ప్రయోజనం పొందవచ్చు. అవగాహనరియల్ ఎస్టేట్ లో పెట్టుబడులు, ఇళ్ల కొనుగోలు తదితర విషయాలపై వెంటనే నిర్ణయం తీసుకోకూడదు. ముందుగా మార్కెట్ పరిస్థితులు, భూమి విలువ తదితర వాటిపై అవగాహన పెంచుకోవాలి. చాలా రియల్ ఎస్టేట్ కంపెనీలు తమ కస్టమర్లకు బంగారు నాణేలు తదితర వివిధ బహుమతులు అందిస్తాయి. అయితే భూమి విలువ, అనుకూలమైన ఫైనాన్సింగ్ నిబంధనలు, పారదర్శక లావాదేవీలు తదితర వాటిని కొనుగోలుదారులు ఆలోచించాలి. తాము పెట్టిన పెట్టుబడికి దీర్ఘకాలంలో మంచి రాబడి వచ్చేలా ఉండాలి. కాబట్టి భూమి విలువ, మార్కెట్ పరిస్థితులపై అవగాహన పెట్టుబడి పెట్టాలి.

# డాక్యుమెంట్లు దాచుకోవడానికీ ఓ లాకర్..ఆశ్చర్యకర ఉపయోగాలివే




నేటి కాలంలో ప్రతి పనికీ ఆధార్, పాన్ కార్డులు, బ్యాంకు ఖాతాలు, ఇతర పత్రాలు అవసరమవుతూ ఉంటాయి. ఇవి లేకపోతే పనులు ముందుకు జరగవు. అలాగని వీటిని ఎప్పుడూ మనతో ఉంచుకోలేం. ఈ నేపథ్యంలో ప్రజల సౌకర్యార్థం డిజిలాకర్ వచ్చింది. డిజిటల్ ఇండియా ప్రచారంలో భాగంగా దీన్ని తీసుకువచ్చారు. మన విలువైన పత్రాలను దీనిలో దాచుకోవచ్చు. అవసరమైనప్పుడు చక్కగా వినియోగించుకో వచ్చు. డాక్యుమెంట్లను భౌతికంగా మనతో ఉంచుకోవాల్సిన అవసరం ఉండదు.డిజిలాకర్ ను ఒక రకంగా డిజిటల్ డాక్యుమెంట్ వాలెట్ అని చెప్పవచ్చు. ప్రభుత్వం, ఇతర సంస్థలు జారీ చేసిన అన్ని రకాల పత్రాలను డిజిటల్ రూపంలో దీనిలో నిల్వ చేసుకోవచ్చు. వినియోగదారులు తమ ఆధార్ నంబర్ తో దీనిలోకి లాగిన్ అవ్వాలి. అప్పుడు వారికి ప్రత్యేక క్లౌడ్ నిల్వ స్థలం లభిస్తుంది. దీనిలో నిల్వ చేసిన పత్రాలను అసలు భౌతిక పత్రాలతో సమానంగా పరిగణిస్తారు. డిజిలాకర్ లో భాగంగా ప్రతి పౌరుడు ఒక జీబీ వరకూ స్టోరేజీని పొందుతాడు. ప్రభుత్వ విభాగాలు డిజిటల్ గా జారీ చేసే పత్రాలను దీనిలో దాచుకోవచ్చు. లేకపోతే పత్రాలను స్కానింగ్ చేసి, లేదా పీడీఎఫ్ విధానంలో నిల్వ చేసుకోవచ్చు. వెబ్ సైట్ లేదా మొబైల్ యాప్ ద్వారా డిజిలాకర్ ను వినియోగించుకునే అవకాశం ఉంది. ఎక్కడైనా పత్రాలను సమర్పించాల్సి వచ్చినప్పుడు వాటికి సంబంధించిన యూఆర్ఎల్ లింక్ ను అందజేయవచ్చు. ఆధార్ కార్డు ఉన్నవారితో పాటు లేనివారు క్షూడా ఈ సేవలను వినియోగించుకునే అవకాశం ఉంది.డిజిలాకర్ లో మనకు వచ్చిన స్టోరేజీలో ఆధార్ కార్డు, పాన్ కార్డు, డ్రైవింగ్ లైసెన్సు, వాహన రిజిస్ట్రేషన్ సర్టిఫికెట్, మార్కుల జాబితాలు, ఆదాయ, కుల సర్టిఫికెట్లు, బీమా పాలసీలు, ఓటరు ఐడీ, పాస్ పోర్టు, యుటిలిటీ బిల్లులను దాచుకోవచ్చు. వీటిలో కొన్ని డిజిటల్ రూపంలో జారీ చేస్తారు. అలా జారీ చేయని వాటిని స్కాన్ చేసి, లేదా పీడీఎఫ్ రూపంలో దాచుకోవచ్చు.

## మరో షాకిచ్చిన విరాట్ కోహ్లీ ఏకంగా దానికి కూడా గుడ్ బై



టీమిండియా స్టార్ క్రికెటర్ విరాట్ కోహ్లీ సంచలన నిర్ణయం తీసుకున్నారు. ఎవరూ ఊహించని విధంగా టెస్ట్ క్రికెట్ నుంచి రిటైర్మెంట్ తీసుకుంటున్నట్టు కోహ్లీ ప్రకటించారు. కోహ్లీ రిటైర్ ఇస్తారని ఎవరూ భావించలేదు. అయితే బీసీసీఐతో విభేదాల వలనే కోహ్లీ రిటైర్ ఇచ్చాడనే ప్రచారం జరుగుతుంది. ఇప్పటికే టీ20లకు వీడ్కోలు పలికిన కోహ్లీ, తాజాగా టెస్ట్ క్రికెట్‌కు కూడా రిటైర్మెంట్ ఇచ్చేశారు. కేవలం వన్డేల్లో మాత్రమే కోహ్లీ కనిపించనున్నాడు. ఇక రిటైర్మెంట్ అనంతరం విరాట్,అనుష్క దంపతులు కీలక నిర్ణయం తీసుకున్నారని తెలుస్తోంది.తమ జీవితంలోని రెండో ఇన్నింగ్స్‌ను లండన్ నగరంలో ప్రారంభించాలని చూస్తున్నారనే ఊహాగానాలు అభిమానుల్లో చర్చనీయాంశంగా మారాయి.భారతదేశంలో విపరీతమైన అభిమానుల తాకిడికి గురయ్యే ఈ జంట, తమ పిల్లలైన వామిక , అకాయ్‌లకు ప్రశాంతమైన జీవితాన్ని అందించాలని కోరుకుంటున్నారట. లండన్‌లో ఇప్పటికే వారికి ఒక ఇల్లు ఉందని, రిటైర్మెంట్ తర్వాత అక్కడే శాశ్వతంగా నివసించాలని భావిస్తున్నారని సన్నిహిత వర్గాలు చెబుతున్నాయి.మైదానంలో తన దూకుడుతో అందరినీ ఆకట్టుకున్న విరాట్, రిటైర్మెంట్ తర్వాత తన కుటుంబానికి ఎక్కువ సమయం కేటాయించాలని అనుకుంటున్నాడు. అనుష్క శర్మ కూడా తన సినీ కెరీర్‌కు కొంత విరామం ఇచ్చి, పిల్లల పెంపకంలో నిమగ్నమై ఉన్నారు. లండన్ నగరం వారికి కావలసిన ప్రైవసీని మరియు ప్రశాంతతను అందిస్తుందని వారు భావిస్తున్నారు. అక్కడ తమ పిల్లలు సాధారణ జీవితాన్ని గడపడానికి అవకాశం ఉంటుందని వారు ఆశిస్తున్నారు.

## టైటిల్ రేసులో ఉన్న బెంగళూరుకు ఏం జరుగుతోంది



ఇప్పటివరకు ఐపీఎల్‌లో పెద్దగా రాణించలేకపోయిన రాయల్ ఛాలెంజర్స్ బెంగళూరు టీమ్ ఈ ఏడాది సీజన్‌లో మాత్రం అద్భుతంగా ఆడుతోంది. రజత్ పటిదార్ సారథ్యంలోని ఆర్సీబీ పాయింట్ల పట్టికలో అగ్రస్థానంలో కొనసాగుతోంది. ఈ సీజన్‌లో టైటిల్ ఫేవరెట్ జట్లలో ఒకటిగా నిలిచింది. అయితే ఆ జట్టును దురదృష్టం వెంటాడుతోంది. ఆ జట్టు వరుస విజయాలు సాధిస్తున్న దశలో భారత్-పాక్ ఉద్రిక్తతల కారణంగా టోర్నీ వాయిదా పడింది.టోర్నమెంట్ త్వరలో తిరిగి ప్రారంభమయ్యే అవకాశం ఉంది. కానీ ఇంతలో, రాయల్ ఛాలెంజర్స్ బెంగళూరుకు వరుస షాక్‌లు తగులుతున్నాయి. ఆ జట్టు కెప్టెన్ రజత్ పటిదార్ చేతి వేలి గాయం కారణంగా ఇబ్బందిపడుతున్నాడు. అతడు మరో మూడు, నాలుగు మ్యాచ్‌లు ఆడే అవకాశం కనిపించడం లేదు. దీంతో జితేష్ శర్మకు నాయకత్వ బాధ్యతలు అప్పగించబోతున్నారు. ఇక, ఆ జట్టు స్టార్ బౌలర్ అయిన జాష్ హాజెల్‌వుడ్ కూడా తిరిగి ఆర్సీబీ తరఫున మైదానంలో దిగే అవకాశాలు లేవు.

ఆస్ట్రేలియాకు చెందిన హాజెల్‌వుడ్ జూన్ 11వ తేదీన దక్షిణాఫ్రికాతో జరిగే ప్రపంచ టెస్ట్ ఛాంపియన్‌షిప్ ఫైనల్ మ్యాచ్‌లో ఆడాల్సి ఉంది. హాజెల్‌వుడ్ ఆస్ట్రేలియాకు కీలక బౌలర్ అనే సంగతి తెలిసిందే. దీంతో అతడు ఆర్సీబీ ఆడే మిగతా మ్యాచ్‌లకు అందుబాటులో ఉండే అవకాశం కనిపించడం లేదు. అతడు ప్రాక్టీస్ సెషన్‌లో పాల్గొనాల్సిన అవకాశం ఉంది. పటిదార్, హాజెల్‌వుడ్ ఆర్సీబీకి కీలక ఆటగాళ్లు అనే సంగతి తెలిసిందే. వీరిద్దరూ దూరమైతే జట్టుపై తీవ్ర ప్రభావం పడడం మాత్రం ఖాయం.

## కావ్య మారన్‌కు బ్యాడ్ న్యూస్..



గతేడాది అద్భుతమైన ఆటతీరుతో అదరొట్టిన సన్‌రైజర్స్ హైదరాబాద్ ఈ ఏడాది దారుణంగా విఫలమైంది. వరుస పరాజయాలతో సతమతమైంది. ఇప్పటివరకు 11 మ్యాచ్‌లు ఆడి కేవలం మూడే విజయాలతో పాయింట్ల పట్టికలో 8వ స్థానంలో ఉంది. ప్లే ఆఫ్స్ అవకాశాలను దాదాపు కోల్పోయింది. పాకిస్తాన్-భారత్ ఉద్రిక్తతల నేపథ్యంలో ఆగిపోయిన ఐపీఎల్ తిరిగి ప్రారంభం కాబోతోంది. ఈనెల 17న బెంగళూరులో లీగ్ పునఃప్రారంభమవుతుంది ఐపీఎల్‌ను వాయిదా వేయడంతో విదేశీ ఆటగాళు తమ తమ స్వదేశాలకు వెళ్లిపోయారు. అయితే కొందరు ఆటగాళ్లు తిరిగి వెనక్కి వచ్చేందుకు రెడీ అవుతున్నారు. కానీ, సన్‌రైజర్స్ జట్టు కీలక ఆటగాళ్లైన ప్యాట్ కమిన్స్, ట్రావిస్ హెడ్ మాత్రం తిరిగి భారత్‌కు రావడం లేదట. సన్‌రైజర్స్ జట్టు కెప్టెన్ అయిన ప్యాట్ కమిన్స్ ఆస్ట్రేలియా టెస్ట్ జట్టుకు కూడా సారథ్యం వహిస్తున్నాడు. జూన్ 11వ తేదీన దక్షిణాఫ్రికా, ఆస్ట్రేలియా మధ్య ప్రపంచ టెస్ట్ ఛాంపియన్ షిప్ ఫైనల్ మొదలు కాబోతోంది.ఆ మ్యాచ్ ప్రాక్టీస్‌లో ప్యాట్ కమిన్స్ జాయిన్ అయ్యాడు. దీంతో అతడు తిరిగి భారత్‌కు రావడం లేదు. మరోవైపు ట్రావిస్ హెడ్ తిరిగి రావడం కూడా అనుమానమే.

ఇక, హైదరాబాద్ జట్టు హోమ్ గ్రౌండ్‌లో ఆడే అవకాశాన్ని కూడా కోల్పోయింది. ఐపీఎల్‌లో మిగిలిన 17 మ్యాచ్‌లను ఆరు వేదికల్లోనే నిర్వహించబోతున్నారు. మే 25న హైదరాబాద్‌లో జరగాల్సిన మ్యాచ్ వేదికను ఢిల్లీకి మార్చారు. దీంతో కావ్యమారన్‌కు షాక్‌లు మీద షాక్‌లు తగులుతున్నాయంటూ నెటిజన్లు కామెంట్లు చేస్తున్నారు.

## రిటైర్‌మెంట్ తర్వాత ఆధ్యాత్మిక గురువుతో కోహ్లీ..




టెస్ట్ క్రికెట్ నుంచి తప్పుకున్నాడు భారత స్టార్ బ్యాటర్ విరాట్ కోహ్లీ. తన రిటైర్‌మెంట్ మీద సోమవారం ప్రకటన చేశాడు. 14 ఏళ్ల సుదీర్ఘ కెరీర్‌కు గుడ్‌బై చెప్పిన విరాట్.. ఇక మీదట వన్డేల్లో మాత్రమే కనిపించనున్నాడు. ఇప్పటికే టీ20ల నుంచి వైదొలిగిన అతడు.. ఐపీఎల్ రూపంలో ఏడాదికోసారి ఆ ఫార్మాట్‌లోనూ అలరించనున్నాడు. రిటైర్‌మెంట్ తీసుకుంటున్నట్లు ప్రకటించిన తర్వాతి రోజే సతీమణి అనుష్క శర్మతో కలసి ఒక ఆధ్మాత్మిక కేంద్రాన్ని సందర్శించాడు కోహ్లీ. ఉత్తర్‌ప్రదేశ్‌లోని బృందావన్ ధామ్‌కు వెళ్లారీ స్టార్ కపుల్. అక్కడ ప్రముఖ ఆధ్యాత్మిక గురువు ప్రేమానంద్ మహారాజ్ ఆశీస్సులు తీసుకున్నారు. రిటైర్‌మెంట్ ప్రకటన తర్వాత పాల్గొన్న తొలి వ్యక్తిగత కార్యక్రమం కావడంతో అంతా దీని గురించి చర్చించుకుంటున్నారు. ఎవరీ ఆధ్యాత్మిక గురువు అంటూ తెలుసుకునేందుకు ప్రయత్నిస్తున్నారు.ప్రముఖ ఆధ్యాత్మిక గురువుల్లో ఒకరైన ప్రేమానంద్ మహారాజ్.. ధర్మం, భక్తి, ఆధ్యాత్మికత, జీవితం.. ఇలా క్లిష్టమైన అంశాలను ఎంతో సరళంగా, అందరికీ అర్థమయ్యేలా చెబుతుంటారు. ఎలా బతకాలి, సమస్యల్ని ఎలా అధిగమించాలో వివరిస్తుంటారు. భజనలు, ఉపన్యాసాలతో ఎంతో మంది భక్తులకు ఆయన చేరువయ్యారు. భక్తి, ఆధ్యాత్మిక మార్గంలో ఉన్నవారు తమ సమస్యలకు పరిష్కారాల కోసం ప్రేమానంద్‌ను కలుస్తుంటారు. గత మూడ్నాలుగేళ్లుగా ఫామ్ లేమితో ఇబ్బంది పడిన కోహ్లీ పలుమార్లు ఈ గురువును కలిశాడు.

న్యూస్-9
సామాజిక అవసరం...సామాన్యుడి ఆయుధం
తెలుగు దినపత్రిక
www.news9-india.com
news9.india News9India_ news9telugudaily

## అతనితో బెడ్‌రూమ్ సీక్రెట్ రివీల్ చేసిన తెలుగు హీరో భార్య



టాలీవుడ్ దంపతుల్లో హీరో వరుణ్ సందేశ్, వితికా షేర్ కూడా ఒకరు. ఈ జంట ప్రేమించి పెళ్లి చేసుకున్నారు.వరుణ్ సందేశ్, వితికా షేరు నటించిన సినిమా "పడ్డానండి ప్రేమలో మరి". ఇది 2015లో విడుదలయింది. ఈ సినిమా వీరిద్దరికీ తొలి సినిమా కాగా, ఈ సినిమా ద్వారానే వీరిద్దరూ ప్రేమలో పడ్డారు. ఆ తర్వాత తమ ప్రేమను వివాహంగా మల్చుకున్నారు.హ్యాపీ డేస్ సినిమాతో మంచి గుర్తింపు దక్కించుకున్న వరుణ్ సందేశ్ , ఆ తర్వాత అదే జోరును కొనసాగించలేకపోయాడు.కానీ అతని భార్య వితికా మాత్రం సోషల్ మీడియాలో యాక్టివ్‌గా ఉంటూ అన్ని విషయాలను తెలియజేస్తూ ఉంటుంది. ఇక ఈ జంట తెలుగు బిగ్‌బాస్ షోలో కూడా సందడి చేశారు.వితికా షేరు తాజాగా తన వ్యక్తిగత విషయాలను సోషల్ మీడియా ద్వారా పంచుకున్నారు. ముఖ్యంగా తన బెడ్‌రూమ్ విషయాలను అభిమానులకు షేర్ చేశారామె. చాలా కాలంగా బెడ్‌రూమ్ విషయాలు చెప్పాలనుకున్నానని, ఇప్పుడే సమయం కుదిరిందని తెలిపింది. వారి బెడ్‌రూమ్ వారికి చాలా ప్రత్యేకమైనదని పేర్కొంది. బెడ్‌రూమ్‌ను ఎలా రీమోడల్ చేయాలనే దానిపై భర్త వరుణ్ సందేష్ సలహాలు కూడా తీసుకున్నానని చెప్పింది. వరుణ్ స్నేహితులతో గోవా వెళ్లడంతో, ఇది సరైన సమయమని భావించి వీడియో చేస్తున్నట్లు తెలిపింది.ఇంతకుముందు లివింగ్ రూమ్, పూజ రూమ్, బుక్ కార్నర్ చూపించానని, ఇప్పుడు బెడ్‌రూమ్ చూపిస్తున్నానని చెప్పింది. పెళ్లయ్యాక తను అడుగుపెట్టిన ఇల్లు ఇదేనని తెలిపింది.ప్రస్తుతం బెడ్‌రూమ్‌ను రీమోడలింగ్ చేస్తున్నానని వెల్లడించింది. రీమోడలింగ్‌కు కావలసిన వస్తువుల కోసం తనే స్వయంగా షాపింగ్ చేస్తోంది. భర్తకు చెట్లంటే ఇష్టమని, అందుకే మొక్కలు కొనడానికి వెళ్లింది.

## బాలీవుడ్ లో మరో బంపర్ ఆఫర్ కొట్టేసిన యంగ్ బ్యూటీ శ్రీలీల..



యంగ్ బ్యూటీ శ్రీలీల.. టాలీవుడ్ సెన్సేషన్ గా మారింది. హిట్స్, ఫ్లాప్స్ తో సంబంధం లేకుండా వరుస సినిమాలతో దూసుకుపోతుంది ఈ భామ. పుష్ప 2 సినిమాలో కిస్సిక్ సాంగ్ తో సూపర్ క్రేజ్ తెచ్చుకుంది ఈ భామ. తెలుగు, తమిళ్ సినిమాలతోనే కాకుండా ప్రస్తుతం బాలీవుడ్ లో కూడా కార్తీక్ ఆర్యన్ తో కలిసి ఒక సినిమాలో నటిస్తుంది. హీరోయిన్ గానే కాకుండా ఐటం సాంగ్స్ తో కూడా అదరగొడుతుంది ఈ ముద్దుగుమ్మ. తెలుగులో చివరగా రాబిన్ హుడ్ సినిమాతో ప్రేక్షకులను పలకరించిన ఈ భామ.. ఇప్పుడు బాలీవుడ్ లో మరో ఆఫర్ దక్కించుకుందని సినీ వర్గాల్లో టాక్ నడుస్తోంది.బాలీవుడ్ లో నడుస్తున్న టాక్ ప్రకారం.. జాన్ అబ్రహాం, అభిషేక్ బచ్చన్ నటించిన 'దోస్తానా' పెద్ద హిట్టే అయింది. కరణ్ జోహార్ నిర్మాతగా ధర్మ ప్రొడక్షన్స్ ఈ చిత్రాన్ని నిర్మించింది. ఇప్పుడు దీనికి సీక్వెల్ గా దోస్తానా-2 తెరకెక్కించబోతున్నారు. ఆ చిత్రంలో శ్రీలీల ఫిక్స్ అయినట్టు తెలుస్తోంది. అయితే కార్తీక్ ఆర్యన్, 'కిల్' ఫేమ్ లక్ష్య, జాన్వీ కపూర్‌లతో.. ఈ సీక్వెల్ తెరకెక్కించాలని ప్లాన్ చేశారట.కానీ ఇప్పుడు కార్తీక్ స్థానంలో విక్రాంత్ మాసే, జాన్వీ స్థానంలో శ్రీలీలను ఎంపిక చేసినట్టు గుసగుసలు వినిపిస్తున్నాయి. అద్వైత్ చౌహాన్ దర్శకత్వంలో ఈ చిత్రం రాబోతున్నట్టు తెలుస్తోంది. అయితే ఈ సినిమాను డైరెక్ట్ గా ఓటీటీలో రిలీజ్ చేయాలని కరణ్ జోహార్ భావిస్తున్నారట. మరోవైపు శ్రీలీల ప్రస్తుతం తెలుగులో రవితేజతో ఓ సినిమా చేస్తుంది. అలాగే మరో రెండు ప్రాజెక్టులలో నటిస్తూ బిజీగా ఉంది. అటు తమిళ్ లో కూడా రెండు సినిమాల్లో నటిస్తుంది. అంతే కాకుండా రామ్ చరణ్ పెద్ది సినిమాలో ఐటం సాంగ్ లో నటించబోతున్నట్టు టాక్ వినిపిస్తుంది. ప్పెన ఫేమ్ బుచ్చిబాబు సానా దర్శకత్వంలో ఈ మూవీ తెరకెక్కుతోంది. ఈ చిత్రంలో జాన్వీ కపూర్ హీరోయిన్ గా నటిస్తుండగా.. జగపతిబాబు, కన్నడ స్టార్ శివ రాజ్‌కుమార్, బాలీవుడ్ నటుడు దివ్యేందు సహా పలువురు నటులు కీలక పాత్రల్లో నటిస్తున్నారు. వ్రిద్ధి సినిమాస్, సుకుమార్ రైటింగ్స్, మైత్రీ మూవీ మేకర్స్ బ్యానర్లు సంయుక్తంగా భారీ బడ్జెట్‌తో నిర్మిస్తున్నాయి.

## ఆ సినిమాను 14 ఏళ్ల పాటు షూట్ చేశారా.. బడ్జెట్ ఎన్ని కోట్లంటే




కాలానుగుణంగా చిత్రపరిశ్రమ ఎన్నో మార్పులు చవిచూస్తూ, సాంకేతికత, బడ్జెట్, కథానికల పరంగా వేగంగా అభివృద్ధి చెందుతోంది. నేడు ఇండియన్ సినిమాలు అంతర్జాతీయంగా కూడా విశేష గుర్తింపు పొందుతున్నాయి. విదేశాల్లోనూ మన చిత్రాలు భారీ కలెక్షన్లు సాధిస్తున్నాయి. అయినప్పటికీ, గతంలో తీసిన కొన్ని సినిమాలు ఇప్పటికీ ప్రేక్షకుల మనసుల్లో చెరగని ముద్ర వేసేలా నిలిచిపోయాయి. ఇప్పట్లో 5,6 సంవత్సరాల సమయంలో ఒక సినిమాను తెరకెక్కించడం చాలా పెద్ద విషయంగా మారింది. కానీ అప్పట్లో ఒక సినిమా షూటింగ్ పూర్తి కావడానికి 14 ఏళ్లు పట్టింది అంటే నమ్ముతారా..ఆశ్చర్యంగా ఉన్నప్పటికీ ఇది నిజం. ఆ సినిమా పేరు 'మొఘల్-ఏ-ఆజం'. కె. అసీఫ్ ఈ సినిమాకు దర్శకత్వం వహించగా యాక్టర్ దిలీప్ కుమార్ హీరోగా, మధుబాల హీరోయిన్ గా నటించారు. నేటి తరానికి ఇది ఒక కల్ట్ క్లాసికల్ అని చెప్పొచ్చు. ఈ సినిమా షూటింగ్ 1944లో ప్రారంభమై చివరికి 1960లో విడుదలై, భారతీయ సినిమా చరిత్రలో సువర్ణాక్షరాలతో లిఖించబడే స్థాయికి చేరుకుంది. ఆ కాలంలోనే సినిమా బడ్జెట్ రూ.1.5 కోట్లు కాగా, ఇది నేటి విలువల్లో దాదాపు రూ.300 కోట్లకు సమానం. అలాంటి బడ్జెట్‌తో, అంచనాలు మించి రూపొందిన సినిమా ఇది.ఈ చిత్రానికి సంగీత దర్శకుడిగా పనిచేసిన నౌషాద్ సంగీత ప్రియుల మనసుల్లో ఓ ప్రత్యేక స్థానం ఏర్పరచుకున్నారు. ముఖ్యంగా 'ప్యార్ కియా తో డర్నా క్యా' పాట కోసం అప్పట్లోనే రూ.10 లక్షలు ఖర్చు చేశారు. ఇప్పటి లెక్కల్లో చెప్పాలంటే దాదాపు రూ.50-100 కోట్లకు సమానం.

## మరో శుభవార్త చెప్పిన లావణ్య త్రిపాఠి



వైవిధ్యమైన పాత్రలతో తనకంటూ ఓ ప్రత్యేకమైన గుర్తింపు సంపాదించుకున్న టాలెంటెడ్ హీరోయిన్ లావణ్య త్రిపాఠి మరోసారి ప్రేక్షకులను అలరించేందుకు సిద్ధమవుతున్నారు. ఈసారి ఆమె మలయాళ యంగ్ అండ్ ప్రామిసింగ్ నటుడు దేవ్ మోహన్‌తో జోడీ కట్టనున్నారు. వీరిద్దరూ ప్రధాన పాత్రల్లో నటిస్తున్న చిత్రం పేరు 'సతీ లీలావతి'. ప్రముఖ నిర్మాణ సంస్థ ఆనంది ఆర్ట్స్ ఈ చిత్రాన్ని సమర్పిస్తుండగా, దుర్గాదేవి పిక్చర్స్ బ్యానర్‌పై నిర్మాత నాగమోహన్ ఎంతో ప్రతిష్టాత్మకంగా నిర్మిస్తున్నారు.ఈ చిత్రానికి దర్శకత్వం వహిస్తున్నారు తాతినేని సత్య. ఆయన ఇదివరకు 'భీమిలీ కబడ్డీ జట్టు', 'ఎస్.ఎం.ఎస్(శివ మనసులో శృతి)' వంటి విభిన్నమైన చిత్రాలను తెరకెక్కించి తనదైన ముద్ర వేశారు. ఇప్పుడు మరోసారి ఆసక్తికరమైన కథాంశంతో ప్రేక్షకుల ముందుకు రానున్నారు. 'సతీ లీలావతి' చిత్రం భార్యాభర్తల మధ్య ఉండే స్వచ్ఛమైన ప్రేమానుబంధాలను హృద్యంగా చూపించనుందని తెలుస్తోంది. అంతేకాకుండా, సినిమాలో కావాల్సినంత ఎంటర్‌టైన్‌మెంట్‌తో పాటు, ప్రేక్షకులను కదిలించే ఎమోషనల్ అంశాలు కూడా ఉండబోతున్నాయని చిత్ర యూనిట్ చెబుతోంది.ప్రస్తుతం ఈ సినిమా చిత్రీకరణ తుది దశకు చేరుకుంది. దాదాపుగా షూటింగ్ పూర్తయింది. మరోవైపు, సినిమాకు సంబంధించిన పోస్ట్ ప్రొడక్షన్ పనులు శరవేగంగా జరుగుతున్నాయి. ఇందులో భాగంగా డబ్బింగ్ కార్యక్రమాలు కూడా ప్రారంభమయ్యాయి. మేకర్స్ అనుకున్న ప్రణాళిక ప్రకారం సినిమా పనులను వేగంగా పూర్తి చేస్తున్నారు. వీలైనంత త్వరగా చిత్రీకరణ ముగించి, వచ్చే సమ్మర్‌లో ప్రేక్షకులకు మంచి కానుకగా ఈ సినిమాను విడుదల చేయాలని నిర్మాతలు సన్నాహాలు చేస్తున్నారు. లావణ్య త్రిపాఠి తన కెరీర్‌లో ఎప్పుడూ భిన్నమైన పాత్రలను ఎంచుకుంటూ వస్తున్నారు. 'అందాల రాక్షసి' నుండి మొదలుకొని ఇప్పటివరకు ఆమె పోషించిన ప్రతి పాత్రలోనూ ఒక ప్రత్యేకత కనిపిస్తుంది. మలయాళంలో తనకంటూ ఒక గుర్తింపు తెచ్చుకున్న దేవ్ మోహన్‌తో ఆమె జోడీ కట్టడం ఈ సినిమాపై మరింత ఆసక్తిని పెంచుతోంది. వీరిద్దరి మధ్య కెమిస్ట్రీ ఎలా ఉండబోతుందో చూడటానికి ప్రేక్షకులు ఎంతో ఆతృతగా ఎదురుచూస్తున్నారు.

## పూరీ విజయ్ సేతుపతి మూవీలో ఛాన్స్ కొట్టేసిన నిహారిక



టాలీవుడ్ డైరెక్టర్ పూరీ జగన్నాథ్ - కోలీవుడ్ హీరో విజయ్ సేతుపతి కాంబినేషన్ లో ఓ సినిమా తెరకెక్కనున్న విషయం తెలిసిందే. పూరి కనెక్ట్స్ బ్యానర్ పై పూరీ జగన్నాథ్, ఛార్మి ఈ చిత్రాన్ని నిర్మిస్తున్నారు. ప్రస్తుతం ఈ సినిమాలో క్యాస్టింగ్‌ను ఫైనల్ చేసే పనిలో ఉన్నారు పూరీ. ఇక ఇప్పటికే ఈ మూవీలో సీనియర్ నటి టబు నటిస్తున్నట్టు అనౌన్స్ చేశారు. అల్లు అర్జున్ 'అల వైకుంఠపురములో' తర్వాత ఏ తెలుగు సినిమాను ఒప్పుకోని టబు.. ఈ చిత్రానికి గ్రీన్ సిగ్నల్ ఇవ్వడంతో పూరీ ఈసారి గట్టిగానే ప్లాన్ చేసినట్టు తెలుస్తోంది.అలానే ఈ మూవీలో ప్రముఖ కన్నడ నటుడు దునియా విజయ్ నటిస్తున్నట్టు కూడా అనౌన్స్ చేశారు. గతంలో నందమూరి బాలకృష్ణ హీరోగా గోపిచంద్ మలినేని దర్శకత్వంలో వచ్చిన వీరసింహ రెడ్డి సినిమాతో నటించారు విజయ్. ఇక వీరితో పాటు బాలీవుడ్ హాట్ బ్యూటీ రాధిక ఆప్టే కూడా నటిస్తుందని వార్తలు వస్తున్నాయి. ఈ క్రమంలోనే ఈ చిత్రంలో ప్రముఖ సోషల్ మీడియా ఇన్ఫ్లుఎన్సర్ నటించనున్నట్టు సినీ వర్గాల్లో టాక్ నడుస్తోంది.ఇన్ స్టాగ్రామ్ లో తనకంటూ ఓ ప్రత్యేక గుర్తింపు తెచ్చుకున్న ఇన్ఫ్లుయెన్సర్ నిహారిక %చీవీ% గురించి కొత్తగా పరిచయం చేయాల్సిన అవసరం లేదు. కంటెంట్ క్రియేటర్ గా ఆమె వీడియోస్ కి సపరేట్ ఫ్యాన్ బేస్ ఉంది. రీసెంట్ గానే వైభవ్ హీరోగా నటించిన " పెరుసు "చిత్రంలో నిహారిక హీరోయిన్ గా నటించింది. అలానే తెలుగులో కూడా ఓ చిత్రంలో హీరోయిన్ గా నటిస్తోంది ఈమె.

## ముద్దుగుమ్మ కాదు బొద్దుగుమ్మ ఈ హీరోయిన్ ఎవరో గుర్తు పట్టారా



తెలుగు యాంకర్స్‌లో శ్రీముఖి కూడా ఒకరు. హీరోయిన్ అవుదామని ఇండస్ట్రీలో అడుగుపెట్టిన శ్రీముఖి.. తొలుత కొన్ని సినిమాల్లో హీరోయిన్‌గా నటించింది. ప్రేమ ఇష్క్ కాదల్,చంద్రిక,ధనలక్ష్మి తలుపు తడితే,ఆంధ్రా పోరి ,సవిత్రి ,బాబు బాగా బిజీ ,కుటుంబ కథా చిత్రం,క్రేజీ అంకుల్స్ వంటి సినిమాల్లో శ్రీముఖి హీరోయిన్‌గా నటించింది. జులాయి సినిమాలో అల్లు అర్జున్ చెల్లెలుగా నటించి మంచి గుర్తింపు దక్కించుకుంది. దర్శకుడు త్రివిక్రమ్ ఇచ్చిన సూచనలో బుల్లితెరపై ఎంట్రీ ఇచ్చింది ఈ హాట్ బ్యూటీ. వెండితెర కన్నా బుల్లితెరపై శ్రీముఖి సూపర్ హిట్ అయింది. పలు షోలకు హోస్ట్‌గా వ్యవహరిస్తూ అతి తక్కువ కాలంలోనే ఇండస్ట్రీలో తనకంటూ ప్రత్యేక గుర్తింపు ప్రత్యేక గుర్తింపు తెచ్చుకుంది. యాంకర్స్ కూడా ఇంత గ్లామర్‌గా కనిపిస్తారని శ్రీముఖిని చూస్తే అర్థం అవుతుంది. తనదైన యాంకరింగ్‌తో చాలామంది అభిమానులను సొంతం చేసుకుంది ఈ హాట్ బ్యూటీ. బుల్లితెర మీదన వచ్చిన క్రేజ్‌తో బిగ్‌బాస్ రియాల్టీ షోలో కూడా ఎంట్రీ ఇచ్చింది. బిగ్‌బాస్ విన్నర్ అవుతుందని భావించినప్పటికీ రన్నరప్‌తో సరిపెట్టుకోవాల్సి వచ్చింది.అయితే గత కొంతకాలంగా శ్రీముఖి పెళ్లి గురించి అనేక వార్తలు ప్రచారంలోకి వచ్చాయి.ఆ మధ్య యాంకర్ ప్రదీప్‌తో శ్రీముఖి ప్రేమలో ఉందని.. త్వరలోనే వీరిద్దరు పెళ్లి చేసుకోబోతున్నారనే వార్త సోషల్ మీడియాలో బాగా వైరల్ అయింది. అలాంటిది ఏమీ లేదని..తామిద్దరం మంచి స్నేహితులం మాత్రమే అని ప్రదీప్, శ్రీముఖి ఇద్దరూ దీనిపై వివరణ ఇచ్చారు. ఇదిలా ఉంటే శ్రీముఖి సోషల్ మీడియా యమ యాక్టివ్‌గా ఉంటోంది. శ్రీముఖికి సోషల్ మీడియాలో ఫ్యాన్స్ ఫాలోయింగ్ ఎక్కువగానే ఉంది.తన వ్యక్తిగత విషయాలతో పాటు, తన షోలకు సంబంధించిన అప్డేట్స్‌ను సోషల్ మీడియాలో పోస్ట్ చేస్తుంటుంది.

ఇదిలా ఉంటే తాజాగా శ్రీముఖికి సంబంధించిన కొన్ని ఫొటోలు నెట్టింట వైరల్‌గా మారాయి. శ్రీముఖి పదో తరగతి చదువుతున్న సమయంలో దిగిన ఫొటోలను ఓ షోలో ప్రదర్శించారు. ఆ సమయంలో శ్రీముఖి చాలా లావుగా కనిపించింది. దీనిపై శ్రీముఖి మాట్లాడుతూ.. తాను అప్పట్లో 100 కేజీలకు పైగానే బరువు ఉన్నానని చెప్పి షాకిచ్చింది. రెండు బిర్యానీలను ఈజీగా తినేదాన్ని అని శ్రీముఖి చెప్పుకొచ్చింది. ఆ తర్వాత సినిమాల్లోకి రావాలనే ఆసక్తితో బరువు తగ్గానని శ్రీముఖి తెలిపింది. ప్రస్తుతం శ్రీముఖి లావుగా ఉన్న ఫొటోలు నెట్టింట వైరల్‌గా మారాయి.

## దరిద్రం అంటే ఈ సినిమాదే..ఒక్కసారి కాదు.. ఏకంగా మూడుసార్లు డిజాస్టర్‌లు



సినీ ఇండస్ట్రీలో సెంటిమెంట్‌లకు అధిక ప్రాధాన్యత ఉంటుందనే విషయం తెలిసిందే. ఫ్లాప్ దర్శకుడితో, ఫ్లాప్ హీరోయిన్‌తో సినిమాలు చేయడానికి ఎవరూ పెద్దగా ఆసక్తి చూపించరు. అలాగే హి సినిమా టైటిళ్లనే ఎక్కువగా రిపీట్ చేస్తుంటారు. కానీ ఓ సినిమా టైటిల్‌తో ఏకంగా మూడు సినిమాలు వచ్చాయి. విచిత్రం ఏమిటంటే , ఆ మూడు సినిమాలు కూడా బాక్సాఫీస్ వద్ద డిజాస్టర్‌లుగా నిలిచాయి. మరీ డిజాస్టర్‌గా నిలిచిన ఆ టైటిల్ ఏమిటో తెలుసుకుందాం.బాలీవుడ్‌లో 'కర్జ్' అనే టైటిల్‌కు ఒక ప్రత్యేకమైన దురదృష్టకరమైన చరిత్ర ఉంది. ఈ పేరుతో వచ్చిన ప్రతి సినిమా బాక్సాఫీస్ వద్ద ఘోరంగా విఫలమైంది. మీరు చెప్పినట్లుగా, ఈ టైటిల్ కొందరి కెరీర్‌లపై తీవ్రమైన ప్రభావం చూపింది. ఆ మూడు సినిమాలు మరియు వాటి ప్రభావం గురించి మరింత వివరంగా చూద్దాం.కర్జ్ (1980): ఈ సినిమా నటుడు-దర్శకుడు సుభాష్ ఘాయ్ రూపొందించారు. ఇందులో రిషి కపూర్, టీనా మునీమ్ మరియు సిమి గరేవాల్ ముఖ్య పాత్రల్లో నటించారు. ఈ సినిమాలోని పాటలు సూపర్ హిట్ అయినప్పటికీ, సినిమా బాక్సాఫీస్ వద్ద పెద్దగా విజయం సాధించలేకపోయింది. అయితే, ఇది టీనా మునీమ్ కెరీర్‌ను ముగించలేదని చెప్పవచ్చు. ఆమె ఆ తర్వాత కూడా కొన్ని సినిమాల్లో నటించారు.

## జాకీచాన్ చిత్రం.. అజయ్ దేవగన్ వారసుడు ఎంట్రీ



పదేహేనేండ్ల తర్వాత ఓ హాలీవుడ్ సూపర్‌హిట్ క్లాసిక్ చిత్రానికి సీక్వెల్‌గా రూపొందించిన 'కరాటే కిడ్: లెజెండ్స్' విడుదలకు రెడీ అయింది. ఈ నెలాఖరున ఈ సినిమా థియేటర్లకు రానుండగా ఇప్పటికే ఈ చిత్ర ప్రచార కార్యక్రమాలు ఇప్పటికే అంతటా జోరుగా సాగుతున్నాయి. కొలంబియా పిక్చర్స్ నిర్మించిన ఈ సినిమాలో జాకీ చాన్ యుగ్ బెన్ వాంగ్ రాల్ఫ్ మచియో కీలక పాత్రలు పోషించారు. జోనాథన్ ఎంట్విస్లే దర్శకత్వం వహించారు. ఈ సినిమా మే 30న దేశవ్యాప్తంగా ఇంగ్లీష్, హిందీ, తెలుగు, తమిళ భాషల్లో థియేటర్లలో విడుదల కానుంది.అయితే.. ఈ సినిమాకు బాలీవుడ్‌లో ఓ ప్రత్యేకత ఏర్పడింది. సూపర్ స్టార్ అజయ్ దేవ్‌గణ్ ఈ సినిమాలో జాకీచాన్ పాత్రకు హిందీలో డబ్బింగ్ చెప్పగా ఆయన కుమారుడు యుగ్ దేవ్‌గణ్ సినిమాలో హీరో పాత్ర అయిన కథానాయకుడు లీ ఫాంగ్ పాత్రకు డబ్బింగ్ చెప్పడం విశేషం.దీంతో యుగ్ ఫస్ట్ టైం సినిమాల్లోకి ఎంట్రీ ఇచ్చినట్లైంది. అంతేకాదు అజయ్ దేవగణ్ తన టోటల్ సినీ కెరీర్‌లోనే ఫస్ట్ టైం ఓ అంతర్జాతీయ సినిమాకు డబ్బింగ్ చెప్పడమేకాక తండ్రీ కొడుకులు కలిసి ఓ చిత్రానికి వాయిస్ ఇవ్వడం ఇప్పుడు ప్రాధాన్యం సంతరించుకుంది. అంతేకాదు ఒక్కసారిగా ఈ 'కరాటే కిడ్: లెజెండ్స్' చిత్రంపై హిందీలో మంచి అంచనాలు ఏర్పడ్డాయి. ఇదిలాఉంటే గతంలో రెండు పర్యాయాలు షారుఖ్ ఖాన్, అతని కుమారులు మూడు నాలుగు హాలీవుడ్ చిత్రాలకు డబ్బింగ్ చెప్పగా మళ్లీ చాలా రోజుల తర్వాత బాలీవుడ్ నుంచి అజయ్ దేవగణ్ వంటి ఓ స్టార్ హీరో చెప్పారు. ఇక తెలుగులో డిస్నీ ఫ్రోజెన్ యానిమేషన్ సినిమాకు టాలీవుడ్ స్టార్ మహేశ్‌బాబు గారాల పట్టి సితార వాయిస్ అందించగా సినిమాలో డబ్బింగ్ చెప్పారు.

Edited,Printed,Published and Owend by Padakanti Venkateshwarlu,Printed at Daily Hindi Milap,#5-4-674,Kattelamandi,Hyderabad-500 001. Published at:6-3-4, Premnagar,Behind ASHOK MALL, Banjara Hills, Road#1, Hyderabad-500 034, Telangana. Editor : Padakanti Venkateshwarlu, (RNI TELTEL 2005/18007). e-mail : news9telangana@gmail.com. Office 040-2333 3349, 2333 3358, Cell 8331888861